ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 13, సెప్టెంబరు 2025

నేడు కొత్త కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్యతలు ఉంటాయని వెల్లడి

15, 16 తేదీల్లో కలెక్టర్ల సదస్సుకు హాజరు



ఒంగోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు 39వ కలెక్టర్‌గా నియమితులైన రాజాబాబు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్రటరీగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడ కలెక్టర్‌గా నియమిస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 12 జిల్లాలకు కలెక్టర్ల నియామకం చేసిన ప్రభుత్వం ఈ నెల 15, 16తేదీల్లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలో తక్షణం విధుల్లో చేరాలని ఆదేశించింది. దీంతో జిల్లాకు కలెక్టర్‌గా నియమితులైన రాజాబాబు శనివారం ఉదయం 11 గంటలకు ఒంగోలు ప్రకాశం భవనంలోని చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం జిల్లాలోని ముఖ్య అధికారులతో ఈనెల 15, 16 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కలెక్టర్ల సదస్సు అజెండా అంశాలపై సమీక్ష చేయనున్నట్లు సమాచారం. ఇదిలాఉండగా విధి నిర్వహణలో తన ప్రాధాన్యతలు ఉంటాయని రాజాబాబు చెప్పారు. ఇక్కడి 'ఆంధ్రజ్యోతి'తో శుక్రవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వ సర్వీసులో వివిధ హోదాల్లో పనిచేసిన తనకు జిల్లా గురించి కూడా కొంత అవగాహన ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించాక అక్కడి పరిస్థితులు, ప్రజల అవసరాలు పరిశీలించి ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా దృష్టి సారిస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు సంబంధిత వర్గాలకు పారదర్శకంగా, త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆలోచనలు, లక్ష్యాలకు అనుగుణంగా ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంతో పనిచేస్తానన్నారు. ఇక్కడి నుంచి గుంటూరు జిల్లాకు బదిలీ అయిన కలెక్టర్ తమీమ్ అన్సారియా కూడా శనివారం అక్కడ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

నిధులకు భరోసా


పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. నిర్దిష్ట చర్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. తాను ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఎట్టిపరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది జూన్‌కు తొలిదశ పనులు పూర్తిచేసి నీరు ఇవ్వాల్సిందేనని గురువారం ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షలో స్పష్టం చేశారు. లక్ష్యానికి అనుగుణంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేసమయంలో నిర్ణీత గడువులోపు పనుల పూర్తి, పునరావాస చర్యలకు అవసరమైన నిధులపై అధికారులకు భరోసా ఇచ్చారు.

వెలిగొండపై సీఎం సమీక్ష

పనుల పూర్తికి స్పష్టమైన ఆదేశం

- హామీ ప్రకారం తొలిదశ పూర్తికి చర్యలు
- రూ.2,059 కోట్లు అవసరమని అధికారుల ప్రతిపాదన
- వెంటనే అంగీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- పెండింగ్‌లో ఉన్న రూ.456 కోట్లకు తక్షణం క్లియరెన్స్





ఒంగోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాజా అంచనాల ప్రకారం వెలిగొండ ప్రాజెక్టు వ్యయ అంచనా సుమారు రూ.10వేల కోట్లకు చేరుతుండగా అందుకనుగుణంగా ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలోని పశ్చిమ ప్రాంతంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. అందులో భాగంగా ఆ ప్రాంతానికి అత్యంత కీలకమైన వెలిగొండ పూర్తిపై పలు సందర్భాలలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు భరోసా ఇస్తున్న సీఎం.. అందుకు అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు, ఇతర సందర్భాలలోనూ 2026 జూన్ నాటికి వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తిచేసి నీరివ్వనున్నట్లు సీఎం ప్రకటించి ఉన్నారు. ఆ మాటకు కట్టుబడి ఉన్నానని, తదనుగుణంగా పనులు పూర్తి చేయాల్సిందేనని మరోసారి ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు.

తక్షణం రూ.2వేల కోట్లు కావాలి

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టు పనులపై గురువారం సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష చేశారు. అందులో వెలిగొండ ప్రాజెక్టుపై లోతుగా సమీక్షించారు. రాష్ట్రస్థాయి జలవనరుల శాఖ ఉన్నతాధికారులతోపాటు ఇక్కడి

మిగతా 6వ పేజీలో



డీలర్‌కు ఈపోస్ మిషన్‌ను అందజేస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

డీలర్లకు కొత్త ఈపోస్ మిషన్లు

ఒంగోలు నగరంలో పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్డుదారులకు పటిష్టంగా రేషన్ పంపిణీకి ప్రజా ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఈపోస్ మిషన్లు డీలర్లకు అందజేసే కార్యక్రమం మొదలైంది. ఒంగోలు నగరంలో పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ మిషన్లను శుక్రవారం పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ పంపిణీలో అనేక మార్పులు చేపట్టింది. అందులో భాగంగా కొత్త ఈపోస్ మిషన్లను మంజూరు

మిగతా 6వ పేజీలో

నేడు పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలులోని పాత జడ్పీ సమావేశం హాలులో నిర్వహణ

7





జడ్పీ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వెంకాయమ్మ

మొక్కుబడి

సాదాసీదాగా జడ్పీ సమావేశం

ప్రజా సమస్యలపై చర్చించి ప్రభుత్వంతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశాన్ని వేదికగా చేసుకొని ఆయా సమస్యలపై విస్తృతంగా చర్చించాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారులు తూతూమంత్రంగా ముగించారు. అధికార పార్టీకి చెందిన కీలక ప్రజా ప్రతినిధులతోపాటు ఉన్నతాధికారులు హాజరు కాలేదు. నెల్లూరు, బాపట్ల జిల్లాల అధికారులు నామమాత్రంగా పాల్గొన్నారు. అజెండాలో పదికి పైగా అంశాలు ఉంచినప్పటికీ కేవలం రెండు మూడు శాఖలపైనే చర్చ సాగింది. పింఛన్లపై వైసీపీ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు కాసేపు హడావుడి చేశారు. మూడు గంటల్లోనే సమావేశాన్ని ముగించి మమ అనిపించారు.

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11.10 గంటలకు మొదలై మధ్యాహ్నం రెండు గంటలకు ముగిసింది. అజెండాలోని అంశాలపై సుదీర్ఘంగా చర్చించి ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా సమావేశానికి వచ్చామంటే వచ్చామన్నట్లుగా ఏదో కొంత మంది సభ్యులు మొక్కుబడిగా మాట్లాడారే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న

మిగతా 6వ పేజీలో

- ఏడు అంశాలపై చర్చ జరిగినా నామమాత్రమే
- హాజరు కాని టీడీపీ ప్రజాప్రతినిధులు, కలెక్టర్
- నెల్లూరు, బాపట్ల అధికారులు కూడా గైర్హాజరు
- కేవలం పింఛన్లపైనే కొంతసేపు చర్చ
- మూడు గంటల్లోనే ముగింపు

ఖనిజ సంపద ప్రైవేటు పరం

ఏఎంఆర్ కంపెనీకి జిల్లాలో సీనరేజీ వసూలు బాధ్యత

- నెలకు చెల్లించాల్సింది రూ.47.29 కోట్లు
- 25లోపు రంగంలోకి దిగనున్న కంపెనీ



ఒంగోలు క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ఖనిజ సంపద సీనరేజీ వసూలు బాధ్యతను ఏఎంఆర్ కంపెనీ దక్కించుకుంది. గత ప్రభుత్వ హయాంలో ఆరు జిల్లాల సీనరేజీ వసూలును ప్రైవేటు వారికి కట్టబెట్టారు. అదేక్రమంలో మన జిల్లాలో ఉన్న ఖనిజ సంపదను (తెల్లరాయి, ఇసుక) మినహా ప్రస్తుతం భూగర్భంలో లభ్యమయ్యే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గ్రానైట్, మార్కాపురం పలకలు, కంకర, గ్రావెల్ సీనరేజీ ఏఎంఆర్ కంపెనీ వసూలు చేయనుంది. నెలకు రూ.47.29 కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.1,134 కోట్లు ప్రభుత్వానికి చెల్లించనుంది. ఈనెల 25లోపు ప్రభుత్వం నుంచి ఏఎంఆర్ కంపెనీ సీనరేజీ వసూలు బాధ్యతను తీసుకోనుంది. ఈమేరకు ఉత్తర్వులు వచ్చాయి. దీనివలన గ్రానైట్, కంకర అక్రమ రవాణాకు చెక్‌పడుతుందని అధికారులు చెప్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ గ్రావెల్ అడ్డగోలుగా తవ్వి జేబులు నింపుకొంటున్న అక్రమార్కుల ఆటలు కూడా సాగవని అంటున్నారు. మైనింగ్ శాఖలో విజిలెన్స్ విభాగం పనిచేస్తున్నప్పటికీ గ్రానైట్ అక్రమాలను నిలువరించలేకపోతోంది. ఇక నుంచి ప్రైవేటు సైన్యం రంగంలోకి దిగనుంది.

అనేక ఇబ్బందులు ఖాయం

ప్రైవేటు కంపెనీ సీనరేజీ వసూళ్ల కోసం తమ సిబ్బందిని నియమించుకుంటుంది. ఈనేపథ్యంలో గ్రామాలలో తమ సొంత

మిగతా 6వ పేజీలో

ప్రభుత్వానికి పెరగనున్న ఆదాయం

ఇప్పుడు ఉన్న లెక్కల ప్రకారం ఉమ్మడి ప్రకాశంలో రూ.450 కోట్లు ఏటా సీనరేజీ రూపేణా ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. అంటే నెలకు రూ.37.50 కోట్లు లభిస్తుంది. నిబంధనల ప్రకారం గ్రావెల్, గ్రానైట్, కంకర రాళ్లకు ప్రభుత్వానికి సీనరేజీ చెల్లించాలి. అయితే వాటిని చెల్లించకుండానే చాలావరకు అక్రమంగా నిత్యం తరలిపోతోంది. అయితే ప్రైవేటు కంపెనీ నెలకు రూ.10కోట్లు అదనంగా చెల్లించేందుకు ముందుకొచ్చింది. దీని వలన ప్రభుత్వానికి ఎక్కువ మొత్తంలో ఆదాయం లభించనుంది.



వ్యర్థాలతో నిండి అధ్వానంగా ఉన్న కంభం చెరువు కాలువ

కంభం చెరువు కాలువలు అధ్వానం

- ఏటా మరమ్మతులకు నిధులు
- అయినా పేరుకుపోయిన మురుగు, వ్యర్థాలు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

7



రెండో ట్రాక్ వేసేందుకు తోలిన మెటీరియల్

రైల్వే లైన్ పనులు నత్తనడకన

- చివరి దశలో తీవ్ర జాప్యం
- దర్శికి రైలు ఎప్పుడు నడుస్తుందో తెలియని పరిస్థితి
- అదిగో.. ఇదిగో అంటూ ఊరింపులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

7

చివరి భూములకు నీరొచ్చేనా..?



ముడివేముల మేజర్‌లో డీవీఎన్ కాలనీ వద్ద అతితక్కువగా ప్రవహిస్తున్న నీరు

- ముడివేముల మేజర్‌కు ఏటా ఇదే పరిస్థితి
- ఎగువన ఉన్న రైతుల అధిక వినియోగంతో దిగువ ఆయకట్టుకు రాని వైనం
- వారబందీ ఏర్పాటు చేసుకోవాలంటున్న అధికారులు

త్రిపురాంతకం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సాగర్ నీరు పుష్కలంగా సరఫరా అవుతున్నప్పటికీ రైతుల మధ్య అవగాహన లేమితో చివరి భూముల వారికి కష్టాలు తప్పడం లేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలువల్లో పూడిక తీయడం, చిల్లచెట్ల తొలగింపు పనులు చేపట్టి రైతులకు నీటి సరఫరాకు అనుకూలంగా అభివృద్ధి చేశారు. అయితే ప్రస్తుతం మేజర్ల ద్వారా నీరు విడుదల చేసినప్పటికీ ఎగువన ఉన్న రైతులు వినియోగించుకుంటూ నీటిని అడ్డుకోవడం వలన కింది భూముల రైతులు వరి పంట వేయాలా? వద్దా? అన్న సందిగ్ధంలో ఉన్నారు. త్రిపురాంతకం మండలంలోని ముడివేముల మేజర్ పరిధిలో ఈ పరిస్థితి నెలకొంది. త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ పరిధిలోని మొత్తం 12 మేజర్లలో పెద్దది ముడివేముల కాలువ. మేజర్ అని పేరుకు మాత్రమే కానీ ఏటా ముడివేముల వరకు నీరు రావడం కష్టంగానే మారుతుందని రైతులు అంటున్నారు. దాదాపు 11కిలో మీటర్ల పొడవున ఉన్న ఈ మేజర్‌కు ప్రస్తుతం 35 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేజర్ కింద దాదాపు 7,500 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే ప్రధాన కాలువ నుంచి మేజరుకు వెళుతున్న ప్రారంభంలో దాదాపు 3 కిలో మీటర్ల వరకు ఉన్న ప్రవాహం రానురాను తగ్గుతోంది. ఆ తరువాత 7 కిలో మీటర్ల వరకు నీరు పూర్తిగా తగ్గి కనిపిస్తోంది. అంటే దాదాపు మిగిలిన 4 కిలోమీటర్ల వరకు నీరు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి ఎగువన నీటి వినియోగం అధికంగా ఉండటమే కారణం. సాధారణంగా వరినాట్లు కూడా పైభాగం నుంచి క్రమేణా కింది ప్రాంత రైతులు వేయడం పరిపాటి. కానీ.. ఏటా ఇదే పరిస్థితి అని తమకు నీరు రావడం అనుమానమేనని కింది భూముల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో రైతుల మధ్య కూడా అవగాహన ఉండాలని పగలు ఒక ప్రాంతం, రాత్రి పూట మరోప్రాంతం రైతులు నీటిని వినియోగించుకునేలా వారి మధ్య వారబందీ తరహా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పై భాగంలో ఉన్న రైతులు అడ్డుకట్టలు వేయకుండా

మిగతా 6వ పేజీలో

బెల్టు షాపులపై భగ్గుమన్న మహిళలు

- మంచికలపాడులో ఎనిమిది దుకాణాలు
- అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- పార్టీలకతీతంగా ర్యాలీగా వెళ్లి గొలుసు దుకాణాలు ధ్వంసం

6



ర్యాలీగా వెళ్తున్న మహిళలు

నిధులకు భరోసా

(5వ పేజీ తరువాయి)

నుంచి ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్, ఎస్ఈ అబూత్ ఆలీంలు పాల్గొన్నారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు సుమారు రూ.6వేల కోట్ల వరకు వెచ్చించారు. టన్నెళ్ల తవ్వకాలు, డ్యాంల నిర్మాణాలు, ప్రధాన కాలువల తవ్వకాలు, హెడ్ రెగ్యులేటరీ నిర్మాణం తదితర అనేక పనులు జరిగాయి. కాగా సీఎం ఆదేశాల మేరకు వచ్చే జూన్‌కు తొలిదశ పనులు పూర్తిచేసి లక్షా 19వేల ఎకరాలకు సాగునీరు, 8లక్షల మందికి తాగునీరు ఇవ్వాలంటే సుమారు రూ.2,059 కోట్లు నిధులు అవసరమని ఆ సమీక్షలో అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అందులో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు సంబంధించి రూ.456 కోట్లు పనులకు ఆర్థికశాఖ నుంచి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

సీఎంవో అధికారులకు ఆదేశాలు

ఆయా ప్యాకేజీల వారీగా నిధులు ఇచ్చేందుకు సమీక్షా సమావేశంలో అధికారులకు సీఎం చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న అనుమతులు తక్షణం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎంవో అధికారులను ఆదేశించిన ఆయన పునరావాస చర్యలకు అవసరమైన నిధులను తాను చూసుకుంటానన్నారు. మిగిలిన పనులకు సంబంధించి ఉన్నత స్థాయి అధికారులు అవసరానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ రకంగా నిధుల విషయంలో అధికారులకు భరోసా ఇచ్చిన సీఎం ఎట్టి పరిస్థితుల్లో తాను ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం వచ్చే జూన్‌కు తొలిదశ పనులు పూర్తిచేసి ప్రాజెక్టుకు నీరు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. మొత్తం మీద ప్రభుత్వ చర్యలు, సీఎం ఆదేశాలు వెలిగొండపై ఆశాజనక పరిస్థితిని సూచిస్తున్నాయి.

మొక్కుబడి

(5వ పేజీ తరువాయి)

సమస్యలను ప్రస్తావించలేదు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన అధికార పార్టీకి చెందిన మంత్రులు, శాసనసభ్యులు గైర్హాజరయ్యారు. వైసీపీకి చెందిన దర్శి, వైపాలెం ఎమ్మెల్యేలు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ తప్ప ఆపార్టీకి చెందిన చెందిన శాసనమండలి సభ్యులు కూడా హాజరు కాలేదు. మరోవైపు ఈ సమాశానికి ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులు కూడా రాలేదు. కేవలం ప్రకాశం జిల్లాకు చెందిన జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు, బాపట్ల జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ మాత్రమే హాజరు కాగా నెల్లూరు జిల్లా నుంచి జిల్లా స్థాయి అధికారి ఒక్కరు కూడా పాల్గొన లేదు.

నామమాత్రంగా చర్చ

సమావేశంలో తొలుత పంచాయతీరాజ్‌కు సంబంధించిన చర్చ ప్రారంభమైనప్పటికీ కేవలం పది నిమిషాల్లోనే ముగిసింది. అనంతరం డీఆర్‌డీఏపై చర్చ జరిగింది. ఎమ్మెల్యేలు శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌తోపాటు పలు మండలాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు మాట్లాడారు. ఏప్రాతిపదికన దివ్యాంగ పింఛన్లను తొలగిస్తారని ప్రశ్నించడమే తప్ప పూర్తిస్థాయిలో సమగ్రంగా చర్చించిన పరిస్థితి లేకుండాపోయింది. ఇలా వైద్యారోగ్య, విద్యుత్, వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖలపై చర్చ జరిగినా నామమాత్రంగానే ముగిసింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడం వల్లనే ఆయా సమస్యలపై చర్చ జరగలేదనేది స్పష్టమైంది. గతంలో జరిగిన జడ్పీ సమావేశంలో ఇరువురు రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి పాల్గొని ఆటు సభ్యులు అడిగిన ప్రశ్నలతోపాటు వారి దృష్టికి వచ్చిన ఆయా సమస్యలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కానీ ఈసారి సాదాసీదాగా ముగిసింది.

ఏ ప్రాతిపదికన తొలగిస్తారు

జిల్లాలో దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై పలు ప్రాంతాలకు చెందిన సభ్యులు సమావేశంలో ప్రశ్నించారు. థర్డ్ పార్టీతో విచారణ చేయించి ఏవిధంగా నోటీసులు ఇస్తారని నిలదీశారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో 3వేల మంది పింఛన్లను ఏప్రాతిపదికన తొలగించారని ప్రశ్నించారు. ఒకసారి సదరం సర్టిఫికెట్ తీసుకున్న తర్వాత థర్డ్‌పార్టీతో విచారణ చేయించి తక్కువశాతం ఉందని ఎలా నిర్ధారించారని ప్రశ్నించారు. ఈ విధంగా ఫించన్లు తొలగించడం సరికాదన్నారు. దర్శి నియోజకవర్గంలో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు చెల్లించినా ఇంతవరకూ వాటిని బిగించిన పరిస్థితి లేదన్నారు. వెంటనే వాటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పింఛన్లపై ధర్నా చేస్తాం

వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో 2,896 మంది ఫించన్లు తొలగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. వారందరికీ న్యాయం చేయకపోతే వారితో కలిసి ధర్నా చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కనీసం సమావేశంలో ఆయా అంశాలపై సమాధానం చెప్పేందుకు మంత్రులు రాకపోవడం దారుణంగా ఉందన్నారు. దోర్నాల వైద్యశాలలో సివిల్ సర్జన్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ వైద్యశాలలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని వెంటనే సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

జడ్పీటీసీ, ఎంపీపీలు తిరుపతిరెడ్డి, జి.లక్ష్మి, వేమా శ్రీనివాసరావుతోపాటు పలువురు మాట్లాడారు. రైతులు కష్టకాలంలో ఉన్నందున వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు సక్రమంగా ఎరువులు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలా కొంతమంది సభ్యులు మాత్రమే ఒకటి ఆరా ఆ ప్రాంతాలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించారే తప్ప ఇతరత్రా ప్రధానమైన వాటిపై మాట్లాడిన పరిస్థితి లేదు. సమావేశంలో జడ్పీ సీఈవో చిరంజీవితోపాటు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖనిజ సంపద ప్రైవేటు పరం

(5వ పేజీ తరువాయి)

పొలాల్లో మట్టి తవ్వకాలు జరిపినా ఆ సిబ్బంది వచ్చి సీనరేజీ వసూలు చేసే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఎక్కడైనా సొంత ఇంటి మెరకలకు చెరువు, వాగులలో గ్రావెల్ తవ్వకాలు చేస్తే కూడా ఇక నుంచి సీనరేజీ చెల్లించాల్సి వస్తుంది. దీంతో ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నట్లు కనిపించినా ప్రైవేటు సైన్యం వీరవిహారం చూడాల్సి ఉంటుంది. దీని వలన అనేక సమస్యలు కూడా ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది.

డీలర్లకు కొత్త ఈ పోస్ మిషన్లు

(5వ పేజీ తరువాయి)

చేసింది. వాటిని ఏవిధంగా వినియోగించాలన్న దానిపై డీలర్లకు అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ ఎఫ్ఐ రామకృష్ణ, విజన్ టెక్ అధికారి సాయి, డీలర్స్ అసోసియేషన్ ఒంగోలు నగర అధ్యక్షుడు బెజవాడ మురళీకృష్ణ, కార్యదర్శి నండూరి చంద్ర, కోశాధికారి సోమిశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ సలహాదారులు మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై భగ్గుమన్న మహిళలు

- మంచికలపాడులో బెల్టుషాపుల ధ్వంసం
- మందుబాబుల ఆగడాలతో విసిగి వేసారిన ప్రజలు
- పార్టీలకతీతంగా ఏకమై తొలుత గ్రామసభ నిర్వహణ


బెల్టుషాపులను ధ్వంసం చేస్తున్న మహిళలు

చీమకుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం మహమ్మారిపై మంచికలపాడు మహిళలు విరుచుకుపడ్డారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం అర్థరాత్రి అపరాత్రి అని తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు ఇక్కడకు వచ్చి మద్యం సేవించిన యువకులు విచ్చలవిడిగా, మహిళల పట్ల, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే చిన్నారుల పట్ల అనుచిత వైఖరికి గ్రామస్థులు విసిగివేశారు. మండలస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. గ్రామస్థులు అంతా ఏకమైన శుక్రవారం గ్రామసభ పెట్టి బెల్టుషాపుల ధ్వంసానికి అధికారికంగా తీర్మానం చేశారు. తమ గ్రామంలో మద్యానికి తావివ్వకూడదని దృఢనిశ్చయానికి వచ్చారు. తీర్మానానికి అనుగుణంగా గ్రామస్థులందరూ ర్యాలీగా వెళ్లి ముఖ్యంగా మందుబాబుల ఆగడాలకు విసిగి వేసారిన మహిళలు బెల్టుషాపులను ధ్వంసం చేసి మద్యం సీసాలను పగులకొట్టారు. వీరి ఆగ్రహాన్ని చూసిన బెల్టుషాపుల నిర్వాహకులు సైతం తాము జీవితంలో బెల్టుషాపులు నిర్వహించమని గ్రామస్థుల ముందు మాటిచ్చారు.

విచ్చలవిడిగా విక్రయాలతో విసిగివేసారి..

చీమకుర్తి మండల కేంద్రం నుంచి కూతవేటు దూరంలో ఉన్న మంచికలపాడు గ్రామంలో ఏకంగా ఎనిమిది బెల్టుషాపులను నిర్వహిస్తున్నారు. దుకాణాల్లో మందును విక్రయిస్తూ, అక్కడే తినుబండారాలను ఏర్పాటు చేసి కుర్చీలు, బల్లలు వేసి బార్ అండ్ రెస్టారెంట్‌ని తలపించేలా బెల్టుషాపులను నిర్వహిస్తున్నారు. మొదట్లో కాసింత గుట్టుగా జరిగిన ఈ వ్యవహారం రానురాను పట్టించుకొనేవారు కరువై విచ్చలవిడితనం అయింది. చీమకుర్తి, బండ్లమూడి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున ఇక్కడకి విచ్చేసి మద్యం సేవించటమే కాకా మందుబాబుల ఆగడాలు పెచ్చరిల్లాయి. గ్రామస్థులు, ఇదే పంచాయతీ పరిధిలో ఉన్న చీమలమర్రివాసులు పార్టీలు, కులాలకు అతీతంగా ఏకమయ్యారు. పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు ప్రజాప్రతినిధులందరూ గ్రామ స్వరాజ్యాన్ని తలపించేలా గ్రామసభను నిర్వహించారు. మద్యం మహమ్మారిని తమ గ్రామం నుంచి తరిమి వేయాలని ముక్తకంఠంతో తీర్మానం చేశారు. అనంతరం ర్యాలీగా తరలివెళ్లి బెల్టుషాపులను ధ్వంసంచేసి మద్యం సీసాలను పగులగొట్టారు. శుక్రవారం జరిగిన గ్రామసభలో సర్పంచ్ పెరికల నాగేశ్వరావు, ఎంపీటీసీ అత్యాల అంకయ్య మాజీ సర్పంచ్ చలువాది శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పొన్నపల్లి శ్రీనివాసరావు, ఉల్లి సుబ్బారావు, పొన్నపల్లి వెంకట్రావు, కోరా సుబ్బారావు, అత్యాల ఏసోబు, వైసీపీ నాయకులు పొన్నపల్లి సుబ్బారావుజనసేన నాయకులు చలువాది నాగేశ్వరావు, శ్రీను, నాగరాజు, మహిళలు పాల్గొన్నారు.

భార్య సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.47 లక్షలు రుణం

- నిందితుడిని అరెస్టు చేసిన తాలుకా పోలీసులు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భార్య సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.47 లక్షలు రుణం తీసుకొని మోసం చేసిన గునుపాటి రఘునాథ్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ తెలిపారు. బేస్తవారపేట మండలం వంగపాడుకు చెందిన గునుపాటి రఘునాథ్‌రెడ్డికి ఒంగోలు రెవెన్యూ కాలనీకి చెందిన రేఖతో 2015లో వివాహం అయింది. అయితే వారి మధ్య మనస్పర్థలు రావడంతో 2022 నుంచి వారు ఇరువురు విడిగా ఉంటున్నారు. కోర్టుకు వెళ్లి అస్తుల విషయంలో కూడా రాజీపడ్డారు. అయితే ఎంబీఏ చదువుకున్న రేఖ పీఎంజీవై రుణం కోసం బ్యాంక్‌కు వెళ్లగా అమె పేరుతో చోళమండలం ఇన్వెస్టిమెంట్ కంపెనీలో రూ.47 లక్షలు రుణం తీసుకున్నట్లు ఉంది. దీనిపై విచారించగా రేఖ పేరుతో ఉన్న ఆస్తిని కుదవ పెట్టి అమె సంతకం ఫోర్జరీ చేసి రూ.47 లక్షలు రుణం తీసుకున్నాడు. దీంతో రేఖ ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి రఘునాథ్‌రెడ్డిని శుక్రవారం అరెస్టు చేసినట్లు తెలిపారు.

19న జాబ్‌మేళా

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 19న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రకాల బహుళజాతీయ కంపెనీలతో నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఫిరోజ్ గాంధీ 7013950097 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి



సంతమాగులూరు సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు ఎస్సీ కాలనీకి చెందిన పల్లె పోగు విజయ్‌బాబు(19) శుక్రవారం సాయంత్రం లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం... పల్లెపోగు విజయ్‌బాబు నర్సరావుపేటలోని నందమూరి బసవ తారక రామారావు డిగ్రీ కళాశాలలో బీకాం సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. రోజూ ఏల్చూరు గ్రామం నుంచి బస్సు పాస్‌తో నరసరావుపేట చేరుకొని కాలేజీకి వెళ్లేవాడు. శుక్రవారం మోటార్ సైకిల్‌పై కాలేజీకి వెళ్లి తిరుగు ప్రయాణంలో పల్నాడు జిల్లా, ఉప్పలపాడు వద్ద లారీని తప్పించబోయి ఢీకొట్టాడు. విజయ్ బాబు తండ్రి ఆశీర్వాదం చెన్నైలో బేల్దారీ పనులకెళ్లారు. విజయ్‌బాబు ఏల్చూరులో నాయనమ్మ దగ్గర ఉంటూ కాలేజీకి వెళుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఏల్చూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి.


ఆక్రమణలో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలం ఇదే

ఆక్రమణల్లో ఆర్‌అండ్‌బీ స్థలం

- దర్జాగా నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేసుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు

దొనకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దొనకొండ సమీపంలోని నాల్గురోడ్ల కూడలి అడ్డరోడ్డు వద్ద లక్షల రూపాయల విలువచేసే ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన విలువైన స్థలం ఆక్రమణకు గురవుతోంది. ఇప్పటికే కొంతభాగాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారు. ఇందులో వ్యాపారాలు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు.

దొనకొండ-దర్శి, కురిచేడు-పొదిలిలకు వెళ్లే నాలుగురోడ్ల కూడలిలో ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 245లో రోడ్డుకు ఒక వైపు దాదాపు 30 సెంట్ల ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన భూమి ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెంటు భూమి సుమారు రూ.5లక్షల వరకు ధర పలుకుంది. అటువంటి విలువైన భూమికి సంబంధిత అధికారులు నేటి వరకు ఎటువంటి హద్దులు, కంచె లాంటి భద్రత చర్యలు చేపట్టకపోవటంతో కబ్జాదారులకు కలిసొచ్చింది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజు ఆమార్గంలోనే రాకపోకలు సాగిస్తున్న అధికారులకు ఆక్రమణలు కనిపించకపోవడం విస్మయం కలిగిస్తుంది. ఈ భూములకు పన్నులు వేసి అధికారికంగా హోదా కల్పిస్తూ ఆక్రమణదారులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు ఇదేరీతిన వ్యవహరిస్తే విలువైన ప్రభుత్వ భూమి పూర్తిస్థాయిలో ఆక్రమణకు గురయ్యే ప్రమాదముంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు

దొనకొండ అడ్డరోడ్డు వద్దగల ఆర్‌అండ్‌బీ భూమి ఆక్రమణకు గురైన విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే పూర్తిస్థాయిలో విచారించి తగిన చర్యలు చేపడతాం.

- శివకృష్ణ, ఆర్‌అండ్‌బీ డీఈ, పొదిలి

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా గ్రామ సచివాలయాలు

» అర్ధరాత్రి మందుబాబుల చిందులు » తలుపులు, కిటికీలు దొంగల పాలు



కురిచేడులోని గ్రామ సచివాలయం

కురిచేడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలను వినియోగంలోకి తీసుకురాకపో వడంతో


అపహరణకు గురైన కిటికీలు

అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారాయి. కురి చేడు ఎన్నెస్పీ కాలనీలో నూతనంగా సచివాలయం, వి లేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. వాటిని ప్రారంభించారు కానీ అధికారులెవరూ వాటిల్లో చేరలేదు. దీంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయం గా మారాయి.

2023 డిసెంబరు 9న నూతన భవనాలను ప్రారంభించారు. వీటిల్లో అధికారులు చేరి పాలన ప్రారంభించలేదు. దీంతో చిల్లచెట్లు మొలచాయి. అర్ధరాత్రి సమయాలలో నూతన భవనాల అరుగుల మీద కూర్చొని కొంతమంది మందుతాగుతున్నారు. మందుబాబుల సంఖ్య పెరగిపోవంతో పోలీసులు దృష్టి పెట్టడంతో తగ్గింది. అయితే, రాత్రుళ్లు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. రోడ్డుకు దూరంగా ఉండటం, భవనాల పక్కన నివసించేవారు ఎవరూ లేకపోవంతో వీరి ఆగడాలకు అడ్డేలేకుండాపోయింది. గ్రామ సచివాలయం, విలేజ్ హెల్‌త క్లినిక్‌ల తలుపులు పగులకొట్టారు. సచివాలయం కిటికీల అద్దాలు, అల్యూమినియం బీడింగ్‌లు దొంగలు తీసుకెళ్ళారు. లైట్లు సైతం చోరీకి గురయ్యాయి. ఆ భవనాలను అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పొగాకు రైతులకు ప్రత్యామ్నాయ, పంటమార్పిడిపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఎం రామారావు

పంటమార్పిడి, ప్రత్యామ్నాయాలపై రైతులు దృష్టి సారించాలి

- రీజనల్ మేనేజర్ రామారావు

పొదిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగుచేస్తున్న రైతులు పంటమార్పిడిపై దృష్టిసారించాలని పొగాకుబోర్డు రీజినల్ మేనేజర్ ఎస్. రామారావు అన్నారు. శుక్రవారం స్థానిక పొగాకుబోర్డు ఆవరణలో వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పొగాకు రైతులకు ప్రత్యామ్నాయ, పంటమార్పిడిపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వచ్చే సంవత్సరం ఎఫ్‌సీవీ పొగాకుసాగు తగ్గించుకొని ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పంటమార్పిడి చేయడం వలన మంచి దిగుబడి రావడంతో పాటు నాణ్యమైన పంట వస్తుందన్నారు. ప్రతిఏడాది వేసిన పంటనే వేయడం వలన దిగుబడి తగ్గడంతోపాటు నాణ్యత లోపిస్తుందని, తద్వారా ఆశించిన ధరలు రాకపోవడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. రానున్న పంటకాలంలో ప్రత్యామ్నాయ పంటలైన కంది, మినుము, మిరప వంటిపంటలు సాగుచేయవచ్చన్నారు. వచ్చే సంవత్సరం పొగాకుపంట నియంత్రణ తప్పనిసరిగా పాటించాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి డి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పొగాకుపంట తగ్గించాలని ప్రత్యామ్నాయ పంటలసాగు చేసిన రైతులు తప్పకుండా ఈక్రాపింగ్ చేయించుకోవాలని చెప్పారు. సమావేశంలో దర్శి కేవీకే శాస్త్రవేత్త టి. వెంకటేశ్వరరెడ్డి, కనిగిరి, పొదిలి పొగాకుబోర్డుల పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- పంచాయతీ కార్మికుల ఆందోళన


నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి):పది నెలలుగా పెండింగులో ఉన్న వేతనాలు ఇవ్వాలని పంచాయతీ కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట మండల సీఐటీయూ ఆధ్వర్యంలో ఒప్పంద కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికులు నిరసన వెలిబుచ్చారు.ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు డీ సోమయ్య మాట్లాడుతూ ఒప్పందపు కార్మికులకు పది నెలల జీతాలు, స్వచ్ఛంద కార్మికులకు 6 నెలల జీతాలు పెండింగులో ఉన్నాయని అన్నారు. నెలల తరబడి జీతాలు ఇవ్వక పోతే వారి కుటుంబ పోషణ ఎలా జరుగుతుందన్నారు.సంబంధిత అధికారులు స్పందించి వెంటనే జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపు నిరసన అనంతరం విధుల్లోకి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు ఎం. అచ్చయ్య, దేవమ్మ, కాశయ్య, కిరణ్, పెద్ద ఏసు, అరుణ్, రైతు సంఘం నాయకులు తిరుపతి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వొద్దుల వీరారెడ్డి కోరారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ రణభేరీ జాత పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ నూతన ప్రభుత్వంపై పలువురు ఉపాధ్యాయులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, 15 నెలలు కావసున్నా ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక పరమైన బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోవడంతో వారిలో ఆందోళన ఏర్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, వెంకటేశ్వర్లు, పాపయ్య, చెన్నారెడ్డి, జయరామిరెడ్డి, శ్రీనివాస్, రాజేశ్, చంద్రశేఖర్, వెంకటరెడ్డి, కాశింపీరా తదితరులు పాల్గొన్నారు.

మత్తుమందులు వినియోగిస్తే చర్యలు

- జిల్లా ఉపసంచాలకులు వీఎస్ జ్యోతి

పొదిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మత్తుమందులు వినయోగిస్తే కఠిన చర్యలు తప్పవని ఔషధ నియంత్రణ జిల్లా ఉపసంచాలకులు వీఎస్ జ్యోతి అన్నారు. శుక్రవారం స్థానిక మహర్షి పాఠశాల ప్రాంగణంలో మత్తుమందులు, యాంటీబయోటిక్ దుర్వినియోగంపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మత్తుమందులు, యాంటీబయోటిక్స్ వాడటం వలన దుష్పరిణామాలు ఉంటాయని తెలిపారు. మత్తుమందులు వినియోగంపై ఫిర్యాదు కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1972కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఔషధ తనిఖీ అధికారి ఉషారాణితోపాటు ఈగల్‌టీం సభ్యులు మునాఫ్, సత్యనారాయణ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

చివరి భూములకు నీరొచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

కనీసం వచ్చే నీటిని వదిలినా చాలావరకు సమస్య ఉత్పన్నం కాదని రైతులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి చివరి భూముల రైతులకు చిక్కులు తప్పేలా లేవన్నది స్పష్టమవుతోంది.

రైతులే జాగ్రత్తగా వినియోగించుకోవాలి
శివన్నారాయణ, ఎన్నెస్పీ ఏఈ

రైతులే నీటి వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వారబందీలాగా అవగాహనతో నీటిని చివరి భూముల వారికి అందేలా చూసుకోవాలి. సాగునీటి సంఘాల ప్రతినిధులు కూడా ఇందుకోసం కృషి చేయాలి. సాగునీరు సమృద్ధిగా వస్తోంది. కాలువలు కూడా చాలావరకు మరమ్మతులు చేసిన కారణంగా నీటి సరఫరాకు ఆటంకాలు లేవు. రైతులు ఆటంకాలు సృష్టించుకోవద్దు.

వరికి నీరు అందదనే ప్రత్యామ్నాయ పంటలు



ఏటా ఇదే పరిస్థితి మాకు నెలకొంటుంది. చివరి భూములకు నీరు అందడం కష్టమే. అందుకే నేను 2 ఎకరాలు వరి పంట వేసుకుని మిగిలిన 4 ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేస్తున్నా. ప్రత్యామ్నాయం తప్పదని అనిపించింది.

- టి.శ్రీనివాసులు, రైతు డివిఎన్ కాలనీ

మొక్కజొన్నతో సరిపెట్టుకుంటున్నాం

- తిరుమలబాబు, డీవీఎన్ కాలనీ



సాగర్ నీరు అందుబాటులో ఉన్నా మా గ్రామాలకు వచ్చేది అనుమానమే. పైభాగంలో ఉన్న రైతులు వినియోగించుకుంటున్నారు. చివరి భూముల వరకు నీరు రావడం కష్టమే. దీంతో నేను దాదాపు 14 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నా. చాలామంది రైతులు చివరి భూముల్లో ఇదే తరహాలో ప్రత్యామ్నాయం చూసుకోక తప్పదు.

పోలీసులు మైత్రీభావంతో మెలగాలి

బల్లికురవ పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

బల్లికురవ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ప్రజలతో పోలీసు సిబ్బంది మైత్రీభావంతో మెలిగి గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా చర్యలు చేపట్టాలని బాపట్ల డీఎస్పీ గోగినేని రామంజనేయులు చెప్పారు. శుక్రవారం బల్లికురవ పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ వార్షిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, పెండింగ్‌లో ఉన్నవి, వాటి పురోగతిపై వివరాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలపై వచ్చే వారి వివరాలను శ్రద్ధగా విని వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అలానే బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు చేపట్టాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహనదారులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సంతమాగులూరు సర్కిల్ సీఐ కాకుమాను వెంకట్రావు, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

అక్రమ వినియోగానికి రూ.2.50 లక్షల అపరాధ రుసుం

కొండపి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా విద్యుత్ వినియోగిం చుకుంటున్న, కేటగిరీ మార్చి విద్యుత్ వాడుకుంటున్న 27 సర్వీసులను విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడిచేసి యజమానులకు రూ.2.50 లక్షలు అపరాధ రుసుం విధించామని విద్యుత్‌శాఖ కందుకూరు ఈఈ ఎం.నాగేశ్వరరావు, ఒంగోలు విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఈఈ టి.హైమావతి తెలిపారు. దాడుల అనంతరం కొండపిలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో వారు విలేకరులకు వివరాలను వెల్లడించారు. వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడకుండా, విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. దాడుల్లో అధికారులు, సిబ్బంది 32 బృందాలుగా ఏర్పడి 3250 సర్వీసులు తనిఖీ చేశారన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ సింగరాయకొండ డీఈ పి. యుగంధర్, పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైళ్లలోని ప్రయాణించే వారి సెల్‌ఫోన్లు కొట్టేసే దొంగను అరెస్టు చేసినట్లు రైల్వే సీఐ షేక్ మౌలాషరీఫ్ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. వేటపాలేనికి చెందిన ఆసాది చంగల్‌రావు రైళ్ళలో సెల్‌ఫోన్‌లు దొంగతనాలు చేస్తూ వచ్చిన డబ్బుతో జల్సాగా తిరుగుతుంటాడు. మొత్తం అతని వద్ద రూ.1.49 లక్షల విలువైన 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. సమావేశంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ కొండలరావు, ఒంగోలు రైల్వే ఎస్ఐ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ కార్యదర్శులకు
ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులు కల్పించేందుకు శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాలో ఉన్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లందరూ హాజరుకావాలన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతకంతో ఆప్షన్ ఫారం సమర్పించాలన్నారు. ఎస్సీఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు తగు సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన కోరారు.

బీరు సీసాతో ట్రాక్టర్ డ్రైవర్ పై దాడి

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక నెల్లూరు బస్టాండ్ వద్ద ఉదయం 8.30 గంటలకు బీరు సీసాతో అకారణంగా ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడి చేశాడు. ఈ సంఘటన స్థానిక నెల్లూరు బస్టాండ్‌లో ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద శుక్రవారం జరిగింది. పెళ్ళూరుకు చెందిన పోనంకి అయప్ప ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అయప్ప ఉదయం 8.30 ప్రాంతంలో నెల్లూరు బస్టాండ్‌లో గల బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో తన ట్రాక్టర్‌ను నిలిపివేసి అక్కడ స్నేహితులు ఉంటే దిగి మాట్లాడుతున్నాడు. అదే సమయంలో స్థానిక భాగ్యనగర్‌కు చెందిన ఎస్‌కే అనిల్ పూటుగా మద్యం సేవించి బార్‌లో నుంచి బీరు సీసాతో బయిటకు వచ్చి అక్కడ ఉన్న అయప్పపై బీరు సీసాతో దాడి చేశాడు. ఈ మేరకు అయప్పకు తలపై గాయం అయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి అనిల్‌ని అదుపులోకి తీసుకొని క్షతగాత్రుడైయిన అయప్పను ఆసుపత్రి పంపించారు.

వైద్యశాలకు పోలీసుల సాయం

కంభం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కంభం ప్రభుత్వ వైద్యశాలకు కంభం, బేస్తవారిపేట పోలీసులు వీల్ చైర్, స్ట్రక్చర్లు బహూకరించగా అర్ధవీడు పోలీసులు వైద్యశాలలో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించారు. వైద్యశాలలో రోగులకు అవసరమైన ఉపకరణాలను బహూకరించిన కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు పోలీసులకు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ప్రియదర్శిని, వైద్యశాల బృందం కృతజ్ఞతలు తెలిపింది.

రైల్వేలైన్ పనులు నత్తనడక

- చివరి దశలో తీవ్ర జాప్యం
- దర్శికి రైలు ఎప్పుడు నడుస్తుందో..
- అదిగో.. ఇదిగో అంటూ ఊరింపులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

దర్శి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణ పనులు చివరిదశలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ఏడాదిగా ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గత ఏడాదిగా దర్శి ప్రాంతానికి రైళ్లు నడుపుతామని అధికారులు, ప్రజాప్రతినిధులు ఊరిస్తున్నారే తప్ప ఆచరణలో అమలుకాలేదు. అదిగో..ఇదిగో అంటూ ప్రతి మూడు నెలలకొకసారి ఆర్భాటంగా ప్రకటనలు ఇస్తున్నారే తప్ప దర్శి ప్రాంత ప్రజల కల నెరవేరలేదు.

నడికుడి నుంచి శ్రీకాళహస్తి వరకు 309 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. తొలిదశలో నడికుడి నుంచి కనిగిరి వరకు 155 కిలోమీటర్లు రైల్వేలైన్ నిర్మాణం 90శాతం పూర్తయింది. కనిగిరి వద్ద ఎన్‌హెచ్‌ఏ రహదారిపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. అదే ప్రాంతంలో క్వారీ వద్ద 300 మీటర్లు రైల్వేట్రాక్ వేయాల్సి ఉంది. కనిగిరి, కందుకూరు రోడ్డులో బ్రిడ్జి నిర్మాణం చివరి దశలో ఉంది. అక్కడక్కడా రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు పూర్తిచేయాల్సి ఉంది. అందులో భాగంగా దర్శి రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు చాలావరకు జరిగినప్పటికీ ఇంకా కొన్ని పనులు అక్కడ పూర్తికాలేదు. రైల్వేస్టేషన్ వద్ద కూడా రైల్వే ట్రాక్ మాత్రమే నిర్మించారు. మిగిలిన ట్రాకులు నిర్మించేందుకు మెటీరియల్ తోలారు. ఏ కారణం చేతనో గత ఏడాది నుంచి ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పనులు ఎప్పుడు పూర్తవుతాయో, దర్శి ప్రాంతానికి రైలు ఎప్పుడు నడుపుతారో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. చివరిదశలో పనులు జాప్యం జరగటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



రైల్వేస్టేషన్ వద్ద అసంపూర్తిగా ట్రాక్ పనులు

అమలుకు నోచుకోని మాగుంట హామీ

ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన హామీ ఏడాదిగా అమలుకు నోచుకోలేదు. గత ఏడాది అక్టోబరులో టీటీడీ కల్యాణ మండపం శంకుస్థాపనకు ఇక్కడకు వచ్చారు. ఆ సందర్భంగా రైల్వే నిర్మాణం పనులు పరిశీలించారు. అధికారులతో మాట్లాడి 2025 జనవరిలో సంక్రాంతికి రైళ్లు నడిచే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించి హామీ ఇచ్చి ఏడాది గడుస్తుంది. నిలిచిపోయిన పనులు అప్పుడు ఎలా ఉన్నాయో ఇప్పుడు అలాగే ఉన్నాయి. దీంతో వచ్చే సంక్రాంతికైనా రైళ్లు నడుస్తాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. నడికుడి నుంచి కనిగిరి వరకు రైల్వేలైన్ నిర్మాణం పూర్తయినందున మిగిలిన పనులను వెంటనే పూర్తిచేసి వీలైనంత త్వరగా రైళ్లు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

పాకలలో టీచర్ల మధ్య రగడ

- ఉపాధ్యాయుడిపై దాడిచేసిన మహిళా హెచ్‌ఎం
- ఆమెను మార్చాలని తల్లిదండ్రులు ఫిర్యాదు

సింగరాయకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని చెల్లమ్మగారి పట్టపుపాలెం ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్‌ఎం తిమ్మ విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు జాలయ్య మధ్య రగడ చోటచేసుకుంది. ఇరువురు మధ్య మాటమాట పెరగడంతో ఉపాధ్యాయుడిపై హెచ్‌ఎం ఒకదశలో చేయిచేసుకుంది. జాలయ్య ఇటీవల భీమవరం పాఠశాల నుంచి బదిలీపై పాకల చెలమ్మగారి పట్టపుపాలెం పాఠశాలకు వచ్చారు. హెచ్‌ఎంగా ఎవరు ఉండాలనే విషయంపై కొన్ని రోజుల నుంచి ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. మెరిట్‌లో విజయలక్ష్మి ఉండటంతో ఆమే హెచ్‌ఎంగా ఉండాలని ఎంఈవో-1 సూచించారు. అప్పటి నుంచి ఇరువురు మధ్య పాఠశాలలో సమన్వయం లేదు. ఈ క్రమంలో గురువారం పాఠశాలకు ఆశావర్కర్ రెండు యూనిఫాం కోట్‌లు తీసుకొని వచ్చారు. అవి విద్యార్థులు వేసుకొని ఉపాధ్యాయులతో ఫొటో తీసుకోవాలని టీచర్ జాలయ్యను అడిగారు. తనకు సంబంధంలేదని హెచ్‌ఎం వద్దకు పోవాలని సూచించారు. ఈ క్రమంలో హెచ్‌ఎం నా దగ్గరకు మీరు ఎందుకు పంపిస్తారు. ఐదో తరగతి టీచర్ మీరే కదా.. మీరే ఫొటో తీయాలని ప్రశ్నించారు. ఇరువురి మధ్య వాదులాట జరిగింది. సహనం కోల్పోయిన హెచ్‌ఎం విజయలక్ష్మి జాలయ్య చెంపపై కొట్టారు. విషమం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని సమస్యను ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే డీఈవో ఆదేశాల మేరకు ఏంఈవో-2 ఆవుల శ్రీనివాసరావు పాఠశాలకు వెళ్లారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయుడిని విచారించారు. తనను బూతులు తిడుతూ అసభ్యంగా మాట్లాడినందుకే చెంపపై కొట్టానని ఎంఈవోకు హెచ్‌ఎం చెప్పారు. ఆశావర్కర్‌ను ఫొటో తీయడానికి హెచ్‌ఎం వద్దకు పంపినందుకే పెద్దపెద్దగా అరస్తూ తనపై దాడి చేశారని ఉపాధ్యాయుడు జాలయ్య ఎంఈవోకి వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను విచారించగా పాఠశాలలో తరుచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయని హెచ్‌ఎం మూడేళ్ల నుంచి పనిచేస్తున్నా తమ పిల్లలకు సరిగా విద్య రావడం లేదని తెలిపారు. ఆమెను తమ పాఠశాల నుంచి మార్చాలని కోరారు. ఎంఈవో-2 శ్రీనివాసరావు ఈ మూడు నివేదికలను డీఈవో కిరణ్ కుమార్‌ను కలిసి అందజేశారు.

అధ్యాపకుల పోరు.. విద్యార్థులు ఏమౌతారు?

- కొమరోలు ప్రభుత్వ కళాశాలలో రచ్చ

కొమరోలు,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవితను తీర్చిదిద్దాల్సిన అధ్యాపకులే వారి భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తున్న వైనం కొమరోలు మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో చోటుచేసుకుంది. కొమరోలు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని గ్రూపులు కలిపి 150 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులు, ఆరుగురు కాంట్రాక్టు అధ్యాపకులు, ఇద్దరు గెస్టు అధ్యాపకులు, నలుగురు కార్యాలయ సిబ్బంది ఉన్నారు. గతంలో నంద్యాల శ్రీనివాసులు ప్రిన్సిపాల్‌గా ఉన్నసమయంలో చిన్నచిన్న గొడవలు తరచూ వస్తూ ఉండేవి. ఆయన రిటైర్ అయిన తర్వాత కళాశాల పెత్తనం కోసం కార్యాలయ సిబ్బందిలో ఒకరు, కాంట్రాక్టు అధ్యాపకుడి మధ్య గొడవలు మొదలయ్యాయి. కళాశాల ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో ఏకంగా విద్యార్థుల ముందే చెప్పులతో కొట్టుకోవడం, అసభ్యపదజాలంతో తిట్టుకోవడం చర్చనీయాంశమైంది. దీనికి తోడు కొందరు విద్యార్థుల ద్వారా ఒకరిపై మరొకరికి ఫిర్యాదులు చేస్తూ కళాశాల ప్రతిష్టను దిగజార్చే విధంగా నిందారోపణలు చేసుకుంటున్నారు. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలిసి ఒకసారి పంచాయితీ చేసి హెచ్చరించినా ఫలితం లేదు. విద్యార్థులతో ఆరోపణలు చేయించిన విషయం తెలుసుకున్న గిద్దలూరు సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు వీరిపై విచారణచేసి అధ్యాపకులను హెచ్చరించారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలని హెచ్చరించారు. అయినా వీరి తీరు మాత్రం మారలేదు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరిగాలేదని ఆరోపిస్తూ విలేకరులకు విద్యార్థులు తెలిపినట్లు ఉత్తరాలు రాశారు. ఈ మేరకు కళాశాలకు వెళ్లి విచారించగా అసలు విషయం తెలిసింది. కళాశాల గొడవలపై ప్రస్తుత ప్రిన్సిపాల్ పి.సద్గుణరావు మాట్లాడుతూ విషయాలన్నింటిని ఉన్నతాధికారులకు తెలియజేశానని వివరించారు. గుంటూరు ఆర్‌జేడీ పద్మజను ఈ విషయమై వివరణ కోరగా కళాశాలలో గొడవలకు కారణమైన ఇరువురిని కళాశాల నుంచి వేరే కళాశాలలకు బదిలీ చేస్తున్నామని, త్వరలో ఈ కళాశాలను సందర్శించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కంభం చెరువు కాలువలు అధ్వానం

- ఏటా మరమ్మతులకు నిధులు
- అయినా మురుగు, వ్యర్థాలతో పంట కాలువలు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



ఇది డ్రైనేజీ కాలువ కాదు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన ఇరిగేషన్ పంటకాలువ



ఇరిగేషన్ కాలువపై నిర్మించిన చప్టా కింద పేరుకుపోయిన వ్యర్థాలు

కంభం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఐదువేల హెక్టార్ల విస్తీర్ణం కలిగిన కంభం చెరువు నుంచి వేలాది ఎకరాలకు నీటిని తరలించే పంట కాలువలు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా డ్రైనేజీలకంటే అధ్వానంగా మారాయి. చెరువు నుంచి సుమారు 20 ప్రధాన పంట కాలువలు ఉండగా వాటి నుంచి మరో 35కుపైగా సప్లై చానళ్లు ఉన్నాయి. ఈ కాలువలన్నీ వ్యర్థాలతో పేరుకుపోయి మురుగు కాలువలుగా మారి కంపు కొడుతున్నాయి. పట్టణంలోని వీధుల నుంచి ప్రవహించే మురుగును ప్రజలు ఈ ప్రధాన పంట కాలువల్లోకి యథేచ్ఛగా వదులుతున్నారు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో మరికొంతమంది మరుగుదొడ్ల కనెక్షన్లు సైతం కాలువల్లోకి ఇచ్చారు. దీంతో సప్లై చానళ్లలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి కాలుష్యం పెరిగి ముక్కు పుటాలు అదిరేలా దుర్వాసన వెదజల్లుతూ దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో సమీప కాలనీలవాసులు రోగాల బారిన పడుతున్నారు. దీనికి తోడు పందులు చేరి మరింత అపరిశుభ్రతను కలుగజేస్తున్నాయి.

ఇరిగేషన్ అధికారులకు కల్పతరువులా మారిన పంట కాలువలు

కాలువలపై ఆక్రమణలు, మురుగునీటిని వదిలే వారిని పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు కాలువలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు ప్రభుత్వం ఏటా లక్షల రూపాయల నిధులను మంజూరు చేస్తుండడంతో వారు తూతూమంత్రంగా పనులు చేసి వదిలివేస్తున్నారు. ఈ ఏడాది కూడా కాలువల మరమ్మతులు, వ్యర్థాలను తొలగించేందుకు రూ.50లక్షలుపైగా నిధులు మంజూరు అయ్యాయి. కాలువల్లో చెత్త తీస్తున్నామని అధికారులు చెబుతున్నా ఎక్కడి మురుగు, చెత్త అక్కడే ఉండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ చెరువుకు పుష్కలంగా నీరు వచ్చి కాలువలకు వదిలితే చివరి ఆయకట్టుకు నీరు రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చిత్తశుద్ధితో కాలువలను శుభ్రం చేయించడంతోపాటు కాలువలలోకి మురుగునీరు, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

రైలు కింద పడి ప్రయాణికుడి ఆత్మహత్య

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ప్రయాణికుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పెళ్లూరు సమీపంలో గల రైల్వే ట్రాక్‌పై శుక్రవారం జరిగింది. పెళ్లూరుకు చెందిన వడ్డారపు సూరయ్య (55) అనారోగ్య కారణంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు ఒంగోలు రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వద్దన్నా.. భర్లీ పొగాకు సాగు



తర్లుపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది బర్లీ పొగాకు వేసిన రైతులు భారీ నష్టాలు వచ్చినప్పటికీ మళ్లీ అదే పంటవైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలో సీతానాగులవరం, తర్లుపాడు, తాడివారిపల్లె తదితర గ్రామాల్లో వారం రోజుల నుంచి ముమ్మరంగా వైట్ బర్లీ, నల్లబర్లీ పొగాకు నాట్లు వేస్తున్నారు. ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు సాగుచేయవద్దని చెప్పినప్పటికీ కొంతమంది రైతులు ఈ ఏడాది కూడా నల్లబర్లీ పొగాకు సాగు చేస్తున్నారు. 2 ప్రధాన కంపెనీలు వైట్ బర్లీ పొగాకు సాగు చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఈ ఏడాది బర్లీ పొగాకు సాగుచేస్తే లాభాలు వస్తాయని కంపెనీలు చెప్పటంతో రైతులు ఆశతో సాగు చేస్తున్నారు. గతేడాది వేసిన బర్లీ పొగాకు రైతుల దగ్గర ఇప్పటికీ నిల్వ ఉండటం గమనార్హం. నల్లబర్లీ పొగాకు సాగు చేయద్దని ప్రభుత్వం వ్యవసాయాధికారులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ వారు నామమాత్రంగానే ప్రచారం చేయటంతో రైతులు ఈ ఏడాది కూడా విస్తృతంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం బర్లీ పొగాకు నారు మూట రూ.2వేలకు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు స్పందించి నల్లబర్లీ పొగాకు వేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని పలువురు రైతు ప్రతినిధులు కోరుతున్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ శాఖ నిర్వహణ

- రోజుల తరబడి తెరచుకోని కార్యాలయం
- ముందుకు సాగని పనులు

దర్శి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం పనితీరు అధ్వానంగా మారింది. రోజులు తరబడి కార్యాలయం తెరచుకోవటం లేదు. కనీసం అటెండర్ కూడా అందుబాటులో లేడు. అధికారులు, సిబ్బంది కొరతతో ఆశాఖ పనులు కుంటుపడుతున్నాయి. దర్శిలో ఎంతోకాలంగా ఆర్‌అండ్‌బీ సెక్షన్ కార్యాలయం కొనసాగుతుంది. పొదిలి సబ్‌డివిజన్ పరిధిలో ఈ కార్యాలయం నడుస్తుంది. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ 40 రోజుల క్రితం బదిలీపై వెళ్లారు. ఆతర్వాత కొత్త అధికారిని నియమించలేదు. అక్కడ ఉన్న అటెండర్‌ను కూడా డిప్యుటేషన్‌పై కనిగిరికి తరలించారు. దీంతో ఆఫీస్ తాళాలు తీసే దిక్కుకూడా లేకుండాపోయింది. పొదిలి ఏఈని తాత్కాలికంగా ఇన్‌చార్జ్‌గా వేసినప్పటికీ ఆయన 15 రోజులకు ఒకసారి కూడా కార్యాలయానికి రావటం లేదు. దీంతో ఎప్పుడు చూసినా కార్యాలయం మూతపడే ఉంటుంది. వివిధపనుల కోసం వచ్చిన కాంట్రాక్టర్లు గంటల తరబడి వేచి చూసి వెనుతిరిగి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి రెగ్యులర్ ఏఈని నియమించాలని కోరుతున్నారు.



మహాత్మా..మన్నించు..!

పూలే విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన చెత్త కుండీలు

కార్పొరేషన్ నిర్వాకంపై ప్రజల ఆగ్రహం


పూలే విగ్రహం చుట్టూ ఉన్న చెత్త కుండీలు

అంటరానితనం.. కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేసిన మహానుభావుడు.. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం చుట్టూ కార్పొరేషన్ చెత్త కుండీల పెట్టడం విమర్శలకు తావిస్తోంది. ఒంగోలు నగరంలోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్ (ఊరచెరువు)లో గల పూలే విగ్రహం పరిసరాలను మినీ డంపింగ్‌యార్డ్ కేంద్రంగా మార్చారు. గత నాలుగైదు రోజులుగా కుళ్ళిపోయిన చెత్త కుండీలను పూలే విగ్రహం వద్ద పెట్టడంతో పలువురు తీవ్ర అంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఆయన జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహించి, పూలదండలతో ముంచెత్తి.. గొప్పతనం చాటిచెప్పడం, ఆ తర్వాత అలా నిర్లక్ష్యంగా వదిలేయడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూలే విగ్రహం వద్ద చెత్త కుండీలను తొలగించి పరిసరాలను ఆహ్లాదకరంగా మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

పారిశుధ్య కార్మికులకు న్యాయం చేస్తా

● ఎమ్మెల్యే దామచర్ల హామీ

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య విభాగంలో పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబసభ్యులను, తొలగించిన మేస్త్రీలను తిరిగి పనిలోకి చేర్చుకుని న్యాయం చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేను పారిశుధ్య కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలిసి తమ సమస్యలను వివరించారు. కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తూ వయో భారంతో మరణించిన వారి కుటుంబంలో వారికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే గత పది, పదిహేను సంవత్సరాలుగా మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న వారిని తొలగించారని, దీంతో తమ కుటుంబ పరిస్థితులు మరింత దయనీయంగా ఉన్నాయని వాపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల అందరికీ న్యాయం చేస్తానని, ఆందోళన పడవద్దని యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు. ఈమేరకు కమిషనర్ వెంకటేశ్వరరావుకు పలు ఆదేశాలు జారీ చేశారు.

సమస్యల పరిష్కారం కోసం వినతులు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు 25 అర్జీలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ ఆయా సమస్యలపై వచ్చిన అర్జీలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది : సత్య



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దామచర్ల సత్య

కొండపి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. శుక్రవారం స్థానిక పొదిలి రోడ్డులో శ్రీ లక్ష్మీ నరసింహ ట్రస్టు ఆధ్వర్యంలో అనాథలకు అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా సత్య మాట్లాడుతూ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కృషితో ప్రజా ప్రభుత్వం త్వరలో సింగరాయకొండలో అన్నక్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నదన్నారు. పేదలు, అనాథలకు అన్న క్యాంటీన్‌లు, ట్రస్టులు, దాతలు అన్నదానం చేయడం ఆనందదాయకమన్నారు. ట్రస్టుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ కొండారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వసంతరాయుడు, నాయకులు బత్తుల నారాయణస్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, పెదకండ్లగుంట మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు, నన్నూరి సుబ్బరామయ్య, బూదవాటి సోమయ్య, నేతి రవికుమార్ ఆముదాలపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసుపై విచారణ

కొత్తపట్నం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): వజ్జిరెడ్డిపాలెంకు చెందిన వీరారెడ్డిపై నమోదైన పోక్సో కేసుపై శుక్రవారం పోలీసులు విచారణ చేపట్టారు. ఒంగోలు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రమణకుమార్ గ్రామాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఇద్దరు మైనర్ బాలికలపై లైంగిక దాడి జరిగిన నేపథ్యంలో గురువారం కొత్తపట్నం పోలీస్‌లు పోక్సో కేసు నమోదు చేశారు. ఘటన పూర్వపరాలను డీఎస్పీ విచారించారు. ఆయన వెంట కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్ ఉన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



తాళం వేసి ఉన్న కొత్తకోట సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ హెచ్చరించారు. కొత్తకోట సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం పదిన్నర గంటలకు కూడా సచివాలయం తాళాలు తీయకపోవడం, సిబ్బంది విధులకు హాజరుకాక పోవడంతో అవాక్కయ్యారు. ఫోన్‌లో పంచాయతీ కార్యదర్శి భాస్కరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులను విచారించారు. సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహించడం ద్వారా గ్రామంలో 662 గృహాలు స్వామిత్వ సర్వే చేయాల్సి ఉండగా 332 మాత్రమే పూర్తి చేయడం జరిగిందని, అలసత్వానికి గల కారణాలు తెలపాలంటూ సిబ్బందికి ఎంపీడీవో మెమోలు జారీ చేశారు. అనంతరం బి.నిడమానూరు, పోతవరం గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వే, ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు నాయక్, సుజాత, ఏపీవో రవిబాబు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

చీమకుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం సాయంత్రం చీమకుర్తి పట్టణం ఎన్ఎస్‌పీ కాలనీలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పూర్వకార్యదర్శి బెజవాడ రఘుబాబు, ఎన్నికల నిర్వహణాధికారిగా పి.హనుమంతరావు, పరిశీలకులుగా ఏహోన్‌రెడ్డి వ్యవహరించారు. నూతన మండల అధ్యక్షుడిగా శిరిగిరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఆవుల హరిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ మాకినేని శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులను అందిస్తున్న ట్రస్టు సభ్యులు

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లిలోని పేదలైన 25 ఎస్టీ కుటుంబాల వారికి డీఎల్‌ఎం సంస్థ ఒక్కో కుటుంబానికి రూ.2,300 విలువైన నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేసింది. వీటిని టీడీపీ నాయకుడు దగ్గుమాటి సుబ్బారెడ్డి, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు మిడసల బాలకోటయ్య పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు సుప్రియ, మాధవరావు, రవి, రమణమ్మ, ప్రమోద్, ప్రదీప్, స్వప్న, రాజేష్, జార్జ్, కృపామణి పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి ఆమోదం!

కౌన్సిల్ సమావేశంలో రెండు మినహా అన్ని అంశాలకు ఓకే ● ట్రంక్‌రోడ్ 100 అడుగులకు గ్రీన్‌సిగ్నల్ ● వాయిదా పడిన బీవీఎస్ రోడ్ విస్తరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు దామచర్ల, విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ బుజ్జి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం శుక్రవారం కార్పొరేషన్ హాలులో నిర్వహించారు. డిప్యూటీ మేయర్ వేమూరి వెంకటసూర్యనారాయణ (బుజ్జి) అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగర అభివృద్ధి కోసం ప్రతిపాదించిన 63 అంశాలను అజెండాలో పొందుపరిచారు. కాగా రెండు అంశాల మినహా మిగిలిన అంశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ కార్పొరేషన్ హోదాకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి దిశగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నగర జనాభా రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానంగా రహదారుల విస్తరణ చేపట్టినట్లు తెలిపారు. అలాగే నగర సుందరీకరణ, అవసరమైన ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రైన్‌లు నిర్మిస్తామని వివరించారు. అలాగే సుపరిపాలనకు తొలి అడుగు పర్యటనలో తాను నేరుగా గుర్తించిన పలు సమస్యల సమస్యలను తక్షణమే పరిష్కారం అయ్యేలా కౌన్సిల్‌లో పొందుపరిచి తగు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. నగర అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే అభివృద్ధి వైపు అడుగులు వేసినట్లు పేర్కొన్నారు. పాలకవర్గం అందరూ సమష్టి కృషితో నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. సమావేశంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎంఈ ఐనయ్య, ఏసీపీ సుధాకర్, టీడీపీ, వైసీపీ, జనసేన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

100 అడుగులకే ట్రంక్‌రోడ్ విస్తరణ

గత కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తున్న ట్రంక్‌రోడ్ విస్తరణకు ఎట్టకేలకు ఆమోదం లభించింది. ఇటీవల హైకోర్టు ఆదేశాలతో కార్పొరేషన్ పాలకవర్గం ఈ రోడ్డును 100 అడుగులు విస్తరించేందుకు పాలకవర్గం ఆమోదించింది. ఇదిలా ఉండగా 7వ అంశమైన మస్తాన్ దర్గా సెంటర్ నుంచి కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ వరకు 80 అడుగుల రోడ్ విస్తరణ ప్రతిపాదించిన విషయం విదితమే. అదే అంశాన్ని అజెండాలో పొందుపరగా, టీడీపీ కార్పొరేటర్ దాచర్ల రమణయ్య మాట్లాడుతూ బీవీఎస్ హాలు రోడ్ విస్తరణపై మరోసారి చర్చిస్తే బాగుంటుందని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అక్కడి ప్రజల అభిప్రాయాలను కూడా ఒకసారిపరిగణలోకి తీసుకుని విస్తరించడం ద్వారా ప్రజా ప్రయోజనం ఉంటుందని వివరించారు. దీంతో బీవీఎస్ హాలు రోడ్ విస్తరణ అంశం వాయిదా పడింది. ఇదేక్రమంలో 61వ అంశమైన అయ్యప్పస్వామి ఆలయం, కళ్యాణ మండపానికి సంబంధించి షాపుల అద్దెల పెంపు విషయం, ఇతరత్రా ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కార్పొరేషన్ తీసుకున్న నిర్ణయం, అలాగే ఆలయ స్థలం శాశ్వతంగా ఆలయ ట్రస్ట్‌కే కేటాయించాలని కోరిన అంశాన్ని వాయిదా వేశారు.

ముగిసిన కళాఉత్సవ్-2025 పోటీలు

● విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతిని అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుబ్బారావు, అతిథులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న కళాఉత్సవ్-2025 పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో ప్రభుత్వ, ప్రభుత్వగుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 9వ తగరతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులు పాల్గొన్నారు. గాత్ర సంగీతంలో సోలోగా కందుకూరుకు చెందిన ఆక్స్‌ఫర్డ్‌హైస్కూల్, గాత్రసంగీతం బృంద విభాగంలో మార్కాపురం జడ్పీహైస్కూల్, వాద్య, శాస్త్రీయ రాగయుక్త సంగీతంలో కడవకుదురు జడ్పీహైస్కూల్, అలాగే వాద్య, తాళ వాయిద్యంలో బసవన్నపాలెం జడ్పీహైస్కూల్ ప్రథమ బహుమతులు సాధించాయి. నృత్యవిభాగంలో రాయవరం జడ్పీహైస్కూల్, జానపద, ప్రాంతీయ నృత్యవిభాగంలో సీఎస్.పురానికి చెందిన కేజీబీవీ హైస్కూల్, అలాగే లఘునాటకం విభాగంలో పొదిలి గవర్నమెంట్ బాలుర హైస్కూల్, దృశ్యకళలు, పెయింటింగ్ విభాగంలో పామూరుకు చెందిన శ్రీవెంగమాంబ మోడల్ కాలజీ ప్రథమ స్థానంలో నిలిచాయి. దృశ్య, శిల్పకళ విభాగంలో పొదిలి గవర్నమెంట్ బాలురహైస్కూల్, స్వదేశీ బొమ్మలు, ఆటల విభాగంలో ముండ్లమూరుకు చెందిన ఏపీఎం స్కూల్, అలాగే నృత్య, నాటక, సంగీత సమ్మిళితంగా కథలు చెప్పే విభాగంలో బండ్లమూడికి చెందిన జడ్పీహైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. అనంతరం విజేతలకు డైట్ ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు బహుమతులను ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా మురళీక్రిష్ణ, బ్రహ్మయ్య, సుబ్బారావు, బిక్షలురెడ్డి, రంగారావు వ్యవహరించారు.


లఘు నాటిక, నృత్య, ఏకపాత్రాభినయం పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

మంచినీరివ్వండీ మహాప్రభో..

ఏలూరివారిపాలెంలో దాహం కేకలు

పట్టించుకోని అధికారులు

ఇబ్బందిపడుతున్న గ్రామస్థులు


మూసి ఉన్న తాగునీటి సరఫరా కేంద్రం


చెరువులో పుష్కలంగా ఉన్న నీరు

చీమకుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం ఏలూరివారిపాలెం గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడింది. స్థానిక తాగునీటి చెరువుకు రామతీర్థం నుంచి జలాలు చేరుతాయి. అక్కడ ఏర్పాటు చేసిన జల శుద్ధి కేంద్రం నుంచి తాగునీరును సరఫరా చేస్తుంటారు. గ్రామంలో ఫ్లోరిన్ సమస్య ఉండటంతో గ్రామస్థులు అందరూ ఈ కేంద్రం నుంచే తాగునీటిని తీసుకెళ్తుంటారు. ఇక్కడ బబులేకి రూ.5 చొప్పున పంచాయతీ వారు వసూలు చేస్తుంటారు. పక్కనే ఉన్న కేవీపాలెం, బోడపాలెం తదితర గ్రామాల నుంచి సైతం ఇక్కడ నుంచే తాగునీరు తీసుకెళ్తుంటారు. కాగా రామతీర్థం నుంచి చేరుకున్న జలాలును శుద్ధి చేసే ప్రక్రియలో నెలకొన్న నిర్లక్షంతో గత కొంతకాలం నుంచి విమర్శలు ఎదుర్కొన్న నిర్వాహకులు ఇపుడు ఏకంగా కేంద్రాన్ని మూసివేసి తాగునీరు సరఫరాను నిలిపివేయటంతో గ్రామస్థులకు తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. తాగునీటి కోసం పంచాయతీ, ఇతర అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని, ఉన్నతాధికారుల జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తీరప్రాంత భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

● మెరైన్ సీఐ శివన్నారాయణ



సదస్సులో మాట్లాడుతున్న సీఐ శివన్నారాయణ

సింగరాయకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంత భద్రతపై మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలని మెరైన్ సీఐ శివన్నారాయణ పేర్కొన్నారు. మండలంలోని పాకల వద్ద శుక్రవారం రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఆధ్వర్యంలో తీరప్రాంత భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివన్నారాయణ మాట్లాడారు. ఆలివ్ రిడ్లీ తాబేళ్ల ప్రాముఖ్యత, సంరక్షణ గురించి మత్స్యకారులకు అవగాహన కల్పించారు. గోస్ట్ వలల వలన సముద్ర జీవులకు, మత్స్యసంపదకు వాటిల్లే నష్టాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సముద్రతీరం వెంబడి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోతున్న తాటి చెట్ల పెంపకం వలన కలిగే ఉపయోగాలను తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన సమయంలో కొత్త వ్యక్తులు, బోట్లు కనిపించినా టోల్ ఫ్రీ నంబర్ 1093కు ఫోన్‌చేయాలని సూచించారు. సముద్ర మార్గాన దేశంలోకి టెర్రరిస్టులు, ఉగ్రవాదులు చొరబడకుండా అక్రమ రవాణాను కట్టడి చేయడానికి మత్స్యకారులు కోస్టల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కడలూరు సోనాబోట్ల వలన తీవ్రంగా నష్టపోతున్నామని మత్స్యకారులు అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌వీబీ రాజేష్, గ్రామ సర్పంచ్ సైకం చంద్రశేఖర్, మెరైన్ ఎస్సైలు ఈశ్వరయ్య, మస్తాన్ షరీఫ్, ఇతర శాఖల అధికారులు, గ్రామ కాపులు పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఒంగోలు నగరం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 20,21 తేదీలలో జరగనున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, ఉమామహేశ్వరరావు, నరసింగరావు, అన్నపూర్ణ పాల్గొన్నారు

ఉపాధ్యాయుల నిరసన

మద్దిపాడు, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం నల్లబాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డి.రామిరెడ్డి, ఈమని శ్రీనివాసరావు, పి.శేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ

కొండపి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెరిదేపి గ్రామంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల్లో శుక్రవారం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా మల్లెల సంపూర్ణ, కార్యదర్శిగా పారాబత్తిన శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా లక్కెపోగు దావీదు, సహాయ కార్యదర్శిగా గడ్డం గోపి ఎన్నికయ్యారు.

పొగాకు రైతులు నిబంధనలు పాటించాలి

కొండపి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొండపి వేలం కేంద్రం పరిధిలోని చోడవరం, వెన్నూరు, పెరిదేపి, వెంకటకృష్ణాపురం, ధర్మవరం గ్రామాల్లోని పొగాకు నారుమడులను అధికారులు శుక్రవారం పరిశీలించారు. రైతులు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు కాశీనాథ్, రాజీవ్, మౌనిక, గాయత్రి పాల్గొన్నారు.

ప్రతి మహిళా అక్షరాస్యురాలిగా మారాలి

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారాలని వయోజన విద్య ఏపీవో సురేఖ అన్నారు. శుక్రవారం జరుగుమల్లి వెలుగు కార్యాలయంలో అక్షర ఆంధ్ర మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో కామేశ్వరరావు, ఏపీఎం జయరాజు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును సాగు చేయొద్దు

కొండపి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు రానున్న సీజన్‌లో నల్లబర్లీ పొగాకును సాగుచేయొద్దని ఏడీఏ నిర్మలాకుమారి సూచించారు. శనివారం పెరిదేపి, ముప్పరాజుపాలెం, అనకర్లపూడి గ్రామాల్లో పర్యటించారు. నల్లబర్లీ సాగుపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. రైతులు సాగు చేసి నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏవో ఎం.మాల్యాద్రి, ఏఈవో పి. కుమార్, వీఏఏ పవిత్ర పాల్గొన్నారు.

పరిశోధనలు శాస్త్రీయ విధానంలో నిర్వహించాలి

● వైస్ చాన్స్‌లర్ మూర్తి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పరిశోధనలు శాస్త్రీయ విధానంలో నిర్వహిస్తే సత్ఫలితాలు వస్తాయని వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ ప్రాంగణంలో శుక్రవారం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పరిశోధనా విధానంలో ప్రాథమిక అంశాలు- పరిశోధకుల పాత్ర అనే అంశంపై ఆయన మాట్లాడారు. పరిశోధన అంటేనే కొత్త విషయాలను అన్వేషించడం, అవి సమాజానికి మేలు చేసేవిగా, ఆపరిష్కృత సమస్యలకు పరిష్కారం చూపేవిగా ఉండాలన్నారు పరిశోధనలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలామణి, సీఈ సోమశేఖర్, భారతీదేవి, చరిత్ర విభాగం పరిశోధన పర్యవేక్షకులు డి.వెంకటేశ్వరరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎం.హర్షప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహర్షిణి విద్యార్థినుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలుకు చెందిన శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు యూత్ ఫెస్ట్-25లో భాగంగా శుక్రవారం నిర్వహించిన రెడ్‌రన్ మారథాన్‌లో సత్తా చాటారు. కళాశాల విద్యార్థిని ఈ వీ.నాగఐశ్వర్య మొదటి స్థానంలో నిలిచి రూ.10వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని సాధించారు. మరో విద్యార్థిని లాస్యప్రియ ఐదో స్థానంలో నిలిచి ప్రశంసాపత్రం పొందారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో విద్యార్థినులను అధ్యక్షుడు గోరంట్ల రవికుమార్, డైరెక్టర్ జి.హర్షిత్‌లు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.సుధీర్‌చక్రవర్తి, హెచ్‌వోడీపీ శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి ప్రమాణస్వీకారంలో మాగుంట

ఒంగోల కలెక్టరేట్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతిగా సీపీ.రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఢిల్లీలో శుక్రవారం ఉపరాష్ట్రపతి ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు రాష్ట్రానికిచెందిన కేంద్రమంత్రులు, పార్లమెంట్ సభ్యులు హాజరయ్యారు. ముందుగా ఢిల్లీకి చేరుకున్న సీఎం చంద్రబాబును మాగుంట మర్యాదపూర్వకంగా కలిశారు.

వైసీపీ రాష్ట్ర బూత్ కమిటీ ప్రధానకార్యదర్శి అశోక్‌గౌతమ్


అశోక్‌గౌతమ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన వైవీ.గౌతమ్‌అశోక్ నియమితులయ్యారు. ఆ మేరకు రాష్ట్ర కమిటీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన రాజ్యసభ ఎంపీ వైవీ.సుబ్బారెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లాపరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పొగనారు మడుల పరిశీలన

ఒంగోలు రూరల్, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): పొగనారుమడుల వద్ద సాగు చేసే రైతులు తప్పనిసరిగా బోర్డు అనుమతి వివరాలను ప్రదర్శించాలని ఒంగోలు పొగాకు బోర్డు వేలంకేంద్రం-2 నిర్వహణాధికారి జె.తులసి పేర్కొన్నారు. శుక్రవారం మద్దిరాలపాడు, కేశినేనివారిపాలెం గ్రామాల్లో సాగు చేస్తున్న పొగనారు మడులను విజిలెన్స్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ ఐదు ఎకరాలలోపు నారుమడుల సాగుకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. నారు కొనుగోలు చేసిన రైతులుకు రసీదును తప్పక ఇవ్వాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో బోర్డు విజిలెన్స్ అధికారి సత్యశ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పేస్‌లో పర్యావరణంపై అవగహన


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ, శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలోని వ్యర్థాలను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ఆవరణలో చెత్తబుట్టలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు సీవీ.సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, ఏవో రాంబాబు, కళాశాల ఈగల్‌క్లబ్ కో ఆర్డినేటర్ సి.బ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేపై శిక్షణ

సంతనూతలపాడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ నారాయణరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్‌లు స్వామిత్వ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వరకు వ్యవసాయ భూములను సర్వేచేసి యాజమాన్య హక్కులను నిర్ణయించినట్లు తెలిపారు. సోమవారం నుంచి స్వామిత్వ రెండోవిడత వ్యవసాయేతర భూములను సర్వేచేస్తారని చెప్పారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్‌లు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రారంభం


హ్యాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, విద్యార్థులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద ఉన్న ఆర్‌జీయేకేటీ ఒంగోలు క్యాంపస్‌లో శుక్రవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏవో చంద్రశేఖర్ మాట్లాడుతూ హ్యాకథాన్‌లో విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేసి ప్రభుత్వ, వివిధ పరిశ్రమలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను కనుగొనవచ్చన్నారు. ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రపంచంలోనే అతిపెద్ద హ్యాకథాన్‌గా గుర్తింపు పొందినట్లు తెలిపారు. దీనిని భారతీయ విద్యామంత్రిత్వశాఖ, ఏజీసీటీఈలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్యాంపస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిద్దా సుధీర్‌కు బిజినెస్ ఎక్సలెంట్ అవార్డు


అవార్డును అందుకుంటున్న సుధీర్

ఒంగోలు రూరల్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో బిజినెస్ ఎక్సలెన్స్, బిజినెస్ ఎక్స్ పోర్టు ఉత్తమ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఒంగోలు చెందిన యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌కు ఉత్తమ బిజినెస్ ఎక్సలెంట్ అవార్డును నిర్వాహకులు ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సభలో సుధీర్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో పెద్ద, చిన్న వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యాపారసంస్థల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భారీ పరిశ్రమలశాఖ మంత్రి టీజీ.భరత్, సూక్ష్మ, చిన్న తరహాశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, విశ్రాంత ఐఏఎస్ అధికారులు నిమ్మగడ్డ రమేష్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



ఒంగోలు వెళ్లే రహదారిలో ఉన్న ఆక్రమణలు స్వయంగా తొలగించుకుంటున్న దుకాణదారులు

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగింపు

పొదిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చిన్నబస్టాండ్ సెంటర్ నుంచి మర్రిపూడి అడ్డరోడ్డు సమీపంలోని మసీదు వరకు ప్రధాన రహదారికి ఉత్తరంవైపు ఉన్న ఆక్రమణలను నగరపంచాయతీ ఆదేశాల మేరకు దుకాణదారులు స్వయంగా తొలగిస్తున్నారు. పట్టణాభివృద్ధిలో భాగంగా నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి పిలుపు మేరకు గురువారం తెల్లవారుజాము నుంచి తొలగింపు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు తొలగింపు చర్యలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. ముఖ్యంగా దుకాణదారులు పంచాయతీస్థలంలో కట్టడాలు సొంతంగా తొలగించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రెండునెలలుగా అక్రమ కట్టడాలను తొలగించాలని నోటీసులు ఇచ్చిన క్రమంలో నగరపంచాయతీకి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ అధికారిణి ఆయేషా

బార్లకు దరఖాస్తు చేసుకోవాలి

మార్కాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో బార్ అండ్ రెస్టారెంట్లకు ఆసక్తిగలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి షేక్ ఆయేషా బేగం కోరారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం బార్ల యజమానులు, మద్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎస్ మాట్లాడుతూ మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో రెండు బార్లకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. నూతన మద్యం పాలసీలో మార్కాపురం మున్సిపాలిటీకి గతంలోకంటే ఒక బార్‌ను అదనంగా కేటాయించామన్నారు. ఇప్పటికే మూడు బార్లను వ్యాపారులు దక్కించుకున్నార న్నారు. నాలుగు చొప్పున దరఖాస్తులు రాకపోవడంతో రెండు బార్లకు లాటరీ తీయలేదన్నారు. ఈ సందర్భంగా 2025-28 నూతన బార్ పాలసీలోని ముఖ్య అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సీఐ ఎం.వెంకటరెడ్డి, ఎస్సై గోపాలకృష్ణ, వ్యాపారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినికి ఘన సన్మానం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థిని అరుణ కుమారిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారిగా ఉద్యోగం సాధించి గురజాలలో సేవలు అందిస్తున్న అరుణ కుమారి మార్కాపురం, కొండపిలలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారిగా పనిచేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ తెలిపారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణిగా పదోన్నతి పొంది పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆమె బాధ్యతలు చేపట్టడం ఎంతో గర్వకారణం అని, మరెన్నో పదోన్నతులు పొంది సమాజానికి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వీఆర్‌కే ప్రసాద్, పీఎల్ రమేశ్ బాబు, కృష్ణారెడ్డి, వెన్నా కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానానికి ఊతం - రైతన్నకు లాభం

పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం రాయితీలు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి). కూటమి ప్రభుత్వంలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు అండగా ఉంటూ ఎన్నో రాయితీలను అందిస్తోంది. దీంతో తక్కువ ఖర్చుతో ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో అధికంగా బత్తాయి, దానిమ్మ, బొప్పాయి, కూరగాయలను సాగుచేస్తున్నారు. రైతులు ముందుగా భూసార పరీక్షలు చేసుకుని వాతావరణానికి అనుకూలమైన పంటలను సాగు చేసుకోవాలి. ఉద్యాన శాఖ ద్వారా దానిమ్మ, బత్తాయి, బొప్పాయి, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, తదితర పండ్ల తోటలకు, పూల తోటలకు రైతులకు అయ్యే ఖర్చులో 40 శాతం ప్రభుత్వం రాయితీగా అందిస్తుంది. అందులో మొదటి ఏడాది 60 శాతం, రెండవ ఏడాది 40 శాతం నేరుగా రైతు ఖాతాలో జమచేస్తుంది. రైతులు మొక్కలు నాటిన తర్వాత గ్రామ వ్యవసాయాధికారి లేదా ఉద్యాన శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పండ్ల మొక్కలను పరిశీలిస్తారు.



రాజుపాలెం గ్రామంలో దానిమ్మ పంట సాగు చేస్తున్న రైతు

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

రైతులు ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని పండ్ల తోటల సాగు చేసుకోవాలని మార్కాపురం ఉద్యాన శాఖాధికారి రమేష్ కోరారు. పండ్ల తోటలను సాగు చేసుకోవాలనే రైతులు పట్టాదార్ పాసుపుస్తకం, 1బీ లేటెస్ట్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్టు ఫొటో, మొక్కలు కొనుగోలు చేసిన ఒరిజినల్ రసీదులు తీసుకుని ఉద్యాన శాఖాధికారిని సంప్రదించాలని కోరారు. ఉద్యానశాఖ నర్సరీలు దర్శి, కొత్తపట్నంలలో పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఆసుపత్రి ప్రాంగణంలో మురుగు నీరు

దోమలు,దుర్వాసనతో రోగుల అవస్థలు

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడేవారు చికిత్సకో కోసం వైద్యశాలకు వస్తుంటారు. అయితే చికిత్స చేయించుకోని ఇంటికి వెళ్లాల్సిన రోగులు మరింత ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సిన దుస్థితి ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాలలో నెలకొంది. ఈ వైద్యశాలకు నిత్యం వందల సంఖ్యలో చికిత్స కోసం రోగులు వస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం మార్పు నేపథ్యంలో జలుబు, దగ్గు, జ్వరాలు పెరిగిపోయాయి. దీనితో రోగుల సంఖ్య కూడా పెరిగింది. ఆలాంటి సమయంలో వైద్యశాల, వైద్యశాల ప్రాంగణం అంతా ఎంతో పరిశుభ్రంగా ఉండాలి. కానీ ఇక్కడ అలాంటిదేమి కనిపించడం లేదని రోగుల కుటుంబ సభ్యులు చెబుతున్నారు. వైద్యశాల ప్రాంగణం చుట్టూ వర్షం (మురుగు) నీరు రోజుల తరబడి నిల్వ ఉండి దుర్వాసనతో పాటు దోమలకు అవాసంగా మారింది. అధికారులు స్పందించి వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచి రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆసుపత్రి ముందు నిల్వ ఉన్న మురుగు నీరు

బొప్పాయిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

తర్లుపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీలోని ఓబాయి పల్లెలో బొప్పాయి పంట సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ శాస్త్రవేత్త ఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ బొప్పాయి పంటకు ఎక్కువగా వైరస్ సోకుతుందని, దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి రమేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నప్రియ, ఉద్యాన సహాయకురాలు సుస్మిత, రైతులు పాల్గొన్నారు.



ఓబాయిపల్లెలో బొప్పాయి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

భూసారం పెంపుపై శిక్షణ

మండలంలోని గానుగపెంటలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు భూసారం తెలుసుకోవటంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఏ బాలాజీ నాయక్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వాడకం వలన భూమి సహజ శక్తిని కోల్పోతుందని, భూమిలో ఉన్న సూక్ష్మజీవులన్ని నశించి పోతున్నట్లు వివరించారు. రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అనుసరించి పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి పూత దశలో ఉన్నప్పుడు భూమిలో కలియదున్నినట్లయితే మంచి ఫలితం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి జ్యోత్నాదేవి, ఏపీఎం రమణి, ఏఈవో దేవేంద్ర గౌడ్, వీహెచ్ఏ సాయి రామ్, రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో ప్రయోజనాలు

రాచర్ల : విత్తనశుద్ధితో కలిగే ప్రయోజనాలను రైతులు తెలుసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో షేక్ మహబూబ్ బాషా అన్నారు. మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం రైతులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. విత్తనశుద్ధి, దాని ప్రయోజనాల గురించి ఆయన రైతులకు పలు సూచనలు ఇచ్చారు. భూసారపరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని, అధిక మోతాదు పురుగుమందుల వాడకం తగ్గించి, తెగుళ్లను గుర్తించి, నివారణకు అవసరమైన మందులు వాడాలన్నారు. ప్రస్తుత పొలంబడి కార్యక్రమం కంది పంట పూర్తి కాలం వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సభ్యురాలు నందిని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ నియంత్రణ, మత్తు పదార్థాలపై శుక్రవారం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం హ్యాండ్స్ ఆఫ్ కాంపన్షన్ ప్రాజెక్టు రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో సమగ్ర ఐఈసీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో-2 నాగభూషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శోభన్‌బాబు, సువర్ణలత, ధనలక్ష్మి, జనజీవన్ కుమార్, శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, హెచ్‌వోసీ, బ్రహ్మయ్య, ఓఆర్‌డబ్ల్యూ భవాని, రిబ్కా, సునీత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

పొదిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయాలను పురస్కరించుకొని శుక్రవారంపట్టణంలో బీజేపీ నాయకులు విజయోత్సవంతోపాటు ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ పాలనలో మోదీ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజాసంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలను ఎంతో ఆకర్షిస్తున్నాయన్నారు. ఇటీవల జీఎస్టీ తగ్గింపు వంటి నిర్ణయాలు ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాగుటూరు పంచాయతీలోని కృష్ణానగర్ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

తక్షణమే నీటి సమస్యను పరిష్కరించండి

- అధికారులకు ఎమ్మెల్యే ముత్తుముల ఆదేశం

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్ధవీడు మండలం మాగుటూరు పంచాయతీలోని కృష్ణానగర్ గ్రామస్థులు గ్రామంలో ఎదుర్కొంటున్న నీటిసమస్యపై శుక్రవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వివరించారు. గత కొన్ని రోజులుగా నీరు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే నీటి సమస్య పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనితో స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అర్ధవీడు ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. అక్కడున్న సమస్యను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నిధులతో కృష్ణానగర్‌లో తక్షణమే బోరు వేయించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు

పెద్ద దోర్నాల,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి):వేగం అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి.ఈ సంఘటన మండల పరిధిలోని కొర్రప్రోలు వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో నల్లగుంట్ల గ్రామానికి చెందిన జీనెపల్లి హరిశ్చంద్ర ప్రసాద్, గుడ్డెపోగు రమేశ్, కొర్రప్రోలుకు చెందిన కుడుముల వెంకటేశంకు గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన కథనం ప్రకారం పందిటి ఏసోబుకు చెందిన ఏపీ21ఎక్స్ 7583 నెంబరుగల ఆటోలో హరిశ్చంద్ర ప్రసాద్, రమేశ్ నల్లగుంట్ల నుంచి పెద్ద మంతనాలు వెళ్తూ మార్గమధ్యంలోని కొర్రప్రోలు గ్రామంలో ఆగారు. అక్కడ ఆటో డ్రైవర్ ఏసోబు వ్యక్తిగత పనిమీద దిగిపోగా కొర్రప్రోలు గ్రామానికి చెందిన కుడుముల వెంకటేశంను ఆటోలో ఎక్కించుకుని హరిశ్చంద్రప్రసాద్ ఆటోను నడిపాడు. కొంతదూరం వెళ్లాక వేగం అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురూ క్రింద పడడంతో గాయాలు అయ్యాయి.వెంకటేశంను బంధువులు తీసుకుని వెళ్లి పోయారు.మిగిలిన ఇద్దరూ 108కి సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

గిద్దలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి ఆవులయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని ఉయ్యాలవాడతోపాటు మరికొన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో శానిటేషన్ వర్కర్స్‌ను తొలగించేందుకు రాజకీయ వేధింపులు మొదలయ్యాయని, న్యాయబద్ధంగా పని చేస్తున్న వారిని తొలగించి వారి కడుపు కొట్టవద్దని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సహాయం అందజేత

పట్టణంలోని నల్లబండ బజారులో నివాసం ఉంటున్న షేక్ బేగము న్నీసా అనే మహిళ పక్షవాతానికి గురై మంచానికే పరిమితమై దీనస్థితిలో ఉండగా జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు రమేష్, శరత్‌బాబు చేయూతనిచ్చారు. ఆ మహిళకు నిత్యావసర వస్తువులతోపాటు రూ. 2వేల ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకున్నారు.

లాడ్జీలలో పోలీసుల తనిఖీలు

పొదిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పలులాడ్జీల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే సమాచారంతో ఎస్ఐ వేమన శుక్రవారం తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న పలువురిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం లాడ్జి యజమానులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తగుసూచనలు ఇచ్చినట్లు చెప్పారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మార్కాపురం రూరల్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వెంకటేశర్వ రెడ్డి, మహాలక్ష్మి, రామకృష్ణ, అమరేశ్వరుడు అందించిన సేవలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలుని వెంకటేశ్వరరావు వివరించి కొనియాడారు. అనంతరం శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

నేడు కంభంలో విద్యుత్‌కు అంతరాయం

కంభం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కంభం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు పంచాయతీలలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నరసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కంభం మండల పరిధిలోని జంగంగుంట్ల, కందులాపురం, కంభం టౌన్, చిన్నకంభం సబ్ స్టేషన్ పరిధిలోని గచ్చకాల్వ వీధి, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు గౌతవరానికి ముత్తుముల

రాచర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం మండలంలోని గౌతవరం గ్రామానికి రానున్నారని మండల తెలుగుదేశంపార్టీ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. మ్యాజిక్ డ్రైన్స్‌కు సంబంధించి గౌతవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్ కుమార్‌తో కలిసి ఆయన భూమిపూజ చేయనున్నారని వారు తెలిపారు.

మురుగుకాల్వల నిర్మాణాలను పూర్తిచేయాలి

దర్శి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో మురుగు కాల్వల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ఆదేశించారు. శుక్రవారం దర్శి పట్టణంలోని 20 వార్డులో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. మురుగు కాల్వలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేయగా వెంటనే అంచనాలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుభానీ, నాయకులు దినకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఏపీవో టి.వెంకటరావు ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెలాఖరుకల్లా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

దొనకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా ప్రతి వలంటీర్ కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో షేక్ దావూద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన ఉల్లాస్ అక్షర ఆంధ్ర వలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయసుతో సంబంధం లేకుండా నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించి సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య సూపర్‌వైజర్ ఎన్.వెంకటరెడ్డి, జడ్పీ పాఠశాల హెచ్ఎం వీవీ రామాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు నళిని, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

ముండ్లమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో గత రెండు రోజులనుంచి సర్పంచ్ గొర్రె శ్రీదేవి ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం తమ్మలూరులో వ్యర్థపదార్థాలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. నాయుడుపాలెంలో మురుగు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు.

ఘర్షణలో ఐదుగురికి గాయాలు

ముండ్లమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురం గ్రామంలో శుక్రవారం ఓరైతుకు చెందిన బీడు భూమిలో పశువుల మేత మేపుకొనే విషయంలో ఇరుకుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నంబూరి ఆదాం, మహేష్‌ను అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నంబూరి వీరేంద్ర, నంబూరి వీరయ్య, ముట్లూరి శ్రీకాంత్‌ను దర్శి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఇరువర్గాల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కష్టపడే వారికి టీడీపీలో గుర్తింపు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



అభినందన కార్యక్రమంలో విక్టరీ సింబల్ చూపిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్‌ఉగ్ర

కనిగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడేవారికి టీడీపీలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శుక్రవారం రాత్రి పట్టణ, వార్డు, అనుబంధ సంఘాలను ప్రకటించారు. నూతన కమిటీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నూతన కమిటీ నాయకులు పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. పదవుల్లో అవకాశం ఇచ్చి ప్రోత్సహించటం జరుగుతుందన్నారు. వారివారి ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను విరివిగా నిర్వహించి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంటేనే నాయకులకు, కార్యకర్తలకు ప్రజల్లో గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, ఐటీడీపీ నాయకుడు జంషీర్, గుడిపాటి ఖాదర్, బుల్లా బాలబాబు, అహ్మద్, సద్గురు, కొట్టే ప్రసాద్, ఏనుగు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

కనిగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల క్షేమమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం శంఖవరం ఎస్సీ కాలనీకి చెందిన చెంచాల సరోజనమ్మకు వైద్య సహాయం కోసం రూ1.5 లక్షల చెక్కును ఆయన అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్నవారికి ఖరీదైన కార్పొరేట్ వైద్యం చేయించుకునేందుకు సీఎం సహాయ నిధి పేద కుటుంబాలకు భరోసాగా నిలుస్తుందన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఏడాది కాలంలో కోట్లాది రూపాయల సీఎం సహాయనిధి అందించినట్టు చెప్పారు. బాధితులు ఆయా నగదును సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా తయారుకావాలని కోరారు.

ఐటీడీపీ మండల అధ్యక్షుడిగా నారాయణ

కనిగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐటీడీపీ మండల అధ్యక్షుడిగా మేకం నారాయణ ఎంపికయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. నారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఐటీడీపీ అధ్యక్షుడిగా ఎంపిక చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి రుణపడి ఉంటానన్నారు. పార్టీ కార్యక్రమాలను ఐటీడీపీ వేదిక ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సైకం మాలకొండారెడ్డి, వెంకటరెడ్డి, ఎరుకలరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ఏనుగు శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరరావు, మూలే శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే కఠినచర్యలు

» మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని కాశిరెడ్డి బజారు, గార్లపేట రోడ్డు, పామూరు రోడ్డులోని సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయాల్లో అందిస్తున్న సేవలు, రోజువారీ నివేదిక, ఫిర్యాదు, సేవలపై విచారించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది మెరుగైన సత్వర సేవలు అందించాలన్నారు. పట్టణంలో నిరుద్యోగ యువతీ యువకుల వివరాలపై సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సిబ్బంది మూమెంట్ రిజిస్టర్‌తో పాటు సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్యక్రమంలో మేనేజర్ ఐ.ప్రసాద్, నోడల్ ఆఫీసర్లు ప్రదీప్, పూర్ణిమ, కొండయ్య, వెంకటేష్, నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేయాలి

» వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి



పసుపుగల్లులో మొక్కజొన్న తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సంధ్యారాణి

ముండ్లమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని దర్శి వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి.సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని పులిపాడు, బసవాపురం, పసుపుగల్లు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా సస్యరక్షణ చర్యల గురించి శాస్త్రవేత్త సంధ్యారాణి రైతులకు వివరించారు. మరో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎరువులు, పోషకాలు యాజమాన్యం చేపట్టాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించిందన్నారు. దీని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ. తిరుమలరావు, ఆత్మ ఏటీఎం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బొల్లా నరసింహారావు

పామూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆపార్టీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు చిన్నవయసులోనే మండల అధ్యక్షుడుగా పువ్వాడి మద్దతుతో ఎమ్మెల్యే ఉగ్ర నియమించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తుంటే వైసీపీ అసత్య ప్రచారం చేస్తుందని ధ్వజమెత్తారు. గడిచిన ఎన్నికల్లో ఓటర్లు బుద్ధిచెప్పినా ఆపార్టీ నాయకుల్లో మార్పు రాకపోవడం దురదృష్టకరమన్నారు. రైతుల వేషాలు వేసుకొని యూరియా లేదంటూ అన్నదాతలను అవమానపరచడం తగదన్నారు. సమావేశంలో యారవ శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, ఎన్.నాగేంద్రచారి, షేక్ ఖాజారహంతుల్లా, పందిటి హరీష్, పిడుగు శ్రీనివాసులు, ఖాజారహంతుల్లా, పత్తు మస్తాన్, వాయునేని రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

కాగా, స్థానిక శేషమహల్ ప్రాంగణంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు ఏ.ప్రభాకర్ చౌదరి, పాలపర్తి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య, జనసేన జిల్లా కార్యదర్శి వై.రహీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

దర్శి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ పిలుపుమేరకు దర్శిలో ఉపాధ్యాయులు ర్యాలీగా వచ్చి డిప్యూటీ తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ దర్శి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తూము శ్రీనివాసరావు, నక్కా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లెవి ప్రసాదు, గోపాళం శ్రీనివాసరావు, జి.ఏలిషా, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో రహ్మాన్, నరేంద్ర, బాలాంజనేయులు, వినోద్, ఇశ్రాయేల్, ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు. సీఎస్‌పురంలో జరిగిన నిరసన కార్యక్రమంలో షేక్ నాయబ్‌రసూల్, టి .శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈనెల 11 నుంచి 17 వరకు నిరసన వారం నిర్వహిస్తున్నట్టు ఆసంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఆసుల వెంకట స్వామి, ఖాజా రహంతుల్లా తెలిపారు.

గుంటిగంగమ్మ తల్లి హుండీ లెక్కింపు

తాళ్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటి గంగమ్మ తల్లి హుండీ కానుకలను దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జి.అనంతనారాయణ సమక్షంలో లెక్కించారు. గత ఏప్రిల్ 14 నుంచి శుక్రవారం వరకు 150 రోజులపాటు భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ.6 లక్షల 82 వేల 765 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఈవో జి.వాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

తాళ్లూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులను ప్రైవేట్ వైద్యశాలలకు తీసుకెళితే తప్పనిసరిగా ఆపరేషన్ చేస్తున్నారన్నారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి ప్రభుత్వ వైద్యశాలల్లో సాధారణ కాన్పులు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఏవీ రమణమ్మ, హెచ్ఎస్ రవికుమార్, పీహెచ్ఎన్ వై.విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ రణభేరి

పామూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ రణభేరి కార్యక్రమం చేపట్టిందని ఆసంఘం జిల్లా కార్యదర్శి టి.తిరుపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమాలకు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే 25న చలో విజయవాడ నిర్వహించి రణభేరి మోగించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కావేటి నాగేశ్వరరావు, ఉదయ్, ఎం.సురేష్, తదితరులు పాల్గొన్నారు. సీఎస్‌పురంలో జరిగిన కార్యక్రమంలో సంఘ నాయకులు వి.సాంబశివరావు, ఎన్. వెంకటరామయ్య, షేక్ పాదూషా పాల్గొన్నారు.

కురిచేడు: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం యూటీఎఫ్ రణభేరి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆసంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అన్నెం శ్రీనివాసరెడ్డి, మైలవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 19 వరకు ద్విచక్ర వాహన జాత నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 25న విజయవాడలో ఉపాధ్యాయులతో రణభేరి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఎస్ఐని సస్పెండ్ చేయాలి

పామూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో అవినీతికి పాల్పడుతున్న ఎస్ఐ ఎం.వెంకటేశ్వరనాయక్‌ను, అంతా తానై వసూళ్లకు పాల్పడుతున్న కానిస్టేబుల్ చంద్రానాయక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లుపై ఎస్ఐ, కానిస్టేబుల్ దాడిని ఖండిస్తూ శుక్రవారం పామూరులోని మమ్మిడాడి సెంటర్‌లో ధర్నా కార్యక్ర మం నిర్వహించారు.

మాబు మాట్లాడుతూ పోలీసుల అవినీతిని ప్రశ్నించిన ఊసా వెంకటేశ్వర్లుపై అకారణంగా దాడి చేసి దౌర్జన్యం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు. జీవీ కొండారెడ్డి, సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ దౌర్జన్యం చేసిన ఎస్ఐ, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకొనేంత వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం సీఐ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీ షమ్మీ, కె.మాల్యాద్రి, ఊసా వెంక టేశ్వర్లు, ఊసా రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పామూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వయోజనులను అక్షరాస్య లుగా తీర్చిదిద్దాలని తహసీల్దార్ ఆర్.వాసుదేవ రావు సూచించారు. శుక్రవా రం స్థానిక వెలుగు కార్యాలయంలో అక్షరాంధ్ర (ఉల్లాస్)కార్యక్రమంలో భా గంగా ఏపీఎం జి.విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరక్షరాస్యులైన పొదుపు గ్రూపు, కుకింగ్ ఏజన్సీలు, ఆయాలు, హెల్పర్లు, నైట్‌వాచ్‌మెన్‌లు, గ్రామ పంచాయతి పారిశుధ్య కార్మి కులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యమన్నారు.

కార్య క్రమంలో ఎంఈవో కె.కరుణకుమారి, సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





పొగాకు కొనుగోళ్లు కొనసాగించాలని మంత్రి గొట్టిపాటికి విన్నవిస్తున్న రైతులు

కొత్త కలెక్టర్‌కు.. సవాళ్ల స్వాగతం!





- ఈ నెలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహణ
- పెండింగ్ ప్రాజెక్టులను పట్టాలెక్కించాలి
- నేడు కలెక్టర్‌గా పగ్గాలు చేపట్టనున్న డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్

పారిశ్రామికంగా.. పర్యాటకంగా.. అభివృద్ధికి ఎన్నో అనుకూలతలు. అంతర్జాతీయ ప్రసిద్ధి చెందిన గ్రానైట్ రంగానికి కేంద్రంగా. వేలాది కుటుంబాలకు జీవనంతో పాటు అంతర్జాతీయ ద్రవ్యం సమకూర్చే ఆక్వారంగం. ఆంధ్రా గోవాగా ప్రసిద్ధి చెందిన సూర్యలంక తీరం.. ఇలా ఎన్నో ఎన్నెన్నో ఘనతలు ఉన్న బాపట్ల జిల్లా అభివృద్ధిలో వెనుకబడే ఉంది. నూతన జిల్లాగా ఆవిర్భవించి మూడేళ్లు దాటినా ఆశించినంత అభివృద్ధిలేదు. ఈ పరి స్థితుల్లో జిల్లాకు నూతన కలెక్టర్‌గా డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ నియమితులయ్యారు. డాక్టర్ అయిన కలెక్టర్ చికిత్స కోసం జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. సమస్యలతో పాటు అభివృద్ధి పనులు డాక్టర్ కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రధానంగా ప్రకృతి వనరుల దోపిడీపై కఠిన చర్యలకు ఉపక్రమించాల్సి ఉంది. పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ ఉపాధి కల్పనపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని సవాళ్లను అధిగమించడంతో పాటు జిల్లా ప్రగతిపై తనదైన ముద్ర వేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ శనివారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్ వేదికగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. ప్రస్తుత కలెక్టర్ వెంకట మురళిని బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడిన సంగతి తెలిసిందే. కొత్త కలెక్టర్‌గా పగ్గాలు అందుకోనున్న డాక్టర్ వినోద్‌కుమార్‌కు అనేక సవాళ్లు స్వాగతం పలకతున్నాయి. ముఖ్యంగా ఈ నెల చివరి వారంలో మూడు రోజుల పాటు సూర్యలంక తీరంలో జరగనున్న బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయడం తక్షణ సవాల్. ఈ కార్యక్రమం ద్వారా పర్యాటక రంగంలో పెట్టుబడులు ఆకర్షించాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. బీచ్ ఫెస్టివల్ కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడుతో పాటు, వివిధ రంగాల సెలబ్రిటీలు హాజరుకానున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా దీనిని విజయవంతం చేయాల్సిన బాధ్యత కలెక్టర్‌పైనే ఉంది.

- దిండిలో సమీకృత ఆక్వా పార్కు నిర్మాణం పెండింగ్‌లో ఉంది. ఇప్పటికే దీనికి రూ.86 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను వేగవంతం చేయాలి.
- సూర్యలంక బీచ్ అభివృద్ధికి సంబంధించి రూ.97 కోట్లు నిధులు మంజూరు కాగా టెండర్ల ప్రక్రియ నడుస్తోంది. దీనిని పారదర్శకంగా చేయాల్సిన బాధ్యత నూతన సారధి పైనే ఉంది.
- గత ప్రభుత్వం పునాదులకే పరిమితం చేసిన బాపట్ల మెడికల్ కళాశాల పనులను పీపీపీ విధానంలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్దేశించిన గడువులోగా ఆ పనులు పూర్తి చేయాల్సి ఉంది.
- అద్దంకి పరిధిలో పారిశ్రామిక అవసరాలకోసం భూసేకరణకు ప్రభుత్వం ఇటీవలే నోటిఫికేషన్ ఇవ్వగా, భూసేకరణ అంశం క్లిష్టతరమైంది. దీనిని సజావుగా నడిపించాలి.
- అనేక బాలారిష్టాలను ఎదుర్కొంటోన్న గ్రానైట్ రంగాన్ని గాడిన పెట్టాలి. లీజు అగ్రిమెంట్లకు సంబంధించిన పరిశీలన ప్రస్తుతం జరుగుతోంది. ఒత్తిళ్లకు తలొగ్గకుండా దీనిని పూర్తి చేయాలి.
- ఉచిత ఇసుక పాలసీకి తూట్లు పొడిచే విధంగా అక్రమ రవాణా యథేచ్ఛగా జరగడం, రేషన్ మాఫియా ఆగడాలు, ఇలాంటి దందాలను కట్టడి చేయాల్సిన బాధ్యత నూతన కలెక్టర్‌పై ఉంది.

- జిల్లాలో వ్యవసాయం తర్వాత ఆక్వా రంగమే కీల కం. గత ప్రభుత్వ విధానాలతో ఈ రంగం పూర్తి గా సంక్షోభంలో కూరుకు పోయింది. జిల్లాలో దాదాపు 22,000 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా, దాదాపు 10,000 మంది ఉపాధి పొం దుతున్నారు. ఆక్వా రంగం తిరోగమన బాట పట్టకుండా, ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి.
- తక్షణమే పరిష్కారించాల్సిన సమస్యల్లో ముఖ్యంగా రైతులకు యూరి యా కొరత ఉంది. పంపిణీ లో అవకతవకలను నియం త్రించాల్సి ఉంది. బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి గోడౌన్ల సమస్య ఉంది.
- నల్లమడవాగు ఆధుని కీకరణ దశాబ్దాల కల. భూ సేకరణ కోసం రూ.180 కోట్లు విడుదలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నల్లమ డ వాగు ఆధునికీకరణకు భూసేకరణ చేయాలి.

పొగాకు మొత్తం కొనుగోలు చేస్తాం

- నల్ల, తెల్ల బర్లీ పొగాకు సాగు చేపట్టొద్దు
- రైతులతో మంత్రి రవికుమార్

పంగులూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్లకు నిల్వ సమస్య గుదిబండగా మారిందని, గోడౌన్లను గుర్తించి పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేపడతామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గతకొద్ది రోజులుగా నిలిపివేసిన పొగాకు కొనుగోళ్లను కొనసాగించాలని శుక్రవారం రైతులు బూదవాడలో మంత్రిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నల్ల, తెల్లబర్లీ పొగాకు సాగు నిషేధించిందని, ప్రైవేట్ కంపెనీల మాటలు నమ్మి రైతులు సాగు చేపట్టవద్దన్నారు. ఇప్పటికే రెండేళ్లకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. కొనుగోలు చేసిన పొగాకు నిల్వ చేసేందుకు గోడౌన్లు లేక సతమతమవుతున్నట్లు తెలిపారు. పొగాకు సాగు చేపట్టకుండా రైతులు ప్రభుత్వానికి సహకరించాలన్నారు.

80శాతం కొనుగోలు చేశాం

రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకులో 80 శాతం కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ తెలిపారు. జిల్లాలో 51 కొనుగోలు కేంద్రాల ద్వారా 10,326 మంది రైతుల నుంచి 17 వేల టన్నుల బర్లీ పొగాకు కొనుగోలు చేశామన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన పొగాకుకు రైతుల ఖాతాలకు నగదు జమ అవుతున్నట్లు తెలిపారు. గుంటూరు పరిసరాలలో గోడౌన్లను గుర్తించామని సోమవారం నుంచి కొనుగోళ్లు తిరిగి ప్రారంభిస్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, తహసీల్దార్ సింగారావు, బయ్యర్ నరసింహారావు రమేష్, రామసుబ్బారావు, కె.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

గేదెల కొనుగోళ్లపై మంత్రికి వీవోఏల ఫిర్యాదు

అద్దంకి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇస్తున్న రుణం ద్వారా కొనుగోలు చేసే గేదెల విషయంలో అధికారులు ఒత్తిడి తెస్తున్నారని పలు మండలాల వీవోఏలు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గంలోని సుమారు 100 మందికి పైగా వీవోఏలు శుక్రవారం చిలకలూరిపేటలో మంత్రిని కలిసి అధికారుల ఒత్తిడి గురించి మొరపెట్టుకున్నారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలను కూడా మంత్రికి మహిళలు చూపిస్తూ జిల్లా అధికారుల అవినీతిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడం లేదని కేవలం బ్యాంకుల ద్వారా రుణం ఇస్తుందని అయినా అధికారులు తాము చెప్పిన దగ్గరే గేదెలను కొనుగోలు చేయాలంటున్నారని మహిళలు మంత్రి ఎదుట వాపోయారు. స్థానికంగా తక్కువ ధరకు గేదెలను కొనుగోలు చేసుకునే అవకాశం ఉన్నా కృష్ణా జిల్లాలోని డెయిరీ ఫాంలోనే కొనుగోలు చేయాలంటున్నారన్నారు. మండలానికి సుమారు 500 గేదెలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. దీంతో మంత్రి వారి సమక్షంలోనే రాష్ట్ర అధికారుల దృష్టికి జిల్లా అధికారుల ఒత్తిడి విషయాన్ని తీసుకెళ్లారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

వణికిస్తున్న విష జ్వరాలు

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిట

కొల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొల్లూరుతో పాటు పలు గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వర పీడితులతో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు తాకిడి పెరిగింది. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో బాధితులు మంచం పడుతున్నారు. ఒకరోజు జ్వరం వచ్చి తగ్గినా వారం పది రోజుల పాటు వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. మొదట జలుబు సోకి ఆ తర్వాత జ్వరం వస్తుందని బాధితులు తెలిపారు. కొల్లూరు పీహెచ్‌సీలో పలువురు చికిత్స పొందుతున్నారు. మూడు నాలుగు రోజులకు కూడా జ్వరం తగ్గని వారు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. శుక్రవారం కొల్లూరు పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు అస్వస్థతకు గురికాగా ఆమెకు సిబ్బంది వైద్య సేవలు అందించాల్సి వచ్చింది. గ్రామాల్లో పారిశుధ్యం అడుగంటడంతో దోమలు, దుర్వాసనలతో అపరిశుభ్ర వాతావరణంలో జ్వరాలు విజృంభిస్తున్నాయని ప్రజలు తెలిపారు. బ్లీచింగ్ సున్నం, దోమల నివారణకు మందులు పిచికారీ చేయించి జ్వరాలు అదుపులోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




జ్వర పీడితులకు ఇంజక్షన్లు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గ్రానైట్‌కు గడ్డుకాలం

- రోజు రోజుకు మూత దిశగా క్వారీలు, ఫ్యాక్టరీలు
- 50 శాతం పన్నులతో అమెరికాకు నిలిచిన ఎగుమతులు
- వచ్చే నెల నుంచి చెక్‌పోస్టులు.. సీనరేజ్ వసూళ్లకు రంగం సిద్ధం

బల్లికురవ మండలంలో ఉన్న స్టీల్ గ్రే కలర్ గ్రానైట్ క్వారీలు



బల్లికురవ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెరిగిన పెట్టుబడులు.. పెరిగిన ఉత్పత్తి.. ఇదే సమయంలో నిలిచిన ఎగుమతులతో గ్రానైట్ పరిశ్రమ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గతంలో ఎంతో డిమాండ్ ఉన్న స్టీల్ గ్రే రకం రాయి అమ్మకాలు ప్రస్తుతం మందగించాయి. దీంతో క్వారీలు, ఫ్యాక్టరీలు మూత పడే పరిస్థితికి చేరాయి. ఇదే సమయంలో ప్రభుత్వం సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేట్ సంస్థకు అప్పగించడంతో మరిన్ని పరిశ్రమల మూతపడక తప్పదని యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే నెలవారీ విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేక పోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోకపోతే పరిశ్రమల ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని నిర్వాహకులు వాపోతున్నారు. క్వారీలు, ఫ్యాక్టరీలపై ఆధారపడి జీవనం సాగించే 20 వేల కుటుంబాలు ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది. బల్లికురవకి సమీపంలోని వీర్లకొండలోని 20 క్వారీల నుంచి నాలుగు దశాబ్ధాలుగా దేశవిదేశాల్లో డిమాండ్ ఉన్న స్టీల్ గ్రే ముడిరాయిని వెలికితీస్తున్నారు. ఇక్కడ నుంచి వచ్చే ముడిరాయి ద్వారా బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు తదితర ప్రాంతాల్లో ఐదు వందల గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పరుపు రాళ్లను కట్ చేస్తున్నారు. గ్రానైట్ రాళ్ల ఎగుమతులు నిలిచి పోవడంతో రెండు నెలల నుంచి ఈ క్వారీలు, ఫ్యాక్టరీలు గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రధానంగా గ్యాంగ్‌సా రాయి అమెరికాకు అత్యధికంగా ఎగుమతి అయ్యేది. పెరిగిన పన్నుల ప్రభావంతో గతంలో ఒక అడుగు రాయికి పన్ను రూ.30 కాగా ఇప్పుడు రూ.150 చెల్లించాల్సి వస్తుందని అందుకే ఎవరూ కొనుగోలుకు ముందుకు రావడం లేదని వ్యాపారులు అంటున్నారు. దీనికి తోడు లోకల్‌గా ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలలో కటింగ్ చేసే స్లాబులు కూడా గతంలో రాజస్థాన్, బెంగళూరు, చెన్నై, మహారాష్ట్రల నుంచి ఆర్డర్లు తగ్గాయి. గతంలో అడుగు రాయి రూ.75కి కొనుగోలు చేస్తే ఇప్పుడు రూ.50కి బతిమిలాడి అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని యజమానులు వాపోతున్నారు. దీంతో క్వారీలను నిర్వహణ చేయలేమని కొందరు యజమానులు ఇప్పటికే మూతకు సిద్ధమవుతున్నారు. కార్మికులు ఉపాధి కోల్పోతారని, యంత్రాలు మరమ్మతులకు గురవుతాయని తప్పనిసరి పరిస్థితుల్లో మరికొందరు క్వారీలను, ఫ్యాక్టరీలను నడుపుతున్నారు. గత నెలలో రెండు వేల మీటర్ల ఉత్పత్తి చేసిన క్వారీ ఇప్పుడు వెయ్యి మీటర్ల రాయిని మాత్రమే వెలికితీస్తున్నది. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రానైట్ పరిశ్రమను కాపాడాలని కార్మికులు, యజమానులు కోరుతున్నారు.



నష్టాలతో ఉత్పత్తిని తగ్గించిన గ్రానైట్ ఫ్యాక్టరీ



ఎగుమతులు లేక క్వారీలలో నిలిచిన ముడిరాయి బ్లాకులు

సీనరేజ్ వసూళ్లపై బెంబేలు

గ్రానైట్ క్వారీలలో లభించే ముడి రాయి సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేట్ సంస్థకు అప్పగించటంతో ముందు ముందు మరింత నష్టాలు తప్పవని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. వచ్చే నెల మెదటి వారం నుంచి చెక్‌పోస్టులు పెట్టేలా సీనరేజ్ వసూళ్ల టెండర్ వేసిన సంస్థ ఇప్పటికే ప్రణాళిక తయారు చేసింది. ఇప్పటి వరకు నాణ్యత తక్కువగా ఉన్న రాళ్లకు సీనరేజ్ చెల్లించకుండానే ఎగుమతులు చేశామని ఇప్పుడు వాటికి కూడా బిల్లులు పెడితే పరిశ్రమలు మూత పడక తప్పదంటున్నారు.

పరిశ్రమలకు ప్రోత్సాహం



గత ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని అంపశయ్యపైకి నెట్టగా కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించేందుకు సిద్ధమైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొత్త పరిశ్రమల స్థాపనే లేకపోగా రాయితీల ఊసే దాదాపు మరచింది. కొవిడ్ విపత్తులో పరిశ్రమలకు అనేక రాయితీలను అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించగా అమలు చేయలేదు. దీంతో జిల్లాలో గ్రానైట్ మొదలుకుని, ఆక్వా సంబంధిత రంగాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఓ దశలో జిల్లాలోని గ్రానైట్ వ్యాపారులంతా కూడా ఫ్యాక్టరీలకు తాళాలు వేసి నిరసన తెలిపిన ఉదం తాలు గత ప్రభుత్వంలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అప్పటి బకాయిలపై దృష్టి పెట్టి వాటి విడుద లకు అనుమతి ఇచ్చింది. జిల్లా వ్యాప్తం గా పెండింగ్ లో ఉన్న దాదాపు రూ.12 కోట్ల బకాయిలు విడు దలకు ఆమోదం తెలిపింది. దీంతో ఆయా పరిశ్రమల యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- పెండింగ్ రాయితీ రూ.12 కోట్లు విడుదల
- ప్రభుత్వ నిర్ణయంపై పారిశ్రామికవర్గాల హర్షం
- జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఊతం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలుగా దాదాపు 390 వరకు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దాదాపు 80,000 మంది వరకు వీటి ద్వారా ఉపాధి పొందుతున్నారు. పారిశ్రామిక వర్గాలకు భరోసా కల్పించాలంటే ముందుగా ప్రోత్సాహకాల రూపంలో పెండింగ్ బకాయిలను విడుదల చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఇందులో భాగంగానే రూ.12 కోట్లు విడుదలకు పచ్చజెండా ఊపింది. రాయితీల విడుదలతో చిన్నతరహా పరిశ్రమలకు ఊపిరి ఇచ్చినట్లే. ఒక్కో పరిశ్రమకు లక్ష నుంచి ఐదు లక్షల వరకు బకాయిలు అందనున్నాయి

చేదు గుర్తులను చెరిపేయాలి..

పరిశ్రమల యజమానులను వైసీపీ ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేసిన సంగతి తెలిసిందే. జే ట్యాక్స్ పేరుతో స్థానిక నేతలు సాగించిన ముడుపుల పర్వాలయితే పరిశ్రమల నిర్వాహకులను బెంబేలెత్తించాయి. ప్రభుత్వం ఆ చేదు గుర్తులను చెరిపేసి పరిశ్రమలకు కొత్త ఊపిరూలా దాలనే నిర్ణయంతో ముందుకెళుతోంది. రాయితీ నగదు కోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న పరిశ్రమల సంఖ్య దాదాపు 550 వరకు ఉన్నట్లు సమాచారం. అనేక దశల వడపోత అనంతరం ప్రభుత్వం వీటి సంఖ్యను 390గా తేల్చి తొలి దశలో భాగంగా ప్రోత్సాహకాల బకాయిలను విడుదల చేసింది. నిబంధనల ప్రకారం పరిశ్రమలు స్థాపించదలచుకున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా కల్పించడంతో పాటు, పారిశ్రామికవర్గాలకు ఫ్రెండ్లీ ప్రభుత్వం అనే సంకేతాలను పంపాలనేదే పాలకుల ఉద్దేశ్యంగా ఉంది. జిల్లాలో పరిశ్రమల ద్వారా ఉపాధి పొందే వారి సంఖ్యను రాబోయే రెండేళ్లలో నాలుగు లక్షల వరకు తీసు కెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. దానిలో భాగంగానే పరిశ్రమలకు రాయితీల విషయంలో ప్రభుత్వం ఆచి తూచి అడుగులేస్తోంది.

పర్యాటకంపై పలువురి ఆసక్తి...

జిల్లాలో ఇప్పటి వరకు పరిశ్రమలు అంటే ముందుగా గుర్తొచ్చేది గ్రానైట్‌తో పాటు ఆక్వా రంగాలే. కానీ ప్రభుత్వం పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించి అడుగులేస్తుండడంతో పరిశ్రమ వర్గాలు తీరప్రాంతంలో ఉన్న అవకాశాలపై ఆసక్తి కనబరుస్తున్నాయి. తీరప్రాంతంలో పరిశ్రమల స్థాపనకుగాని, స్టార్ హోటల్స్‌ను తలదన్నేలా రిసార్టులు నిర్మించాలన్నా పర్యావరణ సమతుల్యత కాపాడాల్సిన అవసరంతో పాటు కోస్టల్ రెగ్యులేటరీ అథారిటీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.



నైపుణ్యంతోనే సమస్యలకు సరైన పరిష్కారం

- పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ కమిషనర్ ముత్యాలరాజు



మాట్లాడుతున్న ముత్యాలరాజు

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలు పెంపొందించుకుంటే సమస్యలకు సరైన పరిష్కారం అందించవచ్చని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ కమిషనర్ రేవు ముత్యాలరాజు తెలిపారు. బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రంలో ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలకు జరుగుతున్న శిక్షణా తరగతులను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు క్రమశిక్షణ, నైపుణ్యాలతో పనిచేస్తూ క్షేత్ర స్థాయిలో సమస్యలకు పరిష్కారం కనుకుని విధి నిర్వహణలో సంతృప్తి పొందాలన్నారు. విధులు నిర్వర్తించే ప్రతిదశలోను సవాళ్లు ఎదురౌతాయని వాటిని సమర్థంగా ఎదుర్కొని పరిష్కరించాలన్నారు. విస్తరణా శిక్షణా కేంద్రం నిర్వాహణ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ జీఎస్ డబ్ల్యుఎస్, వైద్య, విద్య, ఇంజనీరింగ్ తదితర విభాగాల శిక్షణ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ డి.వెంకట్రావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వరప్రసాద్, గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసు, పల్నాడు డీపీవో నాగేశ్వరనాయక్, డీఆర్‌డీఏ పీడీ. కె.శ్రీనివాసరావు, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, డీడీవో సి.హెచ్.వి జయలక్ష్మి, డ్వామా ఏపీడీ బి.సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని రెండు సబ్‌స్టేషన్లలో నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

నేడు ముప్పవరం, పంగులూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం, పంగులూరు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ముప్పవరం పరిధిలో ఉదయం 9 నుంచి 12గంటల వరకు అలవలపాడు, రేణంగివరం, కశ్యాపురం, జాగర్లమూడివారిపాలెం, భైటమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, కొండమూరు గ్రామాలకు సరఫరా నిలిపవేస్తున్నట్లు వివరించారు. పంగులూరు పరిదిలో చెట్లకొమ్మలు తొలగించేందుకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు గ్రామపరిధిలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి ఘన సన్మానం

హాజరైన మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సంతమాగులూరు సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మక్కనవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనిచేస్తున్న పీఎస్ ఉపాధ్యాయురాలు కొల్లి మోహన అంజలి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఇలాంటి అవార్డు రాష్ట్రస్థాయిలో అందుకోవటం సంతోషకరంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఖాశిం, అవార్డు గ్రహీత భర్త శ్రీనివాసరావు, మాజీ హెచ్‌ఎం జాస్తి నారాయణరావు, లక్ష్మీ నరేంద్ర కుమార్, హిందీ టీచర్ నాసర వల్లి, సీనియర్ అసిస్టెంట్ రంగారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి 250 కేజీల బియ్యం పంపిణీ

పర్చూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని ఆశ్రమ వృద్ధాశ్రమానికి దివంగత తులాబంధుల అర్జునయ్య, అనసూయమ్మల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.15వేల విలువ చేసే 250 కేజీల బియ్యాన్ని నిత్యావసర వస్తువల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు మాతృ వియోగం

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షంషుద్దీన్ మాతృమూర్తి షేక్ రెహాన్‌బి శుక్రవారం మృతి చెందారు. మృతి చెందిన వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి ఫోన్‌లో పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

కొత్త ఈపోస్ మిషన్ల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెల్లరేషన్ కార్డుదారులకు పటిష్టంగా రేషన్ పంపిణీ చేసేందుకు ప్రజా ప్రభుత్వం కొత్తగా మంజూరుచేసిన ఈ పోస్ మిషన్లను డీలర్లకు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఒంగోలు పట్టణంలోని రేషన్‌షాపు డీలర్లకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ మిషన్ల పంపిణీని శుక్రవారం చేపట్టారు.

విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలి

ద్రైవాలరావూరు జడ్పీ హైస్కూలులో సైన్స్‌ఫేర్‌లో కోమటి జయరాం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న రాజశేఖర్, డిప్యూటీ డీఈవో గంగాధర్

మేదరమెట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, ఉపాధ్యాయులు ఆవిధంగా అవగాహన కల్పించాలని ఎన్‌ఆర్‌ఐ, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం చెప్పారు. శుక్రవారం మండలంలోని ద్రైవాలరావూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించన సైన్స్‌ఫేర్‌కు ముఖ్య అతిథులుగా ఎన్‌ఆర్‌ఐ, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం, శాస్త్రవేత అందే మురళీకృష్ణ, బాపట్ల, ప్రకాశం జిల్లాల సైన్స్ అధికారులు సాధిక్, రమేష్, డిప్యూటి డీఈవో గంగాధర్ హాజరయ్యారు. మొత్తం 19 పాఠశాలల నుంచి 56 సైన్స్ ప్రయోగాలు వచ్చాయి. వక్తలు మాట్లాడుతూ సొంత గ్రామంలో విద్యార్థుల అభ్యున్నతికి 22 ఏళ్లగా పాటుపడుతున్న కందెపు రాజశేఖర్ అభినందనీయుడన్నారు. అన్ని విభాగాలల్లో ప్రతిభ చూపిన ఇంకొల్లు గరల్స్ హైస్కూల్ విద్యార్థి మోహన్ ప్రథమ స్థానంలో నిలిచారు. మొదటి ఐదు స్థానాల్లో బోదవాడ, నాగండ్ల, పంగులూరు, బోదవాడ, దేవరపాలెం హైస్కూల్స్, ద్వితీయ స్థానంలో మేదరమెట్ల హైస్కూల్, ఇంక్లోలు, అద్దంకి గరల్స్ హైస్కూల్స్, తిమ్మాయపాలెం, ఇంకొల్లు గరల్స్ హై స్కూల్ నిలిచాయి. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోనూరు సీతామహాలక్ష్మి, ఎంఈవో పున్నయ్య, పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పోతురాజు, హరిబాబు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి భూములను విడిపించాలి

అద్దంకి పట్టణంలో 1 నుంచి 7 వార్డుల పరిధిలోని స్థలాలు నిషేధిత జాబితాలోకి

నిలిచిన క్రయ, విక్రయాలు

వేరే సర్వే నెంబరుతో కమలేశ్వర మాన్యం భూమి రిజిస్ట్రేషన్లపై ఫిర్యాదు

మంత్రి రవికుమార్‌కు పలువురు వినతిపత్రాలు అందజేత


భూముల సమస్యపై అర్జీ ఇస్తున్న కౌన్సిలర్లు, నేతలు

అద్దంకి,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని 7 వార్డుల పరిధిలో ఉన్న స్థలాల సర్వే నెంబర్లు నిషేధిత జాబితాలో చుక్కల భూమిగా, దేవదాయశాఖకు చెందినదిగా నమోదు కావటంతో క్రయ, విక్రయాలు నిలిచిపోయాయని పలువురు మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 1, 2, 3, 11, 12, 14, 15, 16 వార్డుల పరిధిలో ఉన్న 1038, 1096 సర్వే నెంబర్లలోని భూమి నిషేధిత జాబితాలో చేరటంతో క్రయ, విక్రయాలు నిలిచిపోయాయి. ఆయా ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో మున్సిపల్ కార్యాలయం వద్ద మంత్రి రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అదే సమయంలో కమలేశ్వరస్వామి మాన్యంలోని స్థలాలను పక్క సర్వే నెంబర్‌గా నమోదు చేసి అమ్మకాలు చేసి రిజిస్టర్ చేస్తున్నారని కూరపాటి వంశీ మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆ అంశాన్ని పరిశీలించాలని తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రలను మంత్రి ఆదేశించారు. ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన పెంచాలని మున్సిపల్, మెప్మా అధికారులకు మంత్రి తెలిపారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు ఎన్ని ఏర్పాటు చేశారనే విషయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వల నిర్మాణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పలువురు పింఛన్లు, ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు రావటంతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

218 మందికి రూ.1.83 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి రవి

అద్దంకి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. నియోజకవర్గంలోని 218 మందికి 1,83,43,916 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఐదుగురికి రూ.9 లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాలను శుక్రవారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రవేశపెడుతున్న కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ విధానం రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా నిలిచి పోతుందన్నారు. రాష్ట్రంలోని ఎక్కువ మంది పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలను అందించాలన్న లక్ష్యంతో కొత్త పాలసీని ప్రభుత్వం తీసుకువస్తుందని చెప్పారు.

గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమైనా ప్రజాసంక్షేమం కోసమే సూపర్‌సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు అమలు చేస్తున్నామన్నారు.

నిధులకు భరోసా..

పనుల పూర్తికి స్పష్టమైన ఆదేశం

వెలిగొండపై సమీక్షలో సీఎం హామీ


హామీ ప్రకారం తొలిదశ పూర్తికి చర్యలు

రూ.2,059 కోట్లు అవసరంగా అధికారులు ప్రతిపాదన

వెంటనే అంగీకరించిన ముఖ్యమంత్రి

ఆర్థికశాఖలో పెండింగ్ ఉన్న రూ.456 కోట్లు

తక్షణం క్లియరెన్స్‌కు ఆదేశం


వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్ ప్రాంతం

పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల వాంచ అయిన వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. తాజాగా రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై నిర్దిష్ట చర్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చారు. తాను పశ్చిమ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఎట్టిపరిస్థితుల్లో వచ్చే ఏడాది జూన్‌కు తొలిదశ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి నీరు ఇవ్వాల్సిందేనని గురువారం జరిగిన పెండింగ్ ప్రాజెక్టుల సమీక్షలో స్పష్టం చేశారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేసమయంలో ఆ లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి, పునరావాస చర్యలకు నిధులపై అధికారులకు భరోసా ఇచ్చారు

ఒంగోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాజా అంచనాల ప్రకారం వెలిగొండ ప్రాజెక్టు వ్యయ అంచనా సుమారు రూ.10వేల కోట్లకు చేరుతుండగా అందుకనుగుణంగా ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలోని పశ్చిమ ప్రాంతంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. అందులోభాగంగా ఆ ప్రాంతానికి అత్యంత కీలకమైన వెలిగొండ పూర్తిపై పలు సందర్భాలలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టు పూర్తికి భరోసా ఇస్తున్న సీఎం అందుకు అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులకు విస్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇతర సందర్భాలలోనూ 2026 జూన్ నాటికి వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తిచేసి నీరివ్వనున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి ఆ మాటకు కట్టుబడి ఉన్నానని తదనుగుణంగా పనులు పూర్తి చేయాల్సిందేనని మరోసారి ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు.

తక్షణం రూ.2వేల కోట్లు కావాలి

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టు పనులపై గురువారం సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష చేశారు. అందులో వెలిగొండ ప్రాజెక్టుపై సవివరంగా సమీక్ష చేశారు. రాష్ట్ర స్థాయి జలవనరుల శాఖ ఉన్నతాధికారులతోపాటు ఇక్కడి నుంచి ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్, ఎస్ఈ అబూత్ ఆలీంలు పాల్గొన్నారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు సుమారు రూ.6వేల కోట్ల వరకు వ్యయం కాగా టన్నెళ్ళ తవ్వకాలు, డ్యామ్‌ల నిర్మాణాలు, ప్రధాన కాలువల తవ్వకాలు, హెడ్ రెగ్యూలేటరీ నిర్మాణం తదితర అనేక పనులు జరిగాయి. కాగా సీఎం ఆదేశాల ప్రకారం వచ్చే జూన్‌కు తొలిదశ పనులు పూర్తిచేసి లక్షా 19వేల ఎకరాలకు సాగునీరు, 8లక్షల మందికి తాగునీరు ఇవ్వాలంటే సుమారు రూ.2,059 కోట్లు నిధులు అవసరంగా ఆ సమీక్షలో అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఆర్థిక శాఖ అనుమతులు పెండింగ్

వెలిగొండ ప్రాజెక్టులో ప్యాకేజీ-2లో పెండింగ్ ఉన్న తీగలేరుపై 26 స్ట్రక్చర్లు, ఫీడర్ కాలువలపై స్ట్రక్చర్లు అలాగే 62 వేల ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా డిస్ట్రిబ్యూషన్ కాలువల పనులకు రూ. 247 కోట్లు ప్యాకేజీ-4లో భాగంగా తూర్పు ప్రధాన కాలువ, 40 స్ట్రక్చర్ల నిర్మాణాలు, 600 మీటర్ల లైనింగ్ ఇతర పనులకు రూ.184 కోట్లు, ప్యాకేజీ 5లో భాగంగా రెండవ టన్నెల్‌లో లైనింగ్ పనులకు రూ.142 కోట్లు, డైవర్షన్ రోడ్డుకు రూ.29 కోట్లు, ఫీడర్ కాలువ లైనింగ్, రిటైన్ వాల్ నిర్మాణాల కోసం రూ.456 కోట్లు, పునరావాస చర్యలకు రూ.1,002 కోట్లు అవసరంగా అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అందులో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు సంబంధించి రూ.456 కోట్లు పనులకు ఆర్థికశాఖ నుంచి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

సీఎంవో అధికారులకు ఆదేశాలు

ఆయా ప్యాకేజీల వారీగా నిధులు ఇచ్చేందుకు సమీక్షా సమావేశంలో అధికారులకు సీఎం చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న అనుమతులు తక్షణం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎంవో అధికారులను ఆదేశించిన ఆయన పునరావాస చర్యలకు అవసరమైన నిధులను తాను చూసుకుంటానన్నారు. మిగిలిన పనులకు సంబంధించి ఉన్నత స్థాయి అధికారులు అవసరానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ రకంగా నిధుల విషయంలో అధికారులకు భరోసా ఇచ్చిన సీఎం ఎట్టి పరిస్థితుల్లో తాను ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం వచ్చే జూన్‌కు తొలిదశ పనులు పూర్తిచేసి ప్రాజెక్టుకు నీరు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. మొత్తం మీద ప్రభుత్వ చర్యలు, సీఎం ఆదేశాలు వెలిగొండపై ఆశాజనక పరిస్థితిని సూచిస్తున్నాయి.

అవీఇవీ

గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జ్యోతి


నాయకులు, కార్యకర్తలతో ఇన్‌చార్జి నల్లగొర్ల శివశ్రీలక్ష్మీజ్యోతి

పర్చూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న గ్రామ పంచాయితీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నల్లగొర్ల శివశ్రీలక్ష్మీ జ్యోతి చెప్పారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు పోతిన సంపత్, పులిపాటి రవి, నల్లగొర్ల రామరాజుయాదవ్, మొహిద్దీన్‌బాషా, యూసఫ్, పేరిరెడ్డి ఆనందరావు, పౌలు, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడల పోటీలు


హైజంప్‌లో పాల్గొన్న విద్యార్థి

కారంచేడు/పర్చూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. రెండు రోజుల నుంచి వాలీబాల్, కబడ్డీ, కోకో, హైజంప్, లాంగ్ జంప్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆయా పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. మండల స్థాయి పోటీలు సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కంటైనర్, లారీ ఢీ.. నిలిచిన ట్రాఫిక్


భవానీసెంటర్‌లో నిలిచిన ట్రాఫిక్

అద్దంకి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారీ కంటైనర్ మలుపు తిరిగే సమయంలో ఎదురుగా వచ్చే లారీని ఢీకొనటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న భారీ కంటైనర్ శుక్రవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో మలుపు తిరిగే సమయంలో ఎదురువచ్చే లారీని పైభాగంలో ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు నామ్ రోడ్డుపై నిలపడంతో రెండు వైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

నేడు కొత్త కలెక్టర్ బాధ్యతలు స్వీకరణ

స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్యతలు ఉంటాయని వెల్లడి

15, 16 తేదీల్లో కలెక్టర్ల సదస్సుకు హాజరు


రాజాబాబు

ఒంగోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 39వ కలెక్టర్‌గా నియమితులైన రాజాబాబు శనివారం ఆ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్రటరిగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడ కలెక్టర్‌గా నియమిస్తూ గత రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 12 జిల్లాల కలెక్టర్ల నియామకం చేసిన ప్రభుత్వం ఈ నెల 15, 16తేదీల్లో రాష్ట్ర స్థాయి కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలో తక్షణం విధులలో చేరాలని ఆదేశించింది. దీంతో ఎక్కువ మంది శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే జిల్లాకు కలెక్టర్‌గా నియమితులైన రాజాబాబు శనివారం ఉదయం 11 గంటలకు ఇక్కడి ప్రకాశం భవనంలోని కలెక్టర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం జిల్లా కీలక అధికారులతో ఈనెల 15, 16 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కలెక్టర్ల సదస్సు అజెండా అంశాలపై సమీక్ష చేయనున్నట్లు సమాచారం. ఇదిలాఉండగా విధి నిర్వహణలో తన ప్రాధాన్యతలు ఉంటాయని రాజాబాబు చెప్పారు. ఇక్కడి ఆంధ్రజ్యోతి ప్రతినిధితో శుక్రవారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ సర్వీసులో వివిధ హోదాల్లో పనిచేసిన తనకు జిల్లా గురించి కూడా సాధారణ అవగాహన ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించాక అక్కడి పరిస్థితులు, ప్రజల అవసరాలు పరిశీలించి ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా దృష్టిసారిస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు సంబంధిత వర్గాలకు పారదర్శకంగా, త్వరితగతిన అందేలా చర్యలు తీసుంటామని తద్వారా ప్రభుత్వ ఆలోచనలు, లక్ష్యాలకు అనుగుణంగా వారి జీవన ప్రమాణాలు పెంపు లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కాగా ఇక్కడి నుంచి గుంటూరు జిల్లాకు బదిలీ అయిన కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం గుంటూరులో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

మొక్కుబడిగానే..

సాదాసీదాగా సాగిన జడ్పీ సమావేశం

లెక్కకు ఏడు అంశాలపై చర్చ నామమాత్రమే

హాజరు కాని టీడీపీ ప్రజాప్రతినిధులు, కలెక్టర్

అలాగే నెల్లూరు, బాపట్ల అధికారులు కూడా..

కేవలం పింఛన్ల మీదనే కొంతసేపు చర్చ

కష్టకాలంలో ఉన్న ప్రజా సమస్యలపై చర్చించి ప్రభుత్వంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళాల్సిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశాన్ని వేదికగా చేసుకొని ఆయా సమస్యలపై విస్తృతంగా చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఏదో నిర్వహించామంటే నిర్వహించామన్న రీతిలో తూతూమంత్రంగా ముగించారు. అధికార పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధులతో పాటు ఉన్నతాధికారులు రాలేదు. అలాగే నెల్లూరు, బాపట్ల జిల్లాల అధికారులు నామమాత్రంగా హాజరయ్యారు. అజెండాలో పదికిపైగా అంశాలు పెట్టిన కేవలం రెండు మూడు శాఖలపైనే చర్చ సాగింది. కేవలం పింఛన్లపైనే వైసీపీ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు కాసేపు హడావుడి చేసి కేవలం మూడు గంటల్లోనే సమావేశాన్ని మమఅనిపించారు.

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11.10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటలకు ముగిసింది. ఈ సమావేశపు అజెండాలో ప్రధానమైన అంశాలు ఉన్నా ఆయా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా సమావేశానికి వచ్చామంటే వచ్చామన్నట్లుగా ఏదో కొంత మంది సభ్యులు మొక్కుబడిగా మాట్లాడారే తప్ప క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి సమాధానాలు రాబట్టాల్సి ఉన్నా అందుకు భిన్నంగా జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన అధికార పార్టీకి చెందిన మంత్రులు, శాసనసభ్యులు హాజరు కావాల్సి ఉన్నా హాజరు కాలేదు. సమావేశానికి రాష్ట్రమంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామితో పాటు ఆ పార్టీకి చెందిన ముఖ్యమైన ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. కేవలం దర్శి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేలు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ తప్ప వైసీపీకి చెందిన శాసనమండలి సభ్యులు కూడా హాజరుకాని పరిస్థితి ఏర్పడింది. మరో వైపు ఈ సమాశానికి ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. కేవలం ప్రకాశం జిల్లాకు చెందిన జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు, బాపట్ల జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ మాత్రమే హాజరు కాగా నెల్లూరు జిల్లా నుంచి జిల్లా స్థాయి అధికారి పాల్గొన లేదు.

నామమాత్రంగా చర్చ

ఇక చర్చ సందర్భంగా మొదటగా పంచాయతీ రాజ్‌కు సంబంధించిన చర్చ జరిగినా కేవలం పది నిమిషాల్లోనే ఆ సబ్జెక్టు ముగిసింది. అనంతరం డీఆర్‌డీఏపై చర్చ జరగ్గా ఎమ్మెల్యేలు శివప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్‌తో పాటు పలు మండలాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు మాట్లాడారు. ఏ ప్రాతిపదికన దివ్యాంగ పింఛన్లను తొలగిస్తారని ప్రశ్నించడమే తప్ప పూర్తిస్థాయిలో సమగ్రంగా చర్చించిన పరిస్థితి లేకుండాపోయింది. ఇలా వైద్యశాఖ, విద్యుత్‌శాఖ, వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖలపై చర్చ జరిగినా నామమాత్రంగానే జరిగింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడం వల్లనే ఆయా సమస్యలపై చర్చ జరగలేదనేది స్పష్టమైంది.

గతంలో జరిగిన జడ్పీ సమావేశంలో ఇరువురు రాష్ట్రమంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామిలు పాల్గొని అటు సభ్యులు అడిగిన ప్రశ్నలతోపాటు వారి దృష్టికి వచ్చిన ఆయా సమస్యలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కానీ ఈసారి ఏదో జడ్పీ సమావేశం సాదాసీదాగా ముగిసింది.

ఏ ప్రాతిపదికన తొలగిస్తారు

జిల్లాలో దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై పలు ప్రాంతాలకు చెందిన సభ్యులు ఏకరువు పెట్టారు. థర్డ్ పార్టీతో విచారణ చేయించి ఏ విధంగా పింఛన్లను తొలగించేందుకు నోటీసులు ఇస్తారని ప్రశ్నించారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో 3వేల మంది పింఛన్లను ఏ ప్రాతిపదికన తొలగించారని ప్రశ్నించారు. ఒకసారి సదరం సర్టిఫికెట్ తీసుకున్న తర్వాత థర్డ్ పార్టీతో విచారణ చేయించి తక్కువశాతం ఉందని ఏ విధంగా నిర్ధారించారని ప్రశ్నించారు. ఈ విధంగా పించన్లు తొలగించడం సరికాదన్నారు. మరో వైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఎంతమందికి పించన్లు ఇచ్చారని ప్రశ్నించారు. దర్శి నియోజకవర్గంలో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు చెల్లించినా ఇంతవరకు వాటిని బిగించిన పరిస్థితి లేదన్నారు. వెంటనే వాటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, పక్కన డీఆర్వో ఓబులేషు, జడ్పీ సీఈవో చిరంజీవి

దివ్యాంగ పింఛన్లపై ధర్నా చేస్తాం

ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో 2,896 మంది పింఛన్లు తొలగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. వారందరికి న్యాయం చేయకపోతే వారితో కలిసి ధర్నా చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కనీసం సమావేశంలో ఆయా అంశాలపై సమాధానం చెప్పేందుకు మంత్రులు రాకపోవడం దారుణంగా ఉందన్నారు.

రైతులను ఆదుకోవాలి

జడ్పీటీసీ, ఎంపీపీలు తిరుపతిరెడ్డి, జీ.లక్ష్మీ, వేమా శ్రీనివాసరావులతో పాటు పలువురు మాట్లాడారు. రైతులు కష్టకాలంలో ఉన్నందున వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు సక్రమంగా ఎరువులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలా కొంతమంది సభ్యులు మాత్రమే ఒకటి ఆరా ఆ ప్రాంతాలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించారనే తప్ప పూర్తిస్థాయిలో ప్రజా సమస్యలపై అధికారుల దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడిన పరిస్థితి లేకుండాపోయింది. ఆయా అంశాల సమయంలో సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో సీఈవో చిరంజీవితోపాటు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ సెకండ్ ఇయర్ విద్యార్థి మృతి


విజయబాబు మృతదేహం

సంతమాగులూరు సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు పల్లెపోగు విజయ్‌బాబు(19) శుక్రవారం సాయంత్రం లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం... పల్లెపోగు విజయ్‌బాబు నర్సరావుపేటలోని నందమూరి బసవ తారక రామారావు డిగ్రీ కళాశాలలో బీకాం సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. రోజూ ఏల్చూరు గ్రామం నుంచి బస్సు పాస్‌తో నరసరావుపేట చేరుకొని కాలేజీకి వెళ్లేవాడు. మోటార్ సైకిల్‌పై కాలేజీకి వెళ్లి తిరుగు ప్రయాణంలో పల్నాడు జిల్లా, ఉప్పలపాడు వద్ద లారీని తప్పించబోయి ఢీకొట్టాడు. విజయ్ బాబు తండ్రి ఆశీర్వాదం చెన్నైలో బేల్దారీ పనులకెళ్లారు. విజయ్‌బాబు ఏల్చూరులో నాయనమ్మ దగ్గర ఉంటూ కాలేజీకి వెళుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఏల్చూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ఈపూరుపాలెం(చీరాల), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. మండల పరిధిలోని ఆంధ్రకేసరినగర్‌కు చెందిన సుపాదం, శిరీష దంపతులు శుక్రవారం ఉదయం స్కూటీపై చీరాల వెళుతుండగా ముందు వెళుతున్న విజయవాడకు చెందిన కారు అకస్మాత్తుగా బ్రేక్ వేశారు. ఈక్రమంలో వెనుక వస్తున్న స్కూటీ వేగంగా కారును ఢీకొనడంతో దంపతులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

10 గొర్రెలను ఎత్తుకెళ్లిన ఆగంతుకులు

మార్టూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో మార్టూరు రెవెన్యూ పరిధిలో గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో పొలాల్లో నిద్రిస్తున్న గొర్రెల మంద నుంచి 10 జీవాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీనిపై గొర్రెల యజమాని మంచాల సుబ్బారావు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్టూరు గ్రామానికి చెందిన మంచాల సుబ్బారావు పొలంలో దాదాపుగా 70 గొర్రెలను మేపుకుంటున్నారు. అదేవిధంగా గురువారం రాత్రి కూడా గొర్రెల మంద పొలంలోనే ఉంది అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెల మంద దగ్గరకు వచ్చి సుబ్బారావును బెదిరించి 10 గొర్రెలను వెంట తీసుకువచ్చిన వాహనంలో తీసుకువెళ్లారు. హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

పర్చూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోర్టు భవనాల సముదాయంలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి కెప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, వివాహ సంబంధ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రెండు బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

16, 17 తేదీలలో మండల స్థాయి ఆటల పోటీలు

సంతమాగులూరు సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చవిటిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 16, 17వ తేదీలలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ద్వారా బాలబాలికలకు అండర్ 14, 17 విభాగాలలో ఆటల పోటీలు జరుగుతాయని ప్రధానోపాధ్యాయులు డేవిడ్, స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ పేరం శ్రీనివాసరావు తెలిపారు. పోటీలకు ముందుగా పరుగు పందాలు నిర్వహిస్తామన్నారు. కోకో, కబడీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా మొదలగు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనాలని కోరారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

చినగంజాం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన ఖాజీపాలెం కేవీఆర్ అండ్ ఎంకే ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు నిర్వహించి, క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భోగిరెడ్డి స్వామిరెడ్డి, మారుబోయిన వెంకటరెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 8గంటలలోపు క్రీడాకారులు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 8247318995, 9542354041, 7416825797 సెల్ నెంబర్లను సంప్రదించాలని వెంకటరెడ్డి తెలిపారు.

జనవరిలోగా విద్యార్థులందరికీ సైకిళ్లు

మంత్రి గొట్టిపాటి


బాలికలకు సైకిళ్లు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులందరికీ జనవరిలోగా ఉచితంగా సైకిళ్లు అందజేస్తామని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. మండలంలోని బూదవాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 191 మంది బాల, బాలికలతోపాటు ప్లస్ 2 విద్యార్థులు 19మందికి మంత్రి రవికుమార్ సైకిళ్లను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రఘురామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ మేఘా సంస్థ, మోర్ ఫౌండేషన్ సమకూర్చిన సీఎస్‌ఆర్ నిధులతో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాం, పుస్తకాలు, భోజన నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

11 పాఠశాలలకు సైకిళ్లు పంపిణీ

నియోజకరవర్గంలో ఇప్పటివరకు 11 పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లు అందజేశామని మంత్రి చెప్పారు. త్వరలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ విష్ణుప్రియ, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, ఎంఈవో వీరాంజనేయులు, ఏఈ హనుమంతరావు, సుమంత్, మండల టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాయకులు కె.వి.సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, నార్నె సుబ్బారావు, ఓబుల్‌రెడ్డి, ఆదిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు అంజిరెడ్డి, బ్రహ్మానందస్వామి, సింగరకొండ, గొల్లపూడి అంజయ్య, చిలుకూరి కోటయ్య, అజిత్‌ట్రస్ట్ ఛైర్మన్ వీరనారాయణ పాల్గొన్నారు.

వీధిదీపాలు వెంటనే ఏర్పాటు చేయండి : మంత్రి ఆదేశం

మండలంలోని బూదవాడలోని ధనలక్ష్మీ కాలనీ నుంచి గ్రామంలోకి వచ్చే రహదారిలో వీధిదీపాలు తక్షణమే ఏర్పాటుచేయాలని డిప్యూటీ ఎంపీడీవో సుమంత్‌ను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. బూదవాడ వచ్చిన మంత్రికి గ్రామస్థులు, రైతులు తమ సమస్యలను వివరించారు. అలాగే గ్రామపొలాలకు వెళ్లే డొంకరహదారుల అభివృద్ధికి చర్యలు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు. ఈనెల 5నుంచి 7వ తేదీవరకు ద్వారకాతిరుమలలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులు లిఖిత, శ్రుతిని మంత్రి గొట్టిపాటి అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు.

సొసైటీలకు ఎరువులు కొరత లేకుండా అందించాలి

రైతుకు అవసరమైన ఎరువులు కొరత లేకుండా అందేలా చర్యలు చేపట్టాలని మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. సొసైటీలకు యూరియా, డీఏపీ లాంటి ఎరువులు పూర్తిగా అందజేయాలన్నారు. ఎరువులు బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం


పోటీలకు హాజరైన విద్యార్థులు

చినగంజాం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : క్రీడలతో శారీరక వికాసంతో పాటు, మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని నియోజకవర్గ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ గంటా అంకమ్మ చెప్పారు. స్థానిక లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాలబాలికలకు శుక్రవారం మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మ మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అండర్-14, 17 విభాగాలలో బాలురకు రన్నింగ్, హైజంప్, షాట్‌పుట్, జావిలన్‌త్రో, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్ల రన్నింగ్ పోటీలు బాలికలకు 600 మీటర్లు, మూడు కిలోమీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. గురు, శుక్రవారాల్లో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, జావిలన్‌త్రో, రన్నింగ్, హైజంప్, షాట్‌పుట్ తదితర పోటీలలో ప్రతిభ చాటిన బాలబాలికలు డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల పీడీలు ఎం.అప్పారావు, సీహెచ్ వెంకటసుబ్బారావు, ఎం.సురేష్‌బాబు, జి.కృష్ణారావు, ఎం.అనిల్, మల్లిక, పీఈటీలు వాణి, కోమలి, ఎన్ఎస్ఐ కోచ్ కుక్కల అనంతకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్రప్రదేశ్' డైరెక్టర్‌గా చిన్ని ప్రమాణ స్వీకారం


చిన్ని లక్ష్మీశ్రీనివాసరావును అభినందిస్తున్న అద్దంకి పట్టణ నేతలు

అద్దంకి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అద్దంకి పట్టణ టీడీపీ అధ్యక్షుడు, అద్దంకి మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును మంత్రి నారాయణ, ఇతర అతిథులు అభినందించారు. అద్దంకి నుంచి వెళ్లిన క్లస్టర్ ఇన్‌చార్జులు కుందారపు రామారావు, కాకాని అశోక్, శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నాయకులు గార్లపాటి శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకర్, కురిచేటి వెంకటసుబ్బారావు, భోజనపల్లి సత్యనారాయణ, నూకల రామాంజనేయులు తదితరులు చిన్ని శ్రీనివాసరావును అభినందించారు.

గ్రామాలలో చేపట్టిన సర్వేలను సత్వరమే పూర్తిచేయాలి


పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న చీరాల డీఎల్‌డీవో పద్మావతి

పంగులూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రభుత్వం నిర్దేశించిన సర్వే కార్యక్రమాలను సిబ్బంది సత్వరమే పూర్తిచేయాలని చీరాల డీఎల్‌డీవో పద్మావతి సూచించారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వామిత్వ, కౌశలం, ఇంటిపన్నులు, శానిటేషన్‌కు సంబంధించిన సర్వేల నిర్వహణపై అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. గ్రామ కంఠాలలో హక్కుదారులకు స్పష్టమైన హక్కుపత్రాలు జారీచేయడమే స్వామిత్వ సర్వేముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాలలో పూర్తి సమాచార సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వామిత్వ సర్వే చేపట్టాయని చెప్పారు. హక్కుదారులకు స్పష్టమైన హక్కుపత్రాలు అందచేయడం వలన క్రయవిక్రయాల సమస్యలు తొలగిపోతాయని, సంబంధిత పత్రాలతో బ్యాంక్ రుణాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. మండలంలోని 21 గ్రామ పంచాయితీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు 94లక్షల 40వేల947 రూపాయలు విడుదలైనట్లు చెప్పారు. అనంతరం గ్రామంలోని చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీవో స్వరూపారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలలో హిందీ భాష దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

బల్లికురవ, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 14న హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన హిందీ పదాలపై ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయురాలు షేక్ జుబేదాబేగం ఆధ్వర్యంలో హిందీ సబ్జెక్టుపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇస్మాయల్ పాల్గొన్నారు.

పందిళ్లపల్లిలో...

పందిళ్లపల్లి(చీరాల), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా బౌహార్ రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హిందీ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దీప్తి, ఉపాధ్యాయులు లలిత పరమేశ్వరీ, ఆంజనేయులు, మహశ్రీ, మాధురి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

తహసీల్దార్‌కు ఏపీటీఎఫ్ నేతల వినతిపత్రం

చీరాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు అందించాలని, ఎరియర్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ చీరాల ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆలూరి శ్రీనివాసరావు, హరికిషన్, వెంకటేశ్వరరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

అద్దంకిలో...

అద్దంకిటౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణం విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.తహసీల్దార్ కార్యాలయం వద్ద టీచర్లు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రమేష్‌బాబు, రామయ్య, మల్లికార్జునావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, అంకయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవలో...

బల్లికురవ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు నల్లబ్యాడ్జీలు ధరించారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, అన్ని రకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, హెల్త్ కార్డుల పరిమితి రూ.25 లక్షలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రవినాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు పార్థసారథి, గోలి శ్రీనివాసరావు, ప్రశాంత్, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

పంగులూరులో...

పంగులూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పంగులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమం అనంతరం ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చేజర్ల చెంచురామారావు, కార్యదర్శి కంకణాల శ్రీనివాసరావులు తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందజేశారు. నేతలు తన్నీరు వెంకటరావు, రహంతుల్లా, ప్రసాద్, నారాయణ, ఆర్.వి.సుబ్బారావు, అనిత,లలిత, అనిల్ కుమార్, నారాయణమ్మ పాల్గొన్నారు.

మార్టూరులో...

మార్టూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్టూరు తహసీల్దారు కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నల్లజెండాలతో నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం తహసీల్దారు ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మాడుగుల కిషోర్,నాదెండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

పోలీసులు మైత్రీభావంతో మెలగాలి

అవీఇవీ

బల్లికురవ పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

బల్లికురవ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ప్రజలతో పోలీసు సిబ్బంది మైత్రీభావంతో మెలిగి గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా చర్యలు చేపట్టాలని బాపట్ల డీఎస్పీ గోగినేని రామంజనేయులు చెప్పారు. శుక్రవారం బల్లికురవ పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ వార్షిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, పెండింగ్‌లో ఉన్నవి, వాటి పురోగతిపై వివరాలను సేకరించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలపై వచ్చే వారి వివరాలను శ్రద్ధగా విని వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అలానే బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు చేపట్టాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహనదారులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సంతమాగులూరు సర్కిల్ సీఐ కాకుమాను వెంకట్రావు, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

నేపాల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించడం హర్షణీయం

నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్


మాట్లాడుతున్న మహేంద్రనాథ్

చీరాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నేపాల్లో చిక్కుకున్న 215 మంది తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి చేర్చిన మంత్రి లోకేష్ సేవలు హర్షణీయమని నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ చెప్పారు. నేపాల్ ఘటనపై వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిన లోకేష్ సేవలను కొనియాడుతూ మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావుతో సమావేశం నిర్వహించారు. థాంక్యూ లోకేష్ సార్ అంటూ నినదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందన్నారు. అంతకుముందు ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచిఅర్జీలు స్వీకరించారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రమేష్

బల్లికురవ, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజూ ఏదో ఒక ఆట ఆడటం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంఈవో రమేష్‌బాబు చెప్పారు. శుక్రవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎంఈవో రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అండర్ 14, 17 విభాగాలలో ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజన్ స్థాయి పోటీలకు పంపుతున్నట్లు ఎంఈవో తెలిపారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహం

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 9, 10 తరగతులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూరా మస్తాన్‌రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ముఖ్య అతిథులుగా పర్చూరు ఎంఈవో డాక్టర్ శివ కోటేశ్వరరావు, బీబీహెచ్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ నాగమాంబ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సరోజని, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి డబ్బు ప్రతిబంధకం కాకూడదు

మేదరమెట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : డబ్బులు లేక చదువుకోలేక పోయాను అని ఎవరూ బాధపడకూడదని విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తానని ఎస్‌ఆర్‌ఐ పూనాటి రవీంద్రబాబు చెప్పారు. శుక్రవారం రావినూతల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు గంటల పాటు విద్యార్థులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో తెలుగు మాధ్యమంలో చదువుకుని అంతర్జాతీయ సంస్థకు వైస్ ప్రెసిడెంట్ బాధ్యతల నిర్వహణ వరకు తన ప్రయాణంలో అనుభవాలను వివరించారు. గ్రామంలో 100కు పైగా పేద కుంటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించడం వెనుక ఉన్న ఉన్నత ఆశయాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన పది మంది ఆడపిల్లలను దత్తత తీసుకుని వారికి ఇంజనీరింగ్ పూర్తి అయ్యే వరకు స్పాన్సర్ చేయడానికి గల పేరణ గురించి ఆయన వివరించారు. తాటి సరోజిని ట్రస్ట్ తరఫున ఆంగ్లవ్యాకరణ పుస్తకాలను ఒంగోలులో ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ చాపల వంశీకృష్ణ పంపిన రాత పుస్తకాలను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బుజ్జి, మోపర్తి శేషారావు, మోపర్తి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పని అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇవ్వాలి

ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ

పర్చూరు, సెపెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పని అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇవ్వాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటస్వామి చెప్పారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రాంగణంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పని కావాలని అడిగిన వారికి జాబ్ కార్డు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఉపాధి పథకం కింద వందరోజులు పని కల్పించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ఏపీవో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకట స్వామి

బార్లకు దరఖాస్తుల గడువు పెంపు

● 17వ తేదీ వరకు స్వీకరణ.. 18న లాటరీ

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బార్లకు దరఖాస్తుల గడువును రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసలునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, 18న ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వారంలో 2 రోజులే!



ఇది సంగం మండలం అన్నారెడ్డి పాళెం శాఖా గ్రంథాలయం. ఇక్కడున్న గ్రంథాలయాధికారి జూన్‌లో నెల్లూరుకు బదిలీ అయ్యారు. మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఈ పోస్టు భర్తీ కాలేదు.



సంగంలోని గ్రంథాలయాధికారి జూలై నెలాఖరులో ఉద్యోగ విరమణ చేశారు. అప్పటినుంచి నెలా 10 రోజుల మూత పడింది. రెండ్రోజుల క్రితం ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన లైబ్రేరియన్ వచ్చారు. ఇక నుంచి వారంలో బుధ, గురువారాలలో మాత్రమే గ్రంథాలయ తలుపులు తెరుచుకుంటాయి. మిగతా రోజులు మళ్లీ మూతే. జిల్లాలో అన్ని గ్రంథాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

- ● మిగిలిన ఐదు రోజులూ మూతే!
- ● జిల్లాలో తెరుచుకోనంటున్న గ్రంథాలయాలు
- ● ఉద్యోగుల కొరతే ప్రధాన కారణం
- ● 140 మందికి ఉన్నది 40 మందే!
- ● ఒక్కొక్కరికి 2, 3 చోట్ల ఇన్‌చార్జ్ బాధ్యతలు
- ● పనిభారంతో సతమతం.. పట్టించుకోని అధికారులు

జిల్లాలో గ్రంథాలయ సంస్థను సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో ఒక్కొక్కరికి రెండు, మూడు చోట్ల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారు ఏ ఒక్క గ్రంథాలయానికీ న్యాయం చేయలేక వారానికి రెండు రోజులు ఒకచోట, మరో రెండు రోజులు మరో గ్రంథాలయంలో విధులు నిర్వహించాల్సిన వస్తోంది. దీంతో మిగతా రోజుల్లో గ్రంథాలయాలు మూత పడుతున్నాయి. జిల్లాలో 61 శాఖా గ్రంథాలయాలు, ఒక జిల్లా గ్రంథాలయం ఉంది. ఉన్నాయి. మొత్తం 140 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 40 మంది మాత్రమే ఉన్నారు. 1993 నుంచి గ్రంథాలయల్లో కొత్తగా సిబ్బందిని నియమించలేదు. ఉన్నవారు ఉద్యోగ విరమణ పొందుతూ చివరకు జిల్లావ్యాప్తంగా 40 మంది మిగిలారు. జిల్లా ప్రధాన గ్రంథాలయంలో ఉన్న ఎల్‌డీసీ, యూడీసీ, జూనియర్, సీనియర్, రికార్డ్ అసిస్టెంట్లకు సైతం పక్క నున్న శాఖా గ్రంథాలయాలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

● నిరుద్యోగులు, పాఠకుల అవస్థలు


పుస్తక బాండాగారాలుగా పేరుగాంచిన గ్రంథాలయాలపై ఎంతో మంది పేద నిరుద్యోగ యువకులు, విద్యార్థులు ఆధారపడి ఉన్నారు. పోటీ పరీక్షలకు పుస్తకాలు, పేపర్లు కొనుగోలు చేయలేక గ్రంథాలయాలకు వచ్చి చదువుకుని తర్ఫీదు పొందుతుంటారు. అయితే, గ్రంథాలయాలు సరిగా తీయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కార్పొరేషన్, మున్సిపల్ కేంద్రాల్లో ఫర్వాలేదనిపించినా, మండల కేంద్రాల్లో మాత్రం వారంలో రెండురోజులు మాత్రమే తలుపులు తెరుచుకుంటున్నాయి. అంతేగాక క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వచ్చే పాఠకులు పుస్తకాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారులు స్పందించి గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

గ్రంథాలయ సెస్సు బకాయిలు రూ.47.91 కోట్లు

ఇరవై ఏళ్లుగా పేరుకుపోయిన అప్పు

కార్పొరేషన్‌దే రూ.41.47 కోట్లు



నెల్లూరు (సాంస్కృతికం) : జిల్లా గ్రంథాలయ సంస్థకు స్థానిక సంస్థలు, ప్రజల నుంచి వసూలు చేసిన గ్రంథాలయ సెస్సు బకాయిలు రూ.47,91,91, 664 ఉన్నాయి. వీటి వసూలుపై అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఏడాదికేడాది కొండలా పేరుకుపోతున్నాయి. సు మారు 20 ఏళ్లుగా వసూళ్లపై దృష్టి పెట్టకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. నెల్లూరు నగర పా లక సంస్థ, కావలి, గూడూరు, ఆత్మకూరు, వెంకటగిరి, నాయుడుపేట, బుచ్చిరెడ్డి పాలెం, అల్లూరు నగర పంచాయతీలతోపాటు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు 2004 వ నుంచి 2025 వరకు బకాయిలు ఉన్నాయి. నెల్లూరు నగర పాలక సంస్థ రూ.41,47,27,891, కావలి రూ.1,19,46,384, గూడూరు రూ.87,62,092, ఆత్మకూరు రూ.50,27,005, వెంకటగిరి రూ.45,86,000, నాయుడుపేట రూ.26,28,826, బుచ్చిరెడ్డిపాలెం రూ.11,52, 043, అల్లూరు రూ.2,43,000, జిల్లావ్యాప్తంగా 961 పంచాయతీల నుంచి రూ.3,01,18,423 వసూలు కావాల్సి ఉంది. గ్రంథాలయ సెస్సులు ఆయా సంస్థల వద్ద ఉండిపోవడంతో జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లాలోని శాఖా గ్రంథాలయాల అభివృద్ధికి ఆటంకాలుగా మారిపోయింది.

వసూళ్లపై దృష్టి పెట్టాలి

సెస్సు బకాయిల వసూళ్లపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలని యని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థలు విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. నగరంలోని గ్రంథాలయ భవన నిర్మాణం నిధులు

- మిగతా 7లో..

ప్యాకేజీ-1పై విచారణ ముమ్మరం

- ● అనేక అవకతవకలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు
- ● ఫైనల్ బిల్లు సమయంలోనే జరిగినట్లు నిర్ధారణ
- ● అప్పట్లో పనిచేసిన అధికారుల వివరాలు ఇవ్వాలని లేఖ
- ● వారందరినీ బాధ్యులను చేసేందుకు సిద్ధం
- ● త్వరలో ప్రభుత్వానికి చేరనున్న నివేదిక
- ● ఎట్టకేలకు కౌంటర్ వేసిన నీటిపారుదల శాఖ

పెన్నా డెల్టా ఆధునీకరణ ప్యాకేజీ-1 పనులపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనా!? విజిలెన్స్ విచారణలో అవకతవకలు బయటపడ్డాయా!? అంటే విశ్వసనీయ వర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. ఫైనల్ బిల్లు సమయంలోనే మొత్తం తతంగమంతా నడిచినట్లుగా విజిలెన్స్ గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఫైనల్ బిల్లు చేసి ప్రీక్లోజ్ చేసిన సమయంలో పనిచేసిన అధికారుల వివరాలన్నీ ఇవ్వాలంటూ తాజాగా విజిలెన్స్ ఎస్పీ నుంచి ఇరిగేషన్ ఎస్ఈకు లేఖ అందడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 17వ తేదీలోపు అధికారుల పేర్లు అందజేస్తే విచారణ త్వరగా ముగిస్తామని ఈ లేఖలో పేర్కొన్నారు. దీనిని బట్టి చూస్తుంటే ప్యాకేజీ-1 వర్కుల్లో అవకతవకలు గుర్తించారని, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలకు సిఫార్సు చేసేందుకే వివరాలు అడుగుతున్నారని ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి. జూన్ నెలలో విచారణ ప్రారంభించిన విజిలెన్స్ అధికారులు దాదాపుగా విచారణ పూర్తి చేసినట్లు సమాచారం. మూడు నెలల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించడమేగాక అనేక రికార్డులను తనిఖీ చేశారు. మరో నెల రోజుల్లోపు ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు విజిలెన్స్ వర్గాల ద్వారా తెలుస్తోంది.



8



నిండుకుండలా ఉన్న సోమశిల జలాశయం

సోమశిల నుంచి ఏ క్షణాన్నైనా నీటి విడుదల

● డ్యాంలో 72.250 టీఎంసీల నిల్వ

అనంతసాగరం సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాయశం నుంచి వరద ప్రవాహం పెరుగుతుండటంతో ఏ క్షణాన్నైనా దిగువకు నీటి విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 21,480 క్యూసెక్కుల నీరు వస్తుండగా, డ్యాంలో 72.250 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,850, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 9,450 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేయనుండటతో పెన్నా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

● కండలేరులో 44 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 44.420 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 9వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా, 1685 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు.

● సంగంలో తగ్గిన నీటిమట్టం

సంగం బ్యారేజీ నుంచి శుక్రవారం పెన్నానదికి 2,825 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో బ్యారేజీ నీటిమట్టం 11.8 అడుగుల నుంచి 11.2 అడుగులకు తగ్గింది. ప్రస్తుతం బ్యారేజీకి 3,725 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. బ్యారేజీకి చేరుతున్న నీటిలో బెజవాడ పాపిరెడ్డి (కావలి) కాలువకు 575 క్యూసెక్కులు, కనుపూరు కాలువకు 200 క్యూసెక్కులు, కనిగిరి రిజర్వాయర్ కాలువకు 30 క్యూసెక్కులు, పెన్నానది దిగువకు 2825 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

కొన్నట్లు నటిస్తూ.. నగలు కొట్టేస్తూ.. బంగారం దొంగతనం చేస్తూ పట్టుపడిన కి'లేడీ'లు 8

అత్యాధునికంగా అత్యవసర సేవ!

అందుబాటులోకి ఏఎల్ఎస్ అంబులెన్స్‌లు



ఉదయగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయాల్లో గంటలోపు వైద్యసేవలు అందిస్తే ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చు. గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించడం ఎంతో అవసరం. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక పరికరాలు, సదుపాయాలున్న అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు (ఏఎల్ఎస్) 108 అంబులెన్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. వైద్యశాలకు వెళ్లేలోపు వాహనంలో ఉన్న సీసీ కెమెరాల సహకారంతో ఎమర్జెన్సీ రెస్పాన్స్‌బుల్ సర్వీసెస్ వైద్యుడి సలహాలు తీసుకుంటూ సేవలు అందించి రోగి ప్రాణాలను కాపాడవచ్చు. ఏఈడీ (ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్), మల్టీ పారా మానిటర్, వెంటిలేటర్ తదితర అత్యాధునిక పరికరాలు అంబులెన్స్‌లో ఉన్నాయి. ఇప్పటికే ఆత్మకూరు, కందుకూరు, నెల్లూరు, కావలి ప్రాంతాల్లో ఏఎల్ఎస్, మిగిలిన ప్రాంతాల్లో బీఎల్ఎస్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. 108 వాహనాల జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక పరికరాలున్న అంబులెన్స్‌లు మరో మూడు జిల్లాకు రానున్నాయని తెలిపారు.

నేడు కొత్త కలెక్టర్ హిమాన్షు శుక్లా బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నూతనంగా కలెక్టర్‌గా నియమితులైన హిమాన్షు శుక్లా శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన హిమాన్షు శుక్లా ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ నెల్లూరు కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. కాగా, ఇక్కడున్న ఆనంద్ అనంతపురానికి బదిలీ అవగా, శుక్రవారం తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, పలువురు అధికారులు, నాయకులు ఆనంద్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

కబ్జా చేసినా.. కిమ్మనలేదు!

- సూరాయపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ఆధారాలతో సహా తేల్చిన రెవెన్యూ అధికారులు
- ఇప్పటికీ ఆక్రమణలు తొలగించని వైనం

పొదలకూరు మండలం సూరాయపాలెంలో కబ్జాకు గురైన 36 ఎకరాల మేత పోరంబోకు భూముల విషయంలో రెవెన్యూ యంత్రాంగం మెతకవైఖరిని ప్రదర్శిస్తోంది. ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు స్వయంగా తహసీల్దార్ వెళ్లి నిర్ధారించినా చర్యలు తీసుకోవడంలో మాత్రం వెనకడుగు వేస్తున్నారు. సుమారు రూ.7 కోట్ల విలువైన ఈ భూమి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఇంకా అక్రమార్కుల చెరలోనే ఉండటం గమనార్హం.

8

మా ఫ్యాన్లు కొనండి.. తక్కువ వడ్డీకే రుణాలిస్తాం!

- ● నాణ్యతలేని ఫ్యాన్లు అంటగట్టి బురిడీ
- ● దుత్తలూరులో లబోదిబోమంటున్న బాధితులు

దుత్తలూరు (ఉదయగిరి), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మోసపోయే వాళ్లు ఉన్నంతకాలం మోసం చేసేవాళ్లు పుట్టగొడుగుల్లా పుడుతూనే ఉంటారు. పేదలు, అమాయకులు వారి మాటలు నమ్మి ఏదో ఒక రూపంలో మోసపోతుంటారు. తీరా మోసపోయామని గ్రహించేలోపే మోసం చేసినోళ్లు పత్తా ఉండరు. ఇలాంటి సంఘటనే దుత్తలూరు మండలంలో వెలుగులోకి వచ్చింది. దుత్తలూరు మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలకు నెల రోజులుగా ఇద్దరు వ్యక్తులు తిరుగుతూ తాము లక్ష్మీ ఫైనాన్స్ అనే సంస్థ ఏర్పాటు చేశామని, అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నాంటూ పల్లెవాసులను నమ్మించారు. అయితే, ముందుగా తమ వద్ద ఫ్యాన్లు తీసుకోవాలని సూచించారు. రుణం వస్తుందనే ఆశతో పలువురు ఒక్కో ఫ్యాన్‌ను రూ.3,200 చొప్పున కొనుగోలు చేశారు. ఫ్యాన్ తీసుకున్న వారికి తక్కువ వడ్డీతో రూ.50 వేల రుణం త్వరలో ఇస్తామని, వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుందని, ఫొటోలు, పత్రాలతో సిద్ధంగా ఉండాలని నమ్మపలికారు. అయితే, రోజులు గడుస్తున్నా ఆ వ్యక్తులు రాకపోవడం, ఫోన్లు పని చేయకపోయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు లబోదిబోమంటున్నారు. ఫ్యాన్లు సైతం ఒక్కొక్కటి రూ.1,200 కంటే ధర పలకదని, అది కూడా సక్రమంగా పని చేయడంలేదని వాపోతున్నారు. అయితే, బాధితులు మాత్రం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఇలాంటి మోసగాళ్లపై పోలీసులు నిఘా ఉంచి, వారి ఆగడాలను అరికట్టాలని పల్లెవాసులు కోరుతున్నారు.



బాధితులకు అంటగట్టిన నాసిరకం ఫ్యాన్లు ఇవే!

ప్రతీ పల్లెకూ త్రీ ఫేజ్!

పనులను వేగవంతం చేయండి

అధికారుల సమీక్షలో విద్యుత్ సీఎండీ సంతోష్‌రావు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతీ పల్లెకు త్రీఫేజ్ కరెంట్‌ను త్వరలో ఏర్పాటు కానున్నదని విద్యుత్ శాఖ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని ఓ కల్యాణమండపంలో సిటీ, రూరల్, కోవూరు డివిజన్ అధికారులతో సీఎండీ సమీక్షించారు. ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా త్రీఫేజ్ ఏర్పాటు చేసే పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా, మండల కేంద్రాల్లో నివాసం లేని ఉద్యోగులకు టీఏ బిల్లులు మంజూరు చేయవద్దని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని తెలిపారు. పీఎం సూర్యఘర్ సోలార్‌కు సంబంధించి ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఇప్పటికే రిజిస్ట్రేషన్లు పూర్తయినందున వారినుంచి అంగీకార పత్రాలను త్వరగా త్వరగా తీసుకోవాలన్నారు. అలాగే బీసీ వర్గాలకు రూ.20 వేలు అదనంగా సబ్సిడీ ఇవ్వనున్నారని, దీనిపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఇక వ్యవసాయ కనెక్షన్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, వెంటనే సర్వీసులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డైరెక్టర్ గురవయ్య, ఎస్ఈ విజయన్, ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, రమేష్‌చౌదరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ సీఎండీ సంతోష్‌రావు

బతికించే తొలి వైద్యం

- ● ప్రథమ చికిత్సకు ఎంతో ప్రాధాన్యత
- ● ఎందరివో ప్రాణాలను నిలబెట్టిన సందర్భాలు
- ● పరిశ్రమల సిబ్బందికి తర్ఫీదు ఎక్కడ..?

నేడు ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే

- వివరాలు 8లో..

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	141
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 550



సార్... మా ఊరికి రోడ్డెయ్యండి!

కొండాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి రహదారి ఏర్పాటుచేయాలంటూ మండలంలోని గరిమెనపెంట పంచాయతీ గజ్జలవారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వివరాల మేరకు.. గరిమెనపెంట గ్రామం నుండి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గజ్జలవారిపల్లె గ్రామానికి మట్టి రోడ్డు ఉంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డులోని గుంతలలో నీరుచేరి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. శుక్రవారం ఉదయం విద్యార్థులు, గ్రామస్థులతో వెళ్తున్న ఆటో మట్టిలో దిగబడిపోయింది. దీంతో విద్యార్థులు ఆటోను నెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం మొత్తం ఇదే సమస్య ఉంటుందని, తమ గ్రామానికి రహదారి నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ, పరిసర ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వసంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణం లోని వెంగళరావునగర్, ఇందిరానగర్, బాలక్రిష్ణారెడ్డినగర్, తుఫాన్‌నగర్, జనతాపేట సౌత్, మున్సిపల్ ఫ్లాట్స్, పెంకుల ఫ్యాక్టరీ సంగం, వైకుంఠపురం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బిట్రగుంటలో...

బిట్రగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల శాఖ అధికారి జడరాయ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచులక్ష్మీపురం, జేపీగూడూరు, ముంగమూరు, వడ్డిపాలెంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో సిబ్బంది మరమ్మతులు చేయనున్నారని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

లింగసముద్రంలో...

లింగసముద్రం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రం సబ్ స్టేషన్లలో శనివారం ఆర్డీఎస్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నందున ఉదయం 8.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ షేక్ ఫిరోజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మొగిలిచెర్ల, నారసింహాపురం, ఆర్ఆర్ పాలెం, పెంట్రాల, రాళ్లపాడు, లింగసముద్రం, వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

కావలి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం రుద్రకోటలోని విక్కీ వైన్స్ సూపర్‌వైజర్‌పై బీరు బాటిల్‌తో దాడిచేసిన ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ బాజీబాబు తెలిపారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం రుద్రకోటలోని వైన్స్ దుకాణం వద్ద బీరుబాటిళ్ల తీసుకునే విషయంలో జరిగిన గొడవలో అక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్ జరుగుమల్లి సందీప్‌పై గుడ్లూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు బీరు బాటిల్‌తో దాడి చేసి పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు నిందితులను గుర్తించి గుడ్లూరు సెంటర్‌లో తిరుగుతుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాజీబాబు తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై కేసు

అల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. అల్లూరు మండలం పురిణిలో 300 కిలోల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను అదుపులోకి తీసుకున్నారు. ఆటోలోని సరుకుని స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో వీఆర్ఏ మృతి



లక్ష్మీనారాయణ భార్య స్వాతికి నగదు అందచేస్తున్న డీటీ శ్యామ్

కొండాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మర్రిగుంట వీఆర్ఏ పర్రె లక్ష్మీనారాయణ(33) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. తహసీల్దార్ సురేష్‌బాబు, డీటీ శ్యామ్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఏలు లక్ష్మీనారాయణ మృతదేహానికి నివాళులర్పించారు. ప్రభుత్వ సహాయంగా మట్టిఖర్చుల నిమిత్తం రూ. 25 వేల నగదును భార్య స్వాతికి అందచేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 4 వర్కర్, 66 హెల్పర్స్ పోస్టులకు 147 మంది అభ్యర్థులు హాజరయ్యారు. దీంతో నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఆర్డీవో అనూష, ఐసీడీఎస్ పీడీ హేన సుజాన్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆరోగ్య శాఖ అధికారి బ్రమ్మేష్‌నాయుడు, ఆర్డీవో కార్యాలయ ఏవో నిర్మలానందబాబా, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

'అధ్వాన' భోజనం!

- అన్నం ముద్దముద్దగా.. కూరలు నీళ్ల నీళ్లగా...
- ఇంటినుండి భోజనం తెచ్చుకుంటున్న విద్యార్థులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వాస్తవాలు వెలుగులోకి...



తిమ్మారెడ్డిపాలెం స్కూల్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

లింగసముద్రం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కాస్త.. 'అధ్వాన' భోజన పథకంగా మార్చేశారు. విద్యార్థుల ఆకలి తీర్చాలన్న సంకల్పంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఏపీ ప్రభుత్వం ఓవైపు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుంటే.. మరోవైపు.. అధికారుల పర్యవేక్షణ లోపం.. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల స్వార్థం వల్ల మధ్యాహ్నవేళ.. రేపటి పౌరుల డొక్కలు ఎండుతున్నాయి.

రుచి.. శుచి లేక డస్ట్‌బిన్ లోకి...

మండలంలోని పలు పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అధ్వానంగా ఉంటోంది. కూరలు కూడా రుచిగా, శుచిగా ఉండడం లేదు. వారంలో ఒక్కసారి కోడిగుడ్డు కూడా ఇవ్వడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. ఇటీవల పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తోంది. అయితే చాలాచోట్ల అన్నం ముద్దగా ఉంటోంది. దీంతో విద్యార్థులు తినలేక డస్ట్‌బిన్‌లో పడేస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనాన్ని విద్యాశాఖాధికారులు తనిఖీ చేయక పోవడం వల్ల ఈ దుస్థితి నెలకొందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



డస్ట్ బిన్‌లో పడేసిన భోజనం

● వెలుగు చూసిన వాస్తవాలివే..

శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్ పెట్టింది. వెంగళాపురంలోని పాఠశాల, తిమ్మారెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా, రెండుచోట్ల మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించారు. వెంగళాపురంలో అన్నం కొంత ముద్దగా ఉంది. మోడల్ స్కూల్లో కూడా అన్నం ముద్దగా ఉంది. ఈ పాఠశాలలో కొందరు విద్యార్థినులు ఇంటి వద్ద నుండి భోజనం తెచ్చుకొని తినడం కనిపించింది. కొందరు విద్యార్థులు అన్నం సగం తిని, సగం తినలేక డస్ట్‌బిన్‌లో పడేశారు. ముద్దగా ఉన్న అన్నం తినలేక పోతున్నట్టు చాలా మంది విద్యార్థులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రిన్సిపాల్ పని మీద బయటకు వెళ్లిన రోజు భోజనం బాగుండదని, ఆ రోజు కోడిగుడ్లు కూడా ఇవ్వరని పలువురు విద్యార్థులు ప్రిన్సిపాల్ ఎదుటే చెప్పారు. ఇలా.. మండలంలోని చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కూరలు రుచిగా ఉండడం లేదు. నీళ్ల నీళ్లగా ఉంటున్నాయి. దీంతో రుచి లేని అన్నం తినలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తలిదండ్రులు కోరుతున్నారు.

రైతులకు ఇఫ్కో ఉచిత బీమా



మాట్లాడుతున్న ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ

బిట్రగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పైరు నాటిన 20 నుంచి 25 రోజుల తరువాత నానో యూరియాని వాడడం వలన మొక్కల్లో పోషక సామర్థ్యం పెరుగుతుందని, ఒక బాటిల్ కొనుగోలుకు పదివేల రూపాయల చొప్పున గరిష్ఠంగా రెండు లక్షల వరకు ఉచిత బీమా పథకం రైతులకు ఇఫ్కో సంస్థ అందిస్తుందని సంస్థ మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. బోగోలు మండలం ముంగమూరు గ్రామ సచివాలయంలో మండల ఎంఏవో శైలజ ఆధ్వర్యంలో భూమి ఆరోగ్యం, పోషకాల ప్రాముఖ్యతపై శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్ర అధికారి సీ మారుతిదేవి హాజరై భూమి ఆరోగ్యం, పోషకాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అధిక మోతాదులో యూరియా వాడకం వల్ల పైరు పెరిగి పురుగులు, తెగుళ్ళ ఎక్కువగా ఆశించడానికి అవకాశం ఉంటుందని, అధికంగా రసాయనిక ఎరువుల వాడకం మాని కంపోస్ట్, పశువుల పేడ, పచ్చిరొట్ట, పిఎండిఎస్ కిట్ల వాడకం వలన భూసారం పెరుగుతుందని కావలి ఏడిఏ సీహెచ్ నాగరాజు అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన శక్తివంతమైన ఆహారాన్ని పండించవచ్చని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుకుమార్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, గ్రామ రైతులు, ఏఈఓ పౌలు, విఏఏ యానాది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఏపీటీఎఫ్ 257



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కలిగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ 257 ఉపాధ్యాయ సంఘ నాయకులు శుక్రవారం తహసీల్దారు గిరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయిలు విడుదల చేయడంలో కానీ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు అందించడంలో గానీ ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదని, దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను విడుదల చేయటం, సీపీఎస్‌ను రద్దు చేయటం, యాప్‌లను అసెస్మెంటు బుక్‌లెట్ విధానాలను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్న అంశాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం మంచిది కాదన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌లు ప్రకటించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచి సమస్యల పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రమణయ్య, శ్రీనివాసులు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి' రిమోట్‌లు..
ఈ 'షాడో' మేటీలు!

- 'ఉపాధి'లో ఊరూరా 'షాడో' మేటీలు!
- నేటికీ గత ప్రభుత్వ మేటీల హవా
- దొంగ మస్టర్లకు సహకరిస్తున్న ప్రస్తుత మేటీలు

ఉలవపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం మారిపోయి ఏడాది దాటినా ఉపాధి పనుల్లో మాత్రం నేటికీ గత ప్రభుత్వ మేటీల హవా మండలంలో నేటికీ కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక గత ప్రభుత్వంలో పనిచేసిన మేటీలు అవినీతికి పాల్పడ్డారని నిర్ధారణకు వచ్చింది. వారి స్థానంలో ప్రతి 50 మంది ఉపాధి కూలీలకు ఒక మేటీ లెక్కన నియమించి పారదర్శకంగా పనులు చేయించాలని అధికారులు భావించారు. అయితే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న మేటీలు మాత్రం వైసీపీ ప్రభుత్వంలో పని చేసిన మేటీల నుండి అవినీతి పాఠాలు నేర్చుకుంటున్నారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న మేటీలకు అవినీతి సలహాలు, సూచనలు ఇచ్చినందుకు గాను.. వైసీపీ ప్రభుత్వంలో పని చేసిన మేటీలు యథావిధిగా వారికి సంబంధించిన వ్యక్తులకు పని డిమాండ్లు, దొంగ మస్టర్లు వేసుకున్నా చూసీ చూడనట్లు వదిలేయాలన్నది ఒప్పందం. ఈ క్రమంలో పాత మేటీల హవా నేటికీ కొనసాగుతుండగా అవినీతి మరకలు మాత్రం రాష్ట్ర ప్రభుత్వానికి అంటగడుతున్నారని తెలుగు తమ్ముళ్లలో ఆవేదన వ్యక్తం అవుతోంది.



రాజుపాలెం చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పనికి రాకున్నా.. ఖాతాల్లోకి డబ్బు జమ

మచ్చుకి ఉలవపాడు పంచాయతీ పరిధిలో ఆన్‌లైన్ రికార్డుల పరంగా 3281 జాబు కార్డులు ఉండగా ప్రస్తుతం యాక్టివ్‌లో ఉండి సుమారు 1700 జాబ్ కార్డులు మాత్రమే. ఉలవపాడు పంచాయతీ పరిధిలో మేటీలు 15 మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మేటీలకు విధి నిర్వహణ, ఉపాధి పనుల డిమాండ్, మస్టర్లు వంటివి తెలియకపోవడంతో గత ప్రభుత్వంలో పని చేసిన మేటీల మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పని చేస్తున్న మేటీలకు కనీసం కూలీల డిమాండ్, మస్టర్లు చదవడం కూడా రాని పరిస్థితుల్లో పాత మేటీల సలహాలు, సూచనలు గత్యంతరం అయ్యాయి. దీనిని ఆసరాగా తీసుకున్న గత ప్రభుత్వంలో పనికి రాకుండా ఇళ్ల వద్ద ఉన్నప్పటికీ దొంగ మస్టర్లు వేసుకుని ఎవరైతే లాభాలు గడించారో ప్రస్తుతం కూడా వాళ్లే మస్టర్లు వేసుకొని పనికి రాకపోయినా వారి ఖాతాలకు డబ్బు పడేలా చూసుకుంటున్నారు. ఇదేబాటలో ప్రస్తుతం మేటీలు కూడా దొంగ మస్టర్లకు అలవాటు పడ్డారు.

పాత మేటీల వ్యవహారాలను అడ్డుకోలేరా?

గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడి ఉపాధి పనుల్లో రూ. లక్షలు సంపాదించడం రుచి మరిగిన పాత మేటీల హవాను అడ్డుకోవడంలో ఫీల్డ్ అసిస్టెంట్ విఫలం అయ్యారని గ్రామస్థులు అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మేటీలే వారందరిని షాడోలుగా మార్చుకొని వారి అడుగుజాడల్లో నడుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాంటప్పుడు వారిని ఏవిధంగా కట్టడి చేయగలమన్న వాదనలు విని పిస్తున్నాయి. ఉలవపాడు ఉపాధి పనుల్లో భారీగా అవినీతి జరుగుతోందని, కట్టడి చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పలు మార్లు ఉపాధి హామీ అధికారులకు సూచించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో పనితీరు సక్రమంగా లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంటును మార్చి మరో వ్యక్తికి బాధ్యతలు అప్పగించారు. ఇకనైనా షాడో మేటీల ఆటలు కట్టించి, వారి అవినీతికి అడ్డుకట్ట వేయకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉందని సర్వత్రా చర్చ జరుగుతోంది.

మిరప సాగు తగ్గిపోతోంది!

- తెగుళ్లు, వైరస్, గిట్టుబాటు ధర లేక విరామం
- సాధారణ విస్తీర్ణంలో నాల్గొవ వంతు కూడా అనుమానమే..

కందుకూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కందుకూరు డివిజన్‌లో మిర్చిసాగు విస్తీర్ణం గత రెండేళ్లుగా గణనీయంగా తగ్గిపోతోంది. ఈ ఏడాది పూర్తిస్థాయిలో సాగుకు రైతులు దూరమవుతోన్నారు. దీంతో సాధారణ సాగు విస్తీర్ణంలో నాలుగోవంతు కూడా సాగవడం కష్టమేనని అంచనా. మిర్చిసాగు అత్యంత వ్యయప్రయాసలతో కూడినది కావడంతో పాటు తామర పురుగు, వైరస్ తెగుళ్ల దెబ్బకు దిగుబడులు తగ్గడం, మరోవైపు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోవడం పరిపాటిగా మారింది. దీంతో రైతులు మిర్చిసాగుకు దూరమవుతున్నారు. గడచిన 3, 4 ఏళ్లుగా మిర్చిసాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. ఈ పరిస్థితుల్లో లక్షలాది రూపాయలు అప్పులు మూటగట్టుకున్న రైతులు సాగుకు విరామం ప్రకటించారు.

● నాలుగో వంతు కూడా అనుమానమే..

కందుకూరు డివిజన్‌లో వాణిజ్య పంటలలో పొగాకు తర్వాత మిర్చికే అత్యంత ప్రాధాన్యం. బావులు, బోర్లు, చెరువులు, కుంటలు ఆధారంగా రమారమి 4వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మిర్చి సాగయ్యేది. కందుకూరు మండలంతో పాటు లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు మండలాల్లోనూ, అడపాదడపా ఉలవపాడు మండలంలో కూడా మిర్చి సాగు చేస్తారు. అయితే కూలీ రేట్లు పెరగడంతో మిర్చిలో ప్రతిపనికీ మనుషుల అవసరం ఎక్కువ కనుక పెట్టుబడి వ్యయం అనూహ్యంగా పెరిగిపోయింది. దీనికి తోడు జెమినీ వైరస్ వదలకుండా మిర్చిరైతును వెంటాడుతున్న తామర పురుగుల నివారణకు ఎకరానికి రూ.లక్ష వరకు పురుగుమందులు కోసం వెచ్చించినా ఆశించిన ఫలితాలు రాక దిగుబడులు తగ్గిపోయాయి. ఎకరం మిర్చి సాగుకు కనీసం రూ.3లక్షల వరకు ఖర్చవుతుండగా 10 క్వింటాళ్లకు మించి దిగుబడి రాని పరిస్థితి. దీంతో క్వింటాల్ రూ.30వేలు ధర పలికితే తప్ప రైతులకు పెట్టుబడి చేతికి రాకపోతుండగా గత రెండేళ్లుగా క్వింటాల్ రూ.10వేలు నుంచి రూ.12వేలు వరకు మాత్రమే ధర పలకటంతో ఎకరానికి రూ.2 లక్షల వరకు రైతులు నష్టపోయారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దీనికితోడు కొందరు రైతులు గిట్టుబాటు ధరలపై ఆశతో కోల్డ్‌స్టోరేజీలలో నిల్వ చేసి వడ్డీలు పెరిగి మరింత నష్టపోయారు. చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాలకు మిర్చి ఎగుమతులు నిలిచిపోవడంతో ధరలు పడిపోయాయని, ఇప్పుడిప్పుడే ఎగుమతి ఆర్డర్లు వస్తున్నాయని, భవిష్యత్తులో ధరలు ఆశాజనకంగా ఉండే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నప్పటికీ ఇప్పటికే పుట్టెడు అప్పులు చేసిన రైతులు మిర్చి సాగంటేనే హడలిపోతున్నారు.



● గణనీయంగా తగ్గిన నర్సరీలు

గత రెండేళ్లుగా మిర్చిసాగు పట్ల రైతులు విముఖత చూపడంతో సాగు విస్తీర్ణం మరింతగా తగ్గుతుందనే అంచనాతో నర్సరీల రైతులు కూడా పరిమాణం గణనీయంగా తగ్గించేశారు. గత ఏడాది 20 లక్షల మొక్కలు పెట్టే ఓ రైతు ఈ ఏడాది కేవలం 3 లక్షలతో సరిపెట్టుకోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. కొందరు పూర్తిగా మానేయగా, కొందరు విస్తీర్ణం భారీగా తగ్గించుకుని నర్సరీలు పెడుతున్నారు. దీంతో మిర్చి విత్తనాలకు కూడా డిమాండ్ తగ్గిపోయింది.

విత్తన డీలర్లు నిబంధనలు పాటించకుంటే చర్యలు

- రూ. 2.24 లక్షల విలువైన విత్తన విక్రయాల నిలిపివేత

కందుకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విత్తనాల డీలర్లు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని అన్నదాత సీడ్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహించి, రూ. 2.24 లక్షల విలువైన వివిధ రకాల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేస్తూ నోటీసు జారీ చేశారు. విత్తన లైసెన్సును పునరుద్ధరించుకోకపోవటం, ధరల పట్టికను ప్రదర్శించకపోవటంతో పాటు రైతులకు విత్తనాల విక్రయానికి సంబంధించి రశీదులు ఇవ్వకపోవటం వంటి లోపాలను గుర్తించారు. లోపాలను సవరించుకోవాలని, లేని పక్షంలో లైసెన్సు రద్దుచేస్తామని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసే ప్రతీ రైతు విధిగా అడిగి రశీదు తీసుకోవాలని, రశీదు లేనిదే భవిష్యత్తులో రైతులకు జరిగే నష్టానికి న్యాయం చేయలేమని తెలిపారు. ఎవరైనా విత్తన డీలర్లు రశీదులు ఇవ్వకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వాతావరణంలో మార్పులతో రైతుల్లో ఆందోళన

అల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో రైతుల్లో ఆందోళన నెలకొంది. శుక్రవారం ఉదయం నుంచి వాతావరణం చల్లబడి చినుకులు పడుతుండడంతో మండలంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వరికోతలు ముమ్మరంగా జరుగుతున్న క్రమంలో వర్షం కురిస్తే వారి పరిస్థితి దయనీయంగా మారుతుంది. ఇప్పటికే ధరలు దిగజారుతుండడంతో వర్షం కురిస్తే మరింత దిగజార్చి దళారులు రైతులను దోచేయడంతోపాటు వరికోత యంత్రాల యజమానులు కూడా ధరలు పెంచేసే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే 1010 రకాలు రూ14200కు పడిపోవడంతో రైతులు నిరాశకు గురవుతు న్నారు. వర్షం కురిస్తే ఈ ధరలు ఇంకా దిగజారిపోతాయే మోనని భయాందోళనకు గురవుతున్నారు.



కోతలు ముగియడంతో విక్రయానికి సిద్ధంగా ధాన్యం

ప్రతీ ఇంటికీ మంచినీటి సరఫరానే లక్ష్యం

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి తాగునీరు అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రశాంతి థియేటర్ ఎదురుగా ఉన్న వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైను, ఇంటింటికీ మంచినీటి కుళాయిలను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. గత ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన సందర్భంగా మహిళలు మంచినీటి సమస్యను తన దృష్టికి తెచ్చారని, ఆరోజు ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు. దీంతో స్థానిక మహిళలు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వేంకటేశ్వర్లు, షేక్ రఫీ, షబ్బీర్, కరీముల్లా, పద్మనాభుని సత్యం రమణయ్య, పేర్నమిట్ట శ్రీనుమస్తాన్, రసూల్, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, పోకూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును అడ్డుకున్న వైసీపీ నాయకుడు

- దిమ్మె ఏర్పాటుకు తీసిన గుంతలు పూడ్చివేత

కావలి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ గాయత్రీనగర్‌లోని వేపకాయల మిల్ సందులో శుక్రవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును ఓ వైసీపీ నేత అడ్డుకున్నాడు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత ఆరు నెలలుగా లోఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక టీడీపీ నేతల ద్వారా ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లటంతో సమస్య సత్వర పరిష్కారానికి ఆ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో విద్యుత్ శాఖ ఏఈ నాగార్జున స్థానికులతో కలిసి వేపకాయల మిల్ గోడ చివరి అంచున రోడ్డు మార్జిన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు రెండు రోజుల క్రితం దిమ్మె ఏర్పాటుకు గుంట తీయించారు. కాగా, శుక్రవారం అధికారులు దిమ్మె ఏర్పాటు పనులు చేపట్టేందుకు వెళ్లి చూడగా గుంటలు పూడ్చి ఉండటంతో పాటు అక్కడ ఉన్న వైసీపీ నాయకుడు దామిశెట్టి పూర్ణచంద్రయ్య తమ వేపకాయల మిల్లుకు వెళ్లేందుకు ట్రాన్స్‌ఫార్మర్ అడ్డు అవుతుందని పక్కకు జరిపి పెట్టుకోవాలంటూ అభ్యంతరం తెలిపాడు. వేపకాయల మిల్ గోడకు మెట్లు ఏర్పాటుచేసి గేటు పెట్టేందుకు అప్పటికప్పుడే పనులు చేపట్టడం అక్కడకు వచ్చిన స్థానికుల్లో చర్చనీయాంశమైంది. కాగా, ఏవైనా అభ్యంతరాలు ఉంటే గుంటలు తీయకముందు చెప్పిఉంటే ప్రత్యామ్నాయం చూసేవారమంటూ అక్కడే పక్కకు జరిపి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసే చర్యలు అధికారులు చేపట్టారు.



ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె గుంతలు పూడ్చి వేపకాయల మిల్ గోడకు మెట్లు కట్టించేందుకు పనులు చేస్తున్న కూలీలు





ప్రభుత్వ భూమి ఆక్రమణ

- తాటిచెట్లు తొలగించి చదును

అనంతసాగరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిగుంట వద్ద గంగమ్మ ఆలయ సమీపంలో కేతమన్నేరువాగు పోరంబోకు స్థలాన్ని కొందరు ఆక్రమించారు. సుమారు రెండు ఎకరాల భూమిలో ఉన్న తాటి చెట్లు తొలగించి చదును చేశారు. భూమి ఆక్రమిస్తే భవిష్యత్తులో పశువుల మేతకు ఇబ్బంది రావడంతో పాటు తాటి చెట్ల వల్ల జీవనం సాగిస్తున్న కల్లుగీత కార్మికులకు జీవనోపాధి లేకుండా పోతుందని, వాగుభూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యూరియా వచ్చిందోచ్..!

బండగానిపల్లి రైతుసేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా 18 టన్నుల ఎరువు

ఉదయగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి రైతుసేవా కేంద్రానికి 18 టన్నుల యూరియా వచ్చినట్లు ఉదయగిరి సబ్ డివిజన్ ఇన్‌చార్జి వ్యవసాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఉదయగిరి రైతుసేవా కేంద్రం-2కి 18 టన్నుల యూరియా రాగా రైతులందరికీ అందలేదు. దీంతో రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. వారు స్పందించి మరో 18 టన్నుల యూరియా పంపించారన్నారు. త్వరలో మరో 18 టన్నుల యూరియా తిరుమలాపురం రైతుసేవా కేంద్రానికి వస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం నుంచి మండలంలోని బండగానిపల్లి, జీ.చెరువుపల్లి రైతుసేవా కేంద్రాల పరిధిలో పంటల సాగు చేసిన రైతులకు ఈ యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గడ్డిజొన్న, జామాయిల్ సాగు రైతులకు యూరియా పంపిణీ చేయరన్నారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



బండగానిపల్లి రైతు సేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న యూరియా బస్తాలు



డేంజర్ జోన్‌లో చేపల వేట

అనంతసాగరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద కండలేరుకు నీరు సరఫరా చేసే వరద కాలువ వద్ద కొందరు ప్రమాదమని తెలిసినా చేపలవేట సాగిస్తున్నారు. అనుమతి లేకుండా నిషేధిత ప్రాంతాల్లో ప్రజలు సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వరద కాలువ అంచున నిలబడి చేపలు పడుతూ గతంలో కొందరు కాలువలో పడి మృత్యువాత పడ్డ ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఇంజనీర్లు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బతికించే తొలి వైద్యం

- ప్రథమ చికిత్సకు ఎంతో ప్రాధాన్యత
- ఎందరివో ప్రాణాలను నిలబెట్టిన సందర్భాలు
- ఏటా వెయ్యి మందికి రెడ్‌క్రాస్ శిక్షణ
- పరిశ్రమల సిబ్బందికి తర్ఫీదు ఎక్కడ..?
- నేడు ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే

అత్యవసర సమయంలో ప్రాణాలు నిలబెట్టేది ప్రాథమిక వైద్యం. ఏదైనా ప్రమాదం, విపత్తు సంభవించినప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి తక్షణం అందించే చికిత్స వారిని రక్షిస్తుంది. ఇందుకు వైద్యులు, వైద్య సిబ్బందే అయి ఉండాల్సిన అవసరం లేదు. కనీస అవగాహన కలిగిన వారు ఎవరైనా... ఆసుపత్రికి చేరేలోపు బాధితుల పరిస్థితి మరింత క్షీణించకుండా ఫస్ట్ ఎయిడ్‌తో ప్రాణాలు నిలబెట్టవచ్చు. ప్రస్తుత సమాజంలో ప్రమాదాలు నానాటికీ పెరిగిపోతున్న తరుణంలో ప్రతీ ఒక్కరు ప్రాథమిక వైద్యం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది వారితోపాటు తోటి వారిని కూడా రక్షించేందుకు తోడ్పడుతుంది.

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య శాస్త్రంలో ప్రాథమిక వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇలాంటి వైద్య చికిత్సల వల్ల జిల్లాలో ఎందరో ప్రాణాలను కాపాడిన సంఘటనలు ఉన్నాయి. జిల్లాలో ఏటా మూడు వేలకుపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిలో గాయపడ్డవారికి స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక వైద్యం అందించి ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఆ తర్వాత వైద్య నిపుణులు చికిత్సలు అందిస్తుంటారు. అలాగే గర్భవతులకు అత్యవసరమైన స్థితిలో ప్రాథమిక వైద్యం ఎంతో ఉపయోగపడుతుంది. జిల్లాలో వెయ్యి మంది వరకు గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యాన్ని అందిస్తున్నారు. ప్రధానంగా గుండె వ్యాధి కారణంగా శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే ప్రాథమిక వైద్యంగా కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) చేయాల్సి ఉంటుంది. ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ, డిజిటల్ ప్రపంచంలో ప్రథమ చికిత్స అన్న నినాదాన్నిచ్చింది. సెల్‌ఫోన్ ద్వారా ప్రాథమిక చికిత్స విధానాలు తెలుసుకుని తక్షణ వైద్యం అందించాలని పిలుపునిచ్చింది.



ప్రాథమిక చికిత్స చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది (ఫైల్)

పరిశ్రమల సిబ్బందికి శిక్షణ ఏది?

జిల్లా వ్యాప్తంగా వందల పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో వేలాది మంది పనిచేస్తున్నారు. ఆయా పరిశ్రమల్లో ఉద్యోగంలో చేరాలంటే ప్రాథమిక వైద్యం సర్టిఫికెట్ తప్పనిసరి. కేవలం 15 రోజులు ప్రాథమిక వైద్యంపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తారు. ఇలాంటి చికిత్స అందించడంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ముందంజలో ఉంది. ఇక్కడ ఏటా 1000 మందికి ఢిల్లీకి చెందిన సెయింట్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ ప్రాథమిక వైద్యంపై శిక్షణ ఇస్తోంది. అలాగే, గ్రామీణ వైద్యులకు నూతన వైద్య విధానాలపై శిక్షణ ఇస్తున్నారు. అయితే ఉద్యోగ నియామకాల్లో చాలా వరకు నకిలీ ప్రాథమిక సర్టిఫికెట్లు సమర్పిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సర్టిఫికెట్లతో ఉద్యోగంలో చేరిన వారు పరిశ్రమలో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఫస్ట్ ఎయిడ్ చేసే అవకాశాలు చాలా తక్కువ. దీనివల్ల ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం, యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.

ప్రాణాలు కాపాడొచ్చు



ప్రాథమిక వైద్యం అందించిన తర్వాత రోగిని ఆసుపత్రికి తీసుకువస్తే వైద్య నిపుణులు అత్యుత్తమ చికిత్స అందించవచ్చు. జిల్లాలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాంటి వారికి అంబులెన్స్ వచ్చేలోపు రక్తం పోకుండా గాయాలకు కట్టుగట్టి చికిత్స చేయాలి. గుండెకు వ్యాధులకు తక్షణం సీపీఆర్ చేస్తే వ్యాధిగ్రస్తులను ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు.

\- కృష్ణమూర్తి, జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్

గ్రామీణ వైద్యుల ప్రాథమిక చికిత్సలు



జిల్లా వ్యాప్తంగా గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యాన్ని అందిస్తున్నారు. రెడ్‌క్రాస్‌లో కూడా శిక్షణ తీసుకున్నారు ప్రభుత్వ వైద్య పథకాలపై ప్రచారం చేస్తున్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణం వైద్యం అందిస్తున్నారు.

\- వేణుగోపాల్, సీహెచ్‌సీ, జిల్లా అధ్యక్షుడు



ప్రాథమిక చికిత్సలు ఇలా..

- పాము కాటుకు గురైనప్పుడు కాటు వేసిఇన భాగాన్ని కదలకుండా ఉంచాలి. బిగుతుగా ఉన్న దుస్తులు, నగలు తీసివేయాలి. వెంటనే వైద్యుని వద్దకు తరలించి చికిత్స అందించాలి.
- గాయపడ్డవారికి గాయాలను శుభ్రపరిచి రక్తం ఎక్కువ పోకుండా గుడ్డతో కట్టు కట్టాలి.
- విషం తాగితే తక్షణం ఆ విషాన్ని కక్కించే ప్రయత్నం చేయాలి.
- అలసటతో ఉన్న వారిని చల్లటి ప్రదేశానికి తరలించాలి. తడి గుడ్డలను శరీరానికి చుట్టి చర్మానికి చల్లదనం ఉండేలా చూడాలి. చలి జ్వరం ఉన్న వారిని దుప్పట్లతో చుట్టాలి.
- మూర్ఛ పోయిన రోగిని తక్షణం తిప్పి పడుకోబెట్టాలి, గాలి బాగా అందేలా చూడాలి. కొద్దిగా కోలుకోగానే వైద్యుడ్ని సంప్రదించాలి.
- డీహైడ్రేషన్‌కు గురైన వారికి వెంటనే నీరు తాగించాలి, చల్లని ప్రదేశానికి తరలించాలి. లో షుగర్‌తో ఉన్న వారికి తీపి పదార్థం ఇవ్వాలి,
- గుండె వ్యాధి వల్ల ఊపిరితీసుకోవటంలో ఇబ్బందులు ఎదురయితే వెంటనే సీపీఆర్ చేయాలి. ఆస్తమా వ్యాధిగ్రస్తులకు ఇన్‌హేలర్‌ను వినియోగించాలి.
- కాలిన గాయాలకు బర్న్ క్రీమ్ రాయాలి. ప్రాథమిక వైద్యానికి అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంచుకోవాలి.

పీఆర్ ఇంజనీర్లకు నేడు ఆటల పోటీలు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం, డిప్లొమో ఇంజనీర్ల సంఘం సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ ఎం.బాబురావు, కార్యదర్శి ఎస్‌కే.ఖాదర్‌మస్తాన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పంచాయితీరాజ్ శాఖలో అన్ని స్థాయిల ఇంజనీర్లు, ఇతర ఉద్యోగులకు క్రికెట్, షటిల్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, రింగ్‌బాల్, పరుగు పందెం పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. విజేతలకు ఈనెల 15వ తేదీన జడ్పీ కార్యాలయ నూతన సమావేశ మందిరంలో జరిగే ఇంజనీర్స్‌డే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ శనివారం ఉదయం 8 గంటలకు స్టేడియంలో హాజరు కావాలని తెలిపారు.

సచివాలయాలపై నిఘా

- ప్రత్యేకాధికారులతో పర్యవేక్షణ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వాటిపై నిరంతర నిఘా ఉంచుతూ ప్రత్యేకాధికారుల ద్వారా పర్యవేక్షించేందుకు అడుగులు వేస్తోంది. ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో జిల్లావ్యాప్తంగా 769 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. అయితే, పర్యవేక్షణ లేనికారణంగా ఆశించిన సేవలు అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాంటి సచివాలయాల్లో నెలకొన్న లోపాలను సరిదిద్దడంతోపాటు ఉద్యోగులను గాడిన పెట్టేందుకు డీఎల్‌డీవో స్థాయి ప్రత్యేక అధికారిని కలెక్టరేట్ పరిధిలో నియమించనున్నారు. అంతేగాక ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న జిల్లా కార్యాలయం నుంచి ఆయన పర్యవేక్షించనున్నారు. మండల స్థాయిలోనూ ఏవో హోదా కలిగిన అధికారిని నియమించనున్నారు. అతిత్వరలో అధికారులతోపాటు సిబ్బంది సైతం నియమించే అవకాశాలు ఉన్నాయి. ఈమేరకు జీవో నెం.10 విడుదల చేస్తూ జిల్లా ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

ప్యాకేజీ-1పై విచారణ ముమ్మరం

- అనేక అవకతవకలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు
- ఫైనల్ బిల్లు సమయంలోనే జరిగినట్లు నిర్ధారణ
- అప్పట్లో పనిచేసిన అధికారుల వివరాలు ఇవ్వాలని లేఖ
- వారందరినీ బాధ్యులను చేసేందుకు సిద్ధం
- త్వరలో ప్రభుత్వానికి చేరనున్న నివేదిక
- ఎట్టకేలకు కౌంటర్ వేసిన ఇరిగేషన్ శాఖ

నెల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెన్నా డెల్టా సిస్టమ్‌ను ఆధునికీకరించేందుకు 2008-09లో రూ.308 కోట్ల అంచనాలతో ప్యాకేజీ-1 పేరుతో టెండర్లు పిలిచారు. మోడరనైజేషన్ చేయడమే కాకుండా 124 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలన్నది ఉద్దేశం. ఈ వర్కును అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ఓ వైసీపీ కీలక నేత 4.95 శాతం ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అయితే ఈ వర్కు అనుకున్న విధంగా పూర్తి కాలేదు. అనేక సార్లు రివైజ్ చేయించుకున్నారు. నిబంధనల ప్రకారం పనులు జరగలేదని, కాలువల లైనింగ్ వెడల్పులను తగ్గించి పనులు చేశారని గతంలోనే అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయితే నాడు ఎవరూ పట్టించుకోలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్యాకేజీ-1 వర్కును ప్రీక్లోజ్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. 2020, జులైలో ప్రీక్లోజ్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రీక్లోజ్‌లో భాగంగా అప్పటి వరకూ కాంట్రాక్టర్ చేసిన పనులన్నింటికీ ఎంబుక్ రికార్డింగ్ చేసి, వాటికి చెక్ మెజర్మెంట్ చేశారు. ఫైనల్ బిల్లు మొత్తం రూ.67 కోట్లు చెల్లించాలని తేల్చారు. ఈ మేరకు చేసిన పనులను పరిశీలించి క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ జారీ చేయాలని నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ నుంచి 2021, ఫిబ్రవరిలో క్వాలిటీ కంట్రోల్ ఈఈకు లేఖ వెళ్లింది. ఈ రిక్విజిషన్ ప్రకారం మొదట క్యూసీ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇందులో ఒక సర్టిఫికెట్లో దిద్దుబాటు చేసి రూ.4.12 కోట్లను అదనం చేర్చారు. ఇదే పేరుతో మరో రూ.4.40 కోట్లతో మరో సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఇక ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశాక సీఈ అంచనాలు రివైజ్ చేయడం కూడా మరో వివాదంగా ఉంది. ఇక ఇందులో బ్యాంక్ కమీషన్ చార్జీలకు రూ.50 లక్షలకు అనుమతి ఇవ్వగా బిల్లులో మాత్రం దాదాపు రూ.2 కోట్లకుపైగా పెట్టినట్లు ఫిర్యాదులున్నాయి. అలానే ఈపీసీ విధానంలో క్యూసీ చార్జీలను కాంట్రాక్టరే భరించాల్సి ఉండగా, ఆ మొత్తాన్ని కూడా బిల్లుల్లో చేర్చారన్న ఆరోపణలున్నాయి. ఇలా ఒక లెక్కా పక్కా లేకుండా వివాదాలకు తావిచ్చేలా ప్యాకేజీ-1 ప్రీక్లోజ్ ప్రక్రియ జరిగింది.

'ఆంధ్రజ్యోతి' కథనాలతో కదలిక

గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో హడావిడిగా ఈ బిల్లును సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. అప్‌లోడ్ చేయడమే తడువుగా ఈ బిల్లులు పరుగులు పెట్టింది. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో డబ్బులు విడుదల కాలేదు. ఇక ప్రభుత్వం మారగానే ఇరిగేషన్ అధికారులు సాంకేతిక కారణాల పేరుతో ప్యాకేజీ-1 బిల్లును సీఎఫ్ఎంఎస్ నుంచి వెనక్కు తెచ్చారు. ఆ తర్వాత ఎటువంటి తదుపరి చర్యలు లేకుండా మిన్నుకుండిపోగా కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించారు. ఆ క్రమంలో ప్యాకేజీ-1లో జరిగిన అవకతవకలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో వరుస కథనాలు ప్రచురించింది. ఈ కథనాలపై స్పందించిన కలెక్టర్ ఆనంద్.. ప్యాకేజీ-1 వర్కుపై నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అయినా కలెక్టర్‌కు నివేదిక అందలేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ప్యాకేజీ-1 వర్కుపై వస్తున్న ఆరోపణలను నిగ్గు తేల్చడానికి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. కాగా ఏడాది క్రితం కాంట్రాక్టర్ హైకోర్టుకెళ్లగా, ఇటీవల ఇరిగేషన్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. విజిలెన్స్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో బిల్లు చెల్లింపు సాధ్యం కాదని స్పష్టం చేశారు.

- ఏపీ బీసీ సంక్షేమ సంఘం ర్యాలీ

ఎన్నికల హామీలు అమలు చేయాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు 2024 సాధారణ ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పనమాల శ్రీహరిరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం బీసీ కులాల ప్రజలు, నాయకులు నెల్లూరు నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని డీఆర్వో విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీలకు, ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని కూటమి పార్టీల నాయకులు వాగ్దానం చేశారని, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మూడు నెలల ముందే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించిందని, కులగణన సమగ్రంగా నిర్వహించకుండా రిజర్వేషన్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ముందు కులగణన చేపట్టాలన్నా రు. బీసీల జనాభా ప్రకారం సబ్‌ప్లాన్ రూపొందించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. రాజధాని అమరావతిలో పూలే స్మృతి వనం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి ముంగర శైలజ, రాష్ట్ర మహిళా నాయకురాలు పద్మజ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కే సలీం, రాముగౌడ్, కోవూరు నియోజవర్గ ఇన్‌చార్జి పెంచలయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వో విజయకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీహరిరావు, పద్మజ తదితరులు

కొన్నట్లు నటిస్తూ.. నగలు కొట్టేస్తూ..

- బంగారం దొంగతనం చేస్తూ పట్టుబడిన కి'లేడీ'లు



పట్టుబడ్డ మహిళలను విచారిస్తున్న పోలీసులు

ఉలవపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బంగారం షాపులో నగలు కొనుగోలు చేస్తున్నట్లు వ్యవహరించి, ఆభరణాలు దొంగిలిస్తూ పట్టుబడిన ఇద్దరు మహిళలపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. కృష్ణాజిల్లా, ఇర్లపాడు మండలం గోకరాజుపల్లికి చెందిన ఇద్దరు మహిళలు శుక్రవారం ఉలవపాడు కృష్ణానగర్‌లోని సాబ్‌జాన్ గోల్డ్‌షాపులో నగలు కొనుగోలు చేసేందుకు వచ్చారు. గత నెలలో ఈ ఇద్దరు మహిళలు ఇలాగే ఆభరణాలు కొనేందుకు వచ్చి రూ. లక్ష విలువ చేసే 4 జతల బంగారు కమ్మలు దొంగిలించుకువెళ్లారు. అనుమానం వచ్చిన షాపు యజమాని సీసీ ఫుటేజీల ద్వారా మహిళలను గుర్తించారు. గత నెలలో దొంగతనం చేసిన ఈ మహిళలు శుక్రవారం మరోసారి రాగా వెంటనే గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇద్దరు మహిళలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. గోల్డ్‌షాపు గుమస్తా షేక్ సుల్తాన్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగతనానికి పాల్పడిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కావలి రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన కావలి మండలం ఆనెమడుగు పంచాయతీ బైనేటివారిపాలెంలో గురువారం రాత్రి జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు... బైనేటివారిపాలెం గ్రామానికి చెందిన పరుసు వేణుకు చెందిన పూరింట్లో పరుసు రాఘవులు, రమ వారి నలుగురు కుమారైలతో ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించటంతో ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీసి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వారు వచ్చేసరికి ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల ఆస్తినష్టం వాటిల్లిందని, అధికారులు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కబ్జా చేసినా.. కిమ్మనలేదు !

- సూరాయపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ
- పేదల పేరుతో పట్టాలు.. పెద్దల చేతుల్లో భూములు
- ఆధారాలతో సహా తేల్చిన రెవెన్యూ అధికారులు
- ఇప్పటికీ ఆక్రమణలు తొలగించని వైనం
- వైసీపీ నేతల ఒత్తిడికి లొంగుతున్న అధికారులు ?

నెల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మండలం సూరాయపాలెంలోని సర్వే నంబరు 352లో 36.69 ఎకరాల మేత పోరంబోకు భూమి ఉంది. పెన్నానదికి సమీపంలో ఉండటంతో ఈ భూమికి మంచి విలువుంది. కొన్ని శతాబ్దాల నుంచి ఆ చుట్టు పక్కల గ్రామాల్లోని మూగ జీవాల మేతకు ఈ భూమి ఉపయోగపడేది. బ్రిటీషు కాలం నాటి రెవెన్యూ రికార్డుల నుంచే ఈ భూమి మేత పోరంబోకుగా నమోదై ఉంది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి నాయకుల కళ్లు ఈ భూమిపై పడ్డాయి. అదే తడువుగా తొలుత 10 ఎకరాలను ఆక్రమించారు. ఆ భూమిలో సవక చెట్లు నాటారు. ఆ తర్వాత భూమి లేని నిరుపేదలకు ఈ భూమిని పంపిణీ చేసినట్లు రికార్డుల్లో రాసుకొని వైసీపీ నేతలు స్వాహా చేశారు. ఇలా ఆక్రమించిన భూమిలో మామిడి చెట్లు సాగు చేస్తున్నారు. నాడు ఎన్ని ఆరోపణలు, ఫిర్యాదులు అందినా, రెవెన్యూ అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ అక్రమాలపై విచారణ ప్రారంభించారు. పొదలకూరు తహసీల్దార్ గ్రామం లోకి వెళ్లి గ్రామసభ నిర్వహించారు. ఆ మేతపోరంబోకు భూమిని పంపిణీ చేయడానికి కుదరదని చెబుతూనే, ఎవరెవరి పేర్లపై పట్టాలు ఇచ్చారో చదివి వినిపించారు. అయితే ఆ పట్టాదారులెవరికీ వారి పేరుపై మేత పోరంబోకు భూమిని మంజూరు చేసినట్లు తెలియకపోవడం గమనార్హం. నాడు అధికార దర్పంతో ఆక్రమణదారులు ఈ విషయాలు బయటకు రాకుండా చూసుకున్నారు.

- నోటీసులిచ్చి వదిలేశారు..!

మేత పోరంబోకు భూమి ఆక్రమణ వ్యవహారంలో జరిగిన అవకతవకలను నివేదిక రూపంలో తహసీల్దార్ జిల్లా ఉన్నతాధికారులకు పంపారు. అయితే ఇది జరిగి నెలలు గడుస్తున్నా ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సాగు చేస్తున్న వారికి నోటీసులిచ్చి వదిలేశారు. గతంలో ఆ భూమిలోకి ఎవరూ వెళ్లడానికి లేదని తహసీల్దార్ పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ ఆ బోర్డులు పోయి ఇప్పుడు సాగు జరుగుతోంది.



సూరాయపాలెంలోని మేత పోరంబోకు భూమిలో నాటిన మామిడి చెట్లు

పేదలకు తెలియకుండా వారి పేర్లపై పట్టాలు ఇచ్చి, వేరొకరు భూమిని అనుభవంలో పెట్టుకోవడం మరో రకమైన నేరమని రెవెన్యూ నిపుణులు చెబుతున్నారు. మరి ఏ రకంగానూ ఈ మేతపోరంబోకు భూమి వ్యవహారంలో అడుగులు ముందుకు పడకపోతుండడంతో అనేక ప్రచారాలు ఊపందుకున్నాయి. వైసీపీ నేతల ఒత్తిళ్లకు జిల్లా అధికారులు తలొగ్గుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. కాగా ఈ విషయమై నెల్లూరు ఆర్డీవో అనూషను వివరణ కోరగా తహసీల్దార్ నుంచి నివేదిక వచ్చిందని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.